CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 42 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ బుధవారం 24 డిసెంబర్ 2025 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 42 PAGES : 12 EDITOR : G A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD WED 24 DECEMBER 2025 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు నోటీసులు?

### మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌కు కూడా..?

- విచారణకు సిద్ధమవుతున్న సిట్
- మాజీ సీఎస్ సోమేశ్, నవీన్ చంద్ విచారణ పూర్తి
- అసెంబ్లీ సమావేశాల తర్వాత మాజీ సీఎంకూ జారీ
- సజ్జనార్ బాధ్యతలు స్వీకరించాక మరింత దూకుడు




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సజ్జనార్ నేతృత్వంలోని సిట్ దూకుడు పెంచుతోంది. త్వరలో మాజీ సీఎం కేసీఆర్ తో పాటు ఇద్దరు మంత్రులకు సిట్ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఉంది. మాజీ సీఎం కేసీఆర్ తో పాటు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులకు నోటీసులు ఇచ్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. అసెంబ్లీ సమావేశాల తర్వాత నోటీసులు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది.అప్పటి ప్రభుత్వ పెద్దలైన కేసీఆర్, హరీష్, కేటీఆర్ ల కోసం టాపింగ్ చేసినట్లు ప్రభాకర్ రావు విచారణలో చెప్పారు. ఓ ఛానల్ ఎండితో కలిసి హరీష్ రావు టాపింగ్ చేయించినట్లు గుర్తించారు . కొంతమంది కోసం కేటీఆర్ టాపింగ్ చేయించినట్లు సమాచారం.

**సోమేశ్ విచారణ**

ఈ కేసులో గత ప్రభుత్వ హయాంలో చీఫ్ సెక్రటరీగా పనిచేసిన సోమేశ్ కుమార్, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్ చంద్‌ను స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(ఎస్ఐటీ) విచారించింది. ఈ కేసులో సాక్షులుగా వారి స్టేట్‌మెంట్ రికార్డ్ చేసింది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి రివ్యూ కమిటీ విధివిధానాలు సహా స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్( ఎస్ఐబీ) చీఫ్‌గా ప్రభాకర్ రావు నియామకం గురించి వివరాలు సేకరించింది. ప్రధానంగా 2023 నవంబర్ 1 నుంచి 15 వ తేదీ వరకు ట్యాపింగ్ చేసిన 618 నంబర్ల వివరాలతో ప్రశ్నించి నట్టు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్‌పై ప్రభాకర్ రావు ఇచ్చిన నోట్ ఫైల్‌కు సంబంధించిన వివరాలతో వీరిద్దరి స్టేట్‌మెంట్లు రికార్డ్ చేసినట్టు సమాచారం.

**నవీన్ చంద్ చీఫ్‌గా ప్రభాకర్ రావుకు ఆదేశాలు**

సోమేశ్ కుమార్, నవీన్ చంద్ ఇచ్చిన వాగ్మూలం ఆధారంగా సజ్జనార్ ఆధ్వర్యంలో సిట్ దూకుడు పెంచింది. ప్రధానంగా సోమేశ్ కుమార్ సీఎస్‌గా బాధ్యతలు నిర్వహించిన 2019 డిసెంబర్ నుంచి 2023 జనవరి మధ్య కాలంలో జరిగిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంపై సిట్ స్పెషల్ ఫోకస్ పెట్టినట్టు సమాచారం.వీరిద్దరూ ప్రభాకర్ రావు బృందానికి ఎలాంటి ఆదేశాలు జారీ చేశారనే వివరాలను సేకరించినట్టు తెలిసింది. నవీన్‌చంద్ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న సమయంలో ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్‌గా పనిచేశారు. అదే సమయంలో రివ్యూ కమిటీ సభ్యులుగా ఉన్న అధికారులను కూడా ప్రశ్నించేందుకు సిట్ ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. కాగా నాటి హోంశాఖ సెక్రటరీ, మాజీ డీజీపీ సహా పలువురు మాజీ పోలీస్ అధికారులకు సిట్ నోటీసులు జారీ చేసే అవకాశాలు ఉన్నాయి.

## మెడిసిన్ పని చేయకుంటే శస్త్రచికిత్స అవసరం

### అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ



- బంగ్లాతో దౌత్యానికి సమయం దాటి పోయింది శస్త్ర చికిత్స అవసరమన్న హిమంత
- చికెన్స్ నెక్‘ను భారత్ కాపాడుకోవాల్సి ఉందని వ్యాఖ్య
- ఆందోళన అంతా వ్యూహాత్మకంగా కీలకమైన చికెన్స్ నెక్ గురించేనని వ్యాఖ్య

వివరాలు 2లో..

## చైనా, పాకిస్థాన్‌తో వివాదాలు..

### యుద్ధాలకు సిద్ధంగా ఉండాలని సీడీఎస్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు

- ఉగ్రవాదం, సరిహద్దు వివాదాలు సవాళ్లుగా ఉన్నాయన్న అనిల్ చౌహాన్
- ఇద్దరు ప్రత్యర్థులు అణుసామర్థ్యం కలిగి ఉన్నారన్న సీడీఎస్
- ఎలాంటి సవాలునైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని వ్యాఖ్య

వివరాలు 2లో..





## ఉచిత బస్సు మహిళలు అడిగారా..?

### ప్రజలను సోమరిపోతులను చేస్తుండ్రు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

- కష్టపడే వారికి చేయూత నివ్వాలి
- ఉచితంగా నాణ్యమైన విద్యా, వైద్యమే ఇవ్వాలి
- నేను పదవి విరమణ మాత్రమే చేశా.. పెదవి విరమణ చేయలే
- నాయకులకు తప్పుడు భాష మాట్లాడటం అలవాటైంది

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచిత పథకాలపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉచితాలతో ప్రజలను సోమరి పోతులను తయారు చేస్తున్నారని అన్నారు. కష్టపడే వారికి చేయుత నివ్వాలని అన్నారు. ఉచిత బస్సు ఇవ్వుమని మహిళలు అడిగారా? అని ప్రశ్నించారు. నారాయణగూడ కేశవ్ మెమోరియల్ కళాశాలలో సర్దార్ పటేల్ ఆడిటోరియంలో నిర్వహించిన అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అటల్ బిహారీ వాజ్ పేయి జీవితం తెరిచిన పుస్తకం.. ప్రతి పేజీ స్ఫూర్తి దాయకమన్నారు. బీజేపీకి బలమైన పునాది వేసిన వ్యక్తుల్లో వాజ్ పేయి ముందు వరుసలో ఉంటారని చెప్పారు. వాజ్ పేయిని.. శ్యాం ప్రసాద్ ముఖర్జీ శిష్యు డిగా ఎంచుకున్నారని తెలిపారు. వాజ్ పేయి పాలన

వివరాలు 2లో..

## మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

- ఏవోబీ సరిహద్దులో లొంగిపోయిన 22 మంది మావోలు
- లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు
- లొంగిపోయిన మావోయిస్టులపై రూ.2.18 కోట్ల రివార్డు



**హైదరాబాద్ పెన్ పవర్::**ఆంధ్రఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒడిశా మల్కాన్‌గిరి జిల్లాలో 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు, ఆరుగురు ఏరియా

వివరాలు 2లో..

## ఏసీబీ సోదాలు.. మహబూబ్‌నగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వద్ద రూ.36 కోట్ల ఆస్తుల గుర్తింపు

- హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ సహా పలు ప్రాంతాల్లో సోదాలు
- గుర్తించిన ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.36 కోట్లకు పైగా ఉంటుందని అంచనా
- హోటళ్లు, స్థిర, చరాస్తులు, బ్యాంకులో కిలోన్నర బంగారం గుర్తింపు

**హైదరాబాద్ పెన్ పవర్:**మహబూబ్‌నగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కిషన్ నాయక్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై ఏసీబీ అధికారులు ఆయన నివాసంలో సోదాలు నిర్వహించారు. ఈ రోజు ఉదయం నుంచి హైదరాబాద్ బోయినపల్లిలోని ఆర్ఆర్ నగర్‌లోని ఆయన నివాసంతో పాటు దాదాపు 12 ప్రాంతాల్లో అధికారులు సోదాలు నిర్వహించి పెద్ద మొత్తంలో ఆస్తులను గుర్తించారు.గుర్తించిన ఆస్తుల

వివరాలు 2లో..




## శ్రీహరికోటలో బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం

- అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్-6ను మోసుకెళ్లనున్న ఎల్‌వీఎం3-ఎం6
- శ్రీహరికోటలో 24 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభం
- ఉదయం 8.54 గంటలకు నింగిలోకి ఎగరనున్న రాకెట్

వివరాలు 2లో..



## అన్ని జీవోలను వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేయాలి

### తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు



- జీవోలు, సర్క్యులర్లు, నియమ నిబంధనలు, నోటిఫికేషన్లను అప్‌లోడ్ చేయాలని ఆదేశం
- చాలా జీవోలను అప్‌లోడ్ చేయకపోవడంపై సింగిల్ జడ్జి బెంచ్ అసంతృప్తి
- ఎర్రోళ్ల శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో), సర్క్యులర్లు, నియమ నిబంధనలు, నోటిఫికేషన్లను అధికారిక వెబ్‌సైట్‌లలో

వివరాలు 2లో..

## బంగ్లాదేశ్ లో అరాచకం... మళ్లీ సైనిక పాలన భయాలు!

- శాంతిభద్రతల వైఫల్యంతో యూనస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- దేశంలో మళ్ళీ సైనిక పాలన వస్తుందనే బలపడుతున్న ఆందోళనలు
- గతంలో పలు సైనిక తిరుగుబాట్లను చూసిన బంగ్లాదేశ్ చరిత్ర
- బంగ్లా అంతర్గత వ్యవహారాల్లో పాకిస్థాన్ ఐఎస్ఐ జోక్యంపై ఆరోపణలు
- భారత ఆస్తులకు రక్షణ కల్పిస్తామని ఆర్మీ చీఫ్ నుంచి హామీ



వివరాలు 2లో..

## గంగారం హత్యల కేసులో.. 9 మందికి యావజ్జీవ శిక్ష

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కేసు గంగారం హత్యలు. 2021లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గంగారం గ్రామంలో మూడు హత్యలు జరిగాయి. ఈ కేసులో.. 2025, డిసెంబర్ 23వ తేదీన జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ హత్య కేసులో సంబంధం ఉన్న 9 మందికి యావజ్జీవ శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడైంది. ఈ క్రమంలోనే జిల్లా కోర్టు దగ్గర ఉద్విగ్నభరిత వాతావరణం నెలకొంది. శిక్ష పడిన నిందితుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా ఏడ్చారు.

వివరాలు 2లో..




## నటుడు శివాజీకి మహిళా కమిషన్ నోటీసులు

- చిక్కుల్లో పడిన నటుడు శివాజీ
- హీరోయిన్ల డ్రెస్సింగ్ పై వివాదాస్పద వ్యాఖ్యలు
- సోషల్ మీడియాలో శివాజీపై వెల్లువెత్తిన విమర్శలు
- రంగంలోకి దిగిన తెలంగాణ మహిళా కమిషన్
- కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన చైర్‌పర్సన్ నేరెళ్ల శారద



వివరాలు 2లో..

## ప్రత్యర్థులపై కేసులు వేసే పనిలో రేవంత్ బిజీగా ఉన్నారు

- ప్రజలకు ఉపయోగపడే పనులు రేవంత్ చేయడం లేదన్న కేటీఆర్
- మీడియాకు లీకులిస్తూ ప్రజలు దృష్టిని మళ్లిస్తున్నారని విమర్శ
- సాగునీటిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపాటు



వివరాలు 2లో..

# ఎడిటర్ వ్యూ

## మేటి గాయకుడు రఫీ

ప్రముఖ ఉత్తర భారత నేపథ్యగాయకుడు. హిందీ సినీ చిత్ర సీమలో ఒకనాడు మకుటం లేని మహారాజుగా వెలిగాడు. హిందీ సినిమా రంగం 1950 నుండి 1970 కాలం మహమ్మద్ రఫీ యుగం అంటే అతిశయోక్తి గాదు. కేవలం రఫీ పాటలతో వందల కొద్దీ చిత్రాలు విజయం పొందాయనేది నూటికి నూరుపాళ్లు నిజం. తన గాన మాధుర్యంతో ప్రేక్షకులను అలరించిన మహ్మద్ రఫీ 24 డిసెంబర్ 1924 పంజాబ్ లోని అమృత్ సర్ లో జన్మించాడు. బాల్యంలో తమ గ్రామానికి వచ్చే ఫకీర్ల గానాన్ని రఫీ అనుకరించే వాడు. అలా చిన్నప్పుడే సంగీతంతో మక్కువ ఏర్పడింది. ఆ క్రమంలోనే ఉస్తాద్ బడే గులామ్ అలీ ఖాన్ వద్ద రఫీ సంగీత శిక్షణలో రాటుదేలాడు. అలా సినిమాల్లో పాటలు పాడడానికి 1944లో బొంబాయి వెళ్లాడు. గావ్ కీ గోరి' అనే హిందీ చిత్రంలో జి.ఎం.దురానీ తో కలిసి రఫీకి మొదటిసారి పాడే అవకాశం వచ్చింది. రఫీ పాడిన తొలి హిందీ గీతమిది. ఆ తర్వాత 1948లో గాంధీజీ హత్య జరిగినపుడు రఫీ 'సునో సునో ఏ దునియావాలో బాపూజీకి అమర్ కహానీ' పాటతో పాపులర్ అయ్యాడు. ఈ పాటకు భారత ప్రధాని నెహ్రూ చేతుల మీదుగా సిల్వర్ మెడల్ అందుకున్నాడు. హిందీ సినిమా గాన జగత్తులో 1950 నుండి 1970 కాలం మహమ్మద్ రఫీ యుగం అంటే అతిశయోక్తి గాదు. రఫీ హిందీ, ఉర్దూ, మరాఠీ, తెలుగు భాషలలో పాటలు పాడాడు. 17 భాషలలో తన గానంతో అందరినీ అబ్బుర పరచాడు, లతా మంగేష్కర్ ల గాయక జోడీ, హిందీ నేపథ్యగాన చరిత్రలో కొత్త ఒరవడిని, రికార్డును సృష్టించింది. మహ్మద్ రఫీని వరించిన అవార్డులకు లెక్కేలేదు. కేంద్ర ప్రభుత్వంచే పద్మశ్రీ పురస్కారం. జాతీయ స్థాయిలో ఉత్తమ గాయకుడిగా అవార్డుతో పాటు పలు ఫిల్మ్ ఫేర్ అవార్డులు ఆయన్ని వరించాయి. హిందీతో పాటు 17 భారతీయ భాషల్లో 20వేలకు పైగా పాటలు పాడాడు. తొలితరం భారతీయ సినీ సంగీత సాగర ప్రయాణానికి దిక్సూచి లాంటి వాడు రఫీ. పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్, రిషీ కపూర్ వంటి మూడు తరాల బాలీవుడ్ నటులకు స్వరాలు అందించిన ఘనత రఫీ సొంతం. తెలుగు విషయానికొస్తే...తండ్రి ఎన్టీఆర్, కొడుకు బాలకృష్ణకు ప్లేబ్యాక్ అందించారు రఫీ. నౌషాద్ కోసం రఫీ మొత్తం 149 పాటలు, బర్మన్‌తో కలిసి 37 చిత్రాలలో పని చేశాడు, శంకర్ – జైకిషన్ కోసం రఫీ మొత్తం 341 సంఖ్యలను (216 సోలో) పాడారు. కల్యాంజీ ఆనంద్జీ రఫీ స్వరంలో సుమారు 170 పాటలు కంపోజ్ చేశారు. రవితో , మదన్ మోహన్‌తో , ఓ పీ నయ్యర్‌తో, లక్ష్మీకాంత్ – ప్యారేలాల్‌తో, రోషన్, జైదేవ్, ఖయ్యామ్, రాజేష్ రోషన్, రవీంద్ర జైన్, బాపి లాహిరి, సపన్ జగ్మోహన్ వంటి సంగీత దర్శకులందరికీ తరచూ పాడారు. ఉషా ఖన్నా , సోనిక్ ఒమి , చిత్రగుప్తా , ఎస్ఎన్ త్రిపాఠి , ఎన్. దత్తా మరియు ఆర్.డి బర్మన్ లాంటి సంగీత దర్శకులతో పని చేశాడు. అనేక ప్రైవేట్ ఆల్బమ్‌లను వివిధ శైలులు మరియు భాషలలో రికార్డ్ చేశాడు. గిన్నిస్ రికార్డు ప్రకారం భారతీయ భాషలలో 28,000 పాటలను రికార్డ్ చేసినట్లు పేర్కొన్నారు. రఫీ రెండు సినిమాల్లో నటించాడు. లైలా మజ్ను (1945) చిత్రంలో "తేరా జల్వా జిస్ నే దేఖా" మరియు జుగ్ను (1947) చిత్రంలో "వో అప్నీ యాద్ దిలాన్ కో" పాటల కోసం తెరపై కనిపించాడు. 1948 – స్వతంత్ర భారత మొదటి సాంవత్సరిక ఉత్సవాలలో రజత పతాకాన్ని జవహర్లాల్ నెహ్రూ చేతుల ద్వారా ప్రదానం చేయబడింది. 1967 – భారత ప్రభుత్వంచే పద్మశ్రీ బిరుదు ప్రదానం చేయ బడింది. 2001 – హీరో హోండా, స్టార్ డస్ట్ మేగజైన్ లద్వారా "బెస్ట్ సింగర్ ఆఫ్ ద మిలీనియం గౌరవ ప్రదానం. 2013 – సి ఎన్ ఎన్.. ఐ బి ఎన్ పోల్ లో గ్రేటెస్ట్ వాయిస్ ఇన్ హిందీ సినిమాగా ఎన్నికయ్యాడు."చౌదవీఁ కా చాంద్ హో , తేరీ "ప్యారీ ప్యారీ సూరత్ కో", "చాహూంగా మై తుఝే సాంఝ్ సవేరే", "బహారో ఫూల్ బర్సావో", "మై గావూ తుమ్ సోజావో", "ఖిలోనా జాన్ కర్", "క్యా హువా తేరా వాదా", ఇలా ఒక్కటేమిటి, రఫీ పాడిన ఎన్నో పాటలు చిరస్థాయిగా నిలిచిపోయే జ్ఞాపకాలుగా మిగిలి పోయాయి. తెలుగులో ఆయన పాడిన ప్రతి పాట ఆణిముత్యమే. 'భలే తమ్ముడు' చిత్రంలోని ఎంతవారు కానీ వేదాంతులైనా కానీ, ఎన్టీఆర్ 'ఆరాధన'లో నా మది నిన్ను పిలిచింది గానమై.. 'అక్బర్ సలీం అనార్కలి'లో ఆయన పాడిన సిపాయి పాట నేటికి తెలుగు ప్రేక్షకుల్లో మనసుల్లో అలాగే నిలిచి వుంది. 1980 జూలై 31న శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఆయన ఈ లోకాన్ని వదిలి వెళ్లి దాదాపు 40 ఏళ్లు దాటినా ఆయన స్వరం ప్రతిగుండెలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. అందుకే భారతీయ సినీ సంగీత ప్రపంచంలో రఫీ అమర గాయకుడిగా నిలిచిపోయారు.

## మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

- మొదటి పేజీ తరువాయి

కమిటీ సభ్యులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన మవోయిస్టులు పోలీసులకు ఆయుధాలను అప్పగించారు. వీటిలో ఒక ఏకే-47, రెండు ఇన్సాస్ రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్ రైఫిల్, మూడు 303 రైఫిళ్లు, రెండు సింగిల్ షాట్ రైఫిళ్లు, అలాగే 14 ల్యాండ్‌మైన్‌లు ఉన్నాయి. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ 22 మంది మావోయిస్టులపై మొత్తం రూ.2.18 కోట్ల రివార్డు ఉంది.తాజా లొంగుబాటు ఏఓబీ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు భారీ ఎదురుదెబ్బ అని పోలీసు అధికారులు తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రకటించిన నేపథ్యంలో భద్రతా బలగాలు ఆపరేషన్ కగార్, ఆపరేషన్ కర్రెగుట్ట వంటి ప్రత్యేక దాడులను ముమ్మరం చేశాయి. ఈ ఆపరేషన్లలో పలువురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో హతం కాగా, పెద్ద సంఖ్యలో మావోలు పోలీసుల ముందు లొంగిపోతున్నారు.

# ప్రత్యర్థులపై కేసులు వేసే పనిలో రేవంత్ బిజీగా ఉన్నారు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. నల్గొండ జిల్లాలో కొత్తగా గెలిచిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాలనపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి రెండేళ్లలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయకుండా, ప్రత్యర్థులపై కేసులు వేసే పనిలో మాత్రమే జోరుగా ఉన్నారని కేటీఆర్ మండిపడ్డారు. మీడియాకు లీకులు ఇవ్వడం, నోటీసుల డ్రామాతో ప్రజల దృష్టిని వేరే దిశగా మళ్లించడం చేస్తున్నారని విమర్శించారు.నదీ జలాలపై రేవంత్ కు ఏమాత్రం అవగాహన లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. సాగునీటిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటిందని... రేవంత్ కు దమ్ముంటే సహకారసంఘాల ఎన్నికలు నిర్వహించాలని సవాల్ విసిరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయకపోవడం వల్లే రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారని అన్నారు.

# ఉచిత బస్సు మహిళలు అడిగారా..?

- మొదటి పేజీ తరువాయి

అంటే సుపరిపాలన అని చెప్పారు. తాను పదవి విరమణ మాత్రమే చేశా. పెదవి విరమణ చేయలేదన్నారు. రాజ్యాంగం పుస్తక కాపీ పట్టుకుని తిరిగితే అంకిత భావంతో పనిచేసినట్లు కాదన్నారు. రాజకీయ నాయకులకు తప్పుడు భాషమాట్లాడటం అలవాటు అయిపో యిందని చెప్పారు. పీవీ సంస్కరణలు తీసుకు వస్తే.. సంస్కరణలను ఆచరణలోకి తెచ్చిన వ్యక్తి వాజ్ పేయి అన్నారు. వాజ్ పేయిని ప్రత్యర్థులు కూడా అజాత శత్రువు అని పిలిచే వారన్నారు.

**ఉచితాలకు బీజేపీ వ్యతిరేకం కాదు**

బీజేపీ ఉచితాలకు వ్యతిరేకం కాదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అన్నారు. రాజకీయాల్లో భాష ప్రయోగం అనేది వ్యక్తిగత జీవితాల్లోకి వెళ్తుందన్నారు. రాజకీయ విమర్శలు ఉండాలి తప్పితే.. వ్యక్తులను విమర్శించకూడదని చెప్పారు. తెలంగాణలో బూతుల రాజకీయాన్ని అంతం చేయాలని అన్నారు.

# ఏసీబీ సోదాలు.. మహబూబ్‌నగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వద్ద రూ.36 కోట్ల ఆస్తుల గుర్తింపు

- మొదటి పేజీ తరువాయి

విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.36 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు, షాపింగ్ కాంప్లెక్సులు, హోటళ్లు, స్థిర, చరాస్తులను గుర్తించారు. బ్యాంకు లాకర్లలో కిలోన్నర బంగారాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.ఏసీబీ అధికారులు హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలతో పాటు వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. కిషన్ నాయక్ 2024 డిసెంబర్‌లో మహబూబ్ నగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీఏ కార్యాలయాలపై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది.

# బంగ్లాదేశ్ లో అరాచకం... మళ్లీ సైనిక పాలన భయాలు!

బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిస్థితులు మరోసారి సంక్షోభంలో కూరుకుపోయాయి. ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం దేశంలో శాంతిభద్రతలను కాపాడటంలో ఘోరంగా విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో దేశ పరిపాలన మరోసారి సైన్యం చేతుల్లోకి వెళ్తుందేమోనన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా పెరిగిపోయిన హింసాత్మక ఘటనలు, అరాచక పరిస్థితులు ఈ వాదనలకు మరింత బలం చేకూరుస్తున్నాయి.దేశంలో నెలకొన్న హింసాత్మక పరిస్థితులపై మాజీ మంత్రి అమీర్ ఖస్రు మహమూద్ చౌదరి వంటి నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యం కాదని, 'మాబోక్రసీ' (మూకల పాలన)గా మారిందని ఆయన ఆరోపించారు. ఇటీవల చట్టోగ్రామ్‌లోని భారత కాన్సులేట్‌పై జరిగిన దాడి ఈ ఆరోపణల తీవ్రతను తెలియజేస్తోంది. మధ్యంతర ప్రభుత్వ వైఫల్యమే దేశంలో శాంతిభద్రతలు క్షీణించాయని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) సెక్రటరీ జనరల్ మీర్జా ఫక్రుల్ ఇస్లాం ఆలంగీర్ ఆరోపించారు. 2026 ఫిబ్రవరిలో జరగనున్న కీలకమైన సార్వత్రిక ఎన్నికలు, దేశవ్యాప్త ప్రజాభిప్రాయ సేకరణకు ముందు భద్రతా వైఫల్యాలు సైనిక జోక్యానికి దారితీయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.బంగ్లాదేశ్ చరిత్రను పరిశీలిస్తే సైనిక తిరుగుబాట్లు కొత్తేమీ కాదు. 1971లో పాకిస్థాన్ నుంచి స్వాతంత్ర్యం పొందిన నాటి నుంచి డజనుకు పైగా తిరుగుబాట్లు, కుట్రలు జరిగాయి. 1975 ఆగస్టులో దేశ జాతిపిత షేక్ ముజిబుర్ రెహ్మాన్‌ను ఆయన కుటుంబంతో సహా సైన్యం దారుణంగా హత్య చేసి అధికారాన్ని చేజిక్కించుకుంది. ఆ తర్వాత దేశం ఏళ్లపాటు అస్థిరతలో మగ్గింది.

లెఫ్టినెంట్ జనరల్ జియావుర్ రెహ్మాన్ అధికారంలోకి వచ్చి బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ)ని స్థాపించారు. కానీ 1981లో ఆయన కూడా సైనిక అధికారుల చేతిలో హత్యకు గురయ్యారు. అనంతరం 1982లో జనరల్ హుస్సేన్ మహమ్మద్ ఇర్షాద్ రక్తపాతరహిత తిరుగుబాటుతో అధికారాన్ని చేజిక్కించుకుని, 1990 వరకు నియంతలా పాలించారు.ప్రస్తుత పరిస్థితులపై సైనిక తిరుగుబాటు జరగవచ్చంటూ వస్తున్న వార్తలను బంగ్లాదేశ్ సైన్యం ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) విభాగం ఖండించింది. సైన్యం ఐక్యంగా, రాజ్యాంగబద్ధమైన విధులకు కట్టుబడి ఉందని స్పష్టం చేసింది. అయితే, ఇటీవల కాలంలో బంగ్లాదేశ్‌లో పాకిస్థాన్, ముఖ్యంగా దాని గూఢచార సంస్థ ఐఎస్ఐ కార్యకలాపాలు పెరిగాయన్న నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. కొద్ది నెలల క్రితం ఐఎస్ఐ కమాండర్ ఒకరు ఢాకాలో పర్యటించడం ఈ అను మానాలకు తావిస్తోంది. బంగ్లాదేశ్‌ను మరింత అస్థిరపరిచేందుకు ఇస్లామాబాద్ ప్రయత్నించే అవకాశాన్ని తోసిపుచ్చలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల మధ్య, బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ జనరల్ వకార్-ఉజ్-జమాన్ ఇటీవల భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదికి ఫోన్ చేసి మాట్లాడారు. బంగ్లాదేశ్‌లోని భారత ఆస్తులన్నింటికీ పూర్తి భద్రత కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ హామీ ప్రస్తుతానికి కొంత ఉపశమనం కలిగించినా, యూనస్ ప్రభుత్వం శాంతిభద్రతలను అదుపులోకి తేలేకపోతే సైన్యం జోక్యం అనివార్యమనే భయాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి

# మెడిసిన్ పని చేయకుంటే శస్త్రచికిత్స అవసరం

బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న ఆందోళన, అశాంతిపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తీవ్రంగా స్పందించారు. ఆ దేశంతో దౌత్యానికి సమయం మించిపోయిందని, ఇక శస్త్రచికిత్స అవసరమని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఆందోళన అంతా వ్యూహాత్మకంగా కీలకమైన 'చికెన్స్ నెక్' గురించేనని ఆయన అన్నారు. దౌత్యం, ఇతర మార్గాల ద్వారా 20 నుంచి 22 కిలోమీటర్ల భూభాగాన్ని భారత్ కాపాడుకోవాల్సి ఉందని వ్యాఖ్యానించారు. మందులు పని చేయనప్పుడు ఆపరేషన్ అవసరమవుతుందని అన్నారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్ గతంలో చైనా పర్యటన సందర్భంగా 'చికెన్స్ నెక్' గురించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. భారతదేశంలోని ఈశాన్య ప్రాంతంలోని ఏడు రాష్ట్రాలను 'సెవెన్ సిస్టర్స్' అంటారని, అవి బంగ్లాదేశ్‌తో సముద్ర తీరం లేని రాష్ట్రాలుగా ఉన్నాయని పేర్కొన్నారు. వారు సముద్రానికి చేరుకోవడానికి మరో మార్గం లేదని, ఈ ప్రాంతంలో సముద్రానికి మేమే రక్షకులం కాబట్టి చైనా ఆర్థిక బేస్‌ను విస్తరించుకోవడానికి అనుకూలంగా ఉంటుందని

వ్యాఖ్యానించారు. చికెన్స్ నెక్ కారిడార్ పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి భూభాగంలో ఉంది. చికెన్స్ నెక్ అంటే కోడి మెడ వంటి సన్నని భాగం అని అర్థం. అరుణాచల్ ప్రదేశ్, అసోం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాలను భారతదేశంతో కలిపే ఈ భాగం సన్నగా కోడి మెడ భాగంలా ఉంటుంది కాబట్టి చికెన్స్ నెక్ అంటారు. ఈ ప్రాంతంలో కొంత భాగం 20 నుండి 22 కిలో మీటర్ల వెడల్పు మాత్రమే ఉంటుంది. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్‌లకు అది దగ్గరలో ఈ చికెన్స్ నెక్ ఉంది.

# చైనా, పాకిస్థాన్‌తో వివాదాలు..

స్వల్పకాలిక, దీర్ఘకాలిక యుద్ధాలకు భారత్ సంసిద్ధంగా ఉండాలని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అణు సామర్థ్యం కలిగిన చైనా, పాకిస్థాన్ నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఐఐటీ బాంబేలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఉగ్రవాదం, సరిహద్దు వివాదాలు సవాళ్లుగా ఉన్నాయని గుర్తు చేశారు.భారత్‌కు ఇద్దరు ప్రత్యర్థులు ఉన్నారని, ఆ రెండు దేశాలు అణ్వాయుధ సామర్థ్యం కలిగి ఉన్నాయని ఆయన తెలిపారు. ఆ దేశాల నుంచి వచ్చే ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేందుకు మనం సిద్ధంగా ఉండాలని అన్నారు. గతంలో నిర్వహించిన ఆపరేషన్ల మాదిరిగా తీవ్రవాదాన్ని ఎదుర్కోవడానికి స్వల్ప, దీర్ఘకాలిక ఘర్షణలకు సిద్ధంగా ఉండాలని సూచించారు.ఇప్పటికే కొనసాగుతున్న సరిహద్దు వివాదాల కారణంగా భూతల ఘర్షణల్లో పోరాడేందుకు సంసిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అయితే వీటిని నివారించేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలని అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, హైపర్ సోనిక్స్, రోబోటిక్స్, ఎడ్జ్ కంప్యూటింగ్ యుద్ధ తీరును మారుస్తున్నాయని అన్నారు.

# గంగారం హత్యల కేసులో.. 9 మందికి యావజ్జీవ శిక్ష

- మొదటి పేజీ తరువాయి

కేసు వివరాల్లోకి వెళితే.. కాటారం మండలం గంగారం గ్రామంలో భూ వివాదం ఏర్పడింది. ఈ క్రమంలోనే తండ్రి మంజునాయక్, అతని ఇద్దరు కొడుకులు సారయ్య, భాస్కర్ లను హత్య చేశారు నిందితులు. కంట్లో కారం కొట్టి.. గొడ్డళ్లతో నరికి చంపారు. ఈ కేసు అప్పట్లో పెద్ద సంచలనం అయ్యింది. భూ వివాదం కారణంగానే ఈ హత్య జరిగినట్లు చెప్పారు పోలీసులు. ఈ కేసులో నాలుగేళ్ల విచారణ తర్వాత.. జిల్లా కోర్టు తీర్పు వెల్లడించింది. మూడు హత్యల్లో తొమ్మిది మంది ప్రమేయం ఉందని.. ఈ తొమ్మిది మందికి యావజ్జీవ జైలు శిక్ష విధిస్తున్నట్లు తీర్పు ఇచ్చారు జడ్జి. ఆ తర్వాత ఈ నిందితులను కట్టుదిట్టమైన భద్రత మధ్య జైలుకు తరలించారు పోలీసులు.

# అన్ని జీవోలను వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేయాలి

- మొదటి పేజీ తరువాయి

అప్‌లోడ్ చేయాలని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. పలు జీవోలను వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేయకపోవడంపై సింగిల్ జడ్జి బెంచ్ తీవ్రంగా స్పందించింది. ప్రజా జీవితాన్ని ప్రభావితం చేసే ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలను తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందని జస్టిస్ సూరేపల్లి నందా పేర్కొన్నారు.పాలనలో పారదర్శకత అనేది ఐచ్ఛికం కాదని, ప్రజాస్వామ్యానికి ప్రాథమిక అవసరమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. అన్ని జీవోలను నాలుగు వారాల లోపు పబ్లిక్ డొమైన్‌లలో ఉంచాలని హైకోర్టు ఆదేశించింది.తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను కోర్టు విచారిస్తోంది. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా జీవోలను అధికారిక వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేయడం లేదని, తద్వారా ప్రజలు సమాచారం తెలుసుకునే హక్కును కోల్పోతున్నారని పిటిషనర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన డేటాను పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు సమర్పించారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆర్టీఐ ద్వారా సమాచారం రాబట్టారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం డిసెంబర్ 7, 2023 నుంచి జనవరి 26, 2025 మధ్య జారీ చేసిన 19,064 జీవోలలో 3,290 జీవోలు మాత్రమే పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. దాదాపు 15,774 జీవోలు పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో లేవని సమాధానం వచ్చింది. హైకోర్టు ఆదేశాలపై హరీశ్ రావు స్పందిస్తూ, జీవోలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని హైకోర్టు ఆదేశాలు ఇవ్వడం ఈ ప్రభుత్వానికి చెంపపెట్టు అని అన్నారు.

# శ్రీహరికోటలో బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం

కొత్త తరం అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్-6ను మోసుకెళ్లే ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ప్రయోగానికి 24 గంటల కౌంట్‌డౌన్ మంగళవారం శ్రీహరికోటలో ప్రారంభమైనట్లు ఇస్రో ప్రకటించింది. బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్ కౌంట్ డౌన్ ప్రారంభమైందని, రేపు ఉదయం 8.54 గంటలకు రాకెట్ నింగిలోకి ఎగరనున్నట్లు వెల్లడించింది.ఈ ఉపగ్రహం బరువు సుమారు 6,100 కిలోలు ఉంటుంది. స్పేస్‌పోర్ట్‌లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ఎల్‌వీఎం3-ఎం6 వ్యోమనౌకను ప్రయోగించనున్నట్లు ఇస్రో అధికారులు తెలిపారు. అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తోంది.శాటిలైట్ ద్వారా నేరుగా మొబైల్ కనెక్టివిటీ కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు ఈ బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా, ఏ సమయంలోనైనా నేరుగా 4జీ, 5జీ వాయిస్, వీడియో కాల్స్, మెసేజ్‌లు, వీడియో ప్రసారాలు చేసేందుకు వీలుగా ఈ ప్రయోగం చేపట్టారు. వాణిజ్య ప్రభుత్వ అప్లికేషన్లకు సపోర్ట్ చేసేలా దీనిని రూపొందించారు.

# నటుడు శివాజీకి మహిళా కమిషన్ నోటీసులు

ప్రముఖ నటుడు శివాజీ మహిళల వస్త్రధారణపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన తెలంగాణ మహిళా కమిషన్ ఆయనకు నోటీసులు జారీ చేసింది.హైదరాబాద్‌లో సోమవారం జరిగిన 'దండోరా' సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో శివాజీ ఈ వ్యాఖ్యలు చేశారు. "చీర కట్టుకుంటేనే అందం కానీ, సామాన్లు కనబడేలా బట్టలు వేసుకోవడం కాదు. అలాంటి వాళ్లను చూస్తే దరిద్రపు .. అని తిట్టాలనిపిస్తుంది... పైకి ఎవరూ అనకపోయినా లోపల మాత్రం తిట్టుకుంటారు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మాటలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయంపై తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద స్పందించారు. శివాజీ వ్యాఖ్యలను తమ లీగల్ టీమ్ పరిశీలించిందని, ఆయనపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. సినిమా వేదికల్లో మాట్లాడేటప్పుడు నటులు జాగ్రత్తగా ఉండాలని, మహిళలను అవమానించేలా మాట్లాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.శివాజీ వ్యాఖ్యలపై గాయని చిన్మయి శ్రీపాద సహా పలువురు సెలబ్రిటీలు, నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళల దుస్తుల ఎంపికపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వారి స్వేచ్ఛను హరించడమేనని, ఇది తిరోగమన ధోరణిని సూచిస్తుందని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో పెద్ద చర్చకు దారితీశాయి. మహిళా కమిషన్ నోటీసుల నేపథ్యంలో శివాజీ ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

# న్యూ ఇయర్ సెలెబ్రేషన్స్ పై స్పెషల్ ఫోకస్..
# సీపీ సజ్జనార్ స్ట్రాంగ్ వార్నింగ్..




**హైదరాబాద్ పెన్ పవర్:**న్యూ ఇయర్ కి సమయం దగ్గరపడుతోంది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరు కొత్త సంవత్సరానికి గ్రాండ్ వెల్కమ్ చెప్పేందుకు ప్రిపేర్ అవుతున్నారు. ఇక హైదరాబాద్ లో పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. డిసెంబర్ 31 రాత్రి సెలెబ్రేషన్స్ కోసం హైదరాబాద్ యువత ఎంతగానో ఎదురు చూస్తుంటారు. కార్పొరేట్ ఈవెంట్స్, పబ్స్ లో స్పెషల్ ప్రోగ్రామ్స్ దగ్గర నుంచి కమ్యూనిటీల్లో సెలెబ్రేషన్స్, రోడ్ల మీద యూత్ హడావిడి వెరసి హైదరాబాద్ లో పండగ వాతావరణం పీక్స్ లో ఉంటుంది. ఈ క్రమంలో న్యూ ఇయర్ సెలెబ్రేషన్స్ పై స్పెషల్ ఫోకస్ పెట్టారు హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్. న్యూ ఇయర్ వేడుకల పేరుతో హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు సజ్జనార్.హైదరాబాద్ లో రేపటి ( డిసెంబర్ 24 ) నుంచే న్యూ ఇయర్ వరకు నగరవ్యాప్తంగా

-4లో




# వినియోగదారుల హక్కులపై..!
# పిల్లలకు అవగాహన శూన్యం..!

## విద్యార్థుల సమగ్ర సర్వేలో బయటపడ్డ ఆందోళనకర నిజాలు..

- మేడ్చల్ జిల్లాలో "5 నుంచి 10వ తరగతి" వరకు, మండలానికి 400 మందితో సర్వే..
- సర్వే నిర్వహించిన మధుబాబు చికిలే.. జిల్లా పౌరసరఫరాల నిఘాకమిటీ సభ్యులు..
- పాడైపోయిన వస్తువులు, నాణ్యతలేని ఫుడ్ ప్రొడక్ట్ లాంటి ఎన్నో అంశాలపై..
- ఫిర్యాదు చేయడానికి హెల్ప్‌లైన్‌లు, కమిషన్‌లపై అవగాహన తక్కువ..


మధుబాబు చికిలే.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పౌర సరఫరాల నిఘా కమిటీ సభ్యుడు..

"వినియోగదారుల హక్కుల చట్టం2019" అనే పదాన్ని తొలిసారిగా విన్నట్టు విద్యార్థులు వ్యవహరించడం,చూస్తే పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని సామాజిక వేత్త ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. వినియోగ దారుల హక్కులపై పిల్లలకు అవగాహన శూన్యమని ఓ స్వరేలో వెల్లడైంది.. నేడు (డిసెంబర్ 24) వినియోగ దారుల హక్కుల దినోత్సవం సందర్భంగా, మేడ్చల్ జిల్లా పౌర సరఫరాల నిఘా కమిటి సభ్యులు మధుబాబు చికిలే, విద్యార్థులతో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సమగ్ర సర్వేలో సంచలన నిజాలు వెల్లడించారు.. పాడైన వస్తువులు మార్చుకోవడం హక్కుగా చట్టపరంగా ఉందని పిల్లలకు తెలియకపోవడం బాధాకరం అంటూ పేర్కొన్నారు.. వినియోగదారుల హక్కుల దినోత్సవంపై నేడు "పెన్ పవర్" ప్రత్యేక కథనం..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, డిసెంబర్ 23:



సోమాజిగూడా ప్రెస్ క్లబ్‌లో.. టీయుడబ్ల్యుజే ఆధ్వర్యంలో పత్రికా సమావేశం..

# అక్రిడిటేషన్‌ల నూతన జీ.ఓను సవరించాలి:
# టీయుడబ్ల్యుజే డిమాండ్...

## రెండు కార్డుల విధానానికి స్వస్తి పలకాలని సోమాజిగూడలో ప్రెస్‌మీట్..

- ఈనెల 27న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్‌ల ముందు ఆందోళనకు పిలుపు..
- జీ.ఓ నెం. 252 పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని టీయుడబ్ల్యుజే ఆరోపణలు..
- పత్రికా సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్..
- జర్నలిస్టుల కనీస హక్కుపై, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని..
- జర్నలిస్టుల మధ్య విభేదాలు ఏర్పడేందుకు ఈ జీవో ఉందని అన్నారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 23:** దాదాపు రెండు సంవత్సరాలు వాయిదాలు వేస్తూ ఆలస్యంగా..! తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్స్ జారీ చేయడం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన జీ.ఓ నెంబర్ 252 పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో యూనియన్ కోశాధికారి పి.యోగనంద్, టెంజు ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్ లతో కలిసి ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల కనీస హక్కు, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా, జర్నలిస్టుల మధ్య విభేదాలు సృష్టించే విధంగా ఈ నూతన జీ.ఓ ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అన్న నినాదంతో పనిచేసిన జర్నలిస్టులకు.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 2014 మార్చి నెలలో జరిగిన జర్నలిస్టు జాతరకు వచ్చిన అప్పటి కాబోయే ముఖ్యమంత్రి కేసీఆర్ అందరి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చుకుందామని ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.. ఆయన సూచన మేరకు పూర్వ మీడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 23 వేల మంది జర్నలిస్టులకు అక్రెడిటేషన్స్ కార్డులు జారీ చేయడం జరిగిందని అన్నారు. ప్రధానంగా డెస్క్ జర్నలిస్టులను కూడా గుర్తించి ఒకే గొడుగు కిందికి తెచ్చి అందరికీ కార్డులివ్వగా 40 ఏళ్ల నుంచి జర్నలిస్టుల సంక్షేమం కోసం పనిచేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతూ రెండు రాష్ట్రాల్లో ఉండే ఒక సంఘం అప్పట్లో దీనిని వ్యతిరేకించిందని..! నేడు వాళ్ళ యూనియన్‌కి చెందిన జాతీయ నాయకుడే మీడియా అకాడమీ ఛైర్మన్ ఉండటంతో ఇప్పుడు డెస్క్ జర్నలిస్టులను వేరు చేసి వాళ్ళ పంతాన్ని నెగ్గించుకున్నారని ఆరోపించారు.. ఈ విషయాన్ని డెస్క్ జర్నలిస్టులు నిశితంగా గమనించాలని కోరారు..

-4లో

# అసెంబ్లీకి రాని కేసీఆర్ మీడియా సమావేశంలో
# ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు

- ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం కక్కుతున్నారని ఆగ్రహం
- ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నామన్న ఉపముఖ్యమంత్రి
- కేసీఆర్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నాడని వ్యాఖ్య




**హైదరాబాద్ పెన్ పవర్:**రెండేళ్లుగా అసెంబ్లీకి హాజరు కాని కేసీఆర్ మీడియా సమావేశంలో మాత్రం ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం చిమ్ముతున్నారని ఆయన విమర్శించారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పినపాక గ్రామంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు.తమ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయలేదని అన్నారు. వ్యవసాయానికి ఉచిత

-4లో

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్ లకు నోటీసులు ఇవ్వాలని సిట్ నిర్ణయం!
# స్వాగతించిన బండి సంజయ్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లకు నోటీసులు
- సిట్ నిర్ణయాన్ని స్వాగతించిన కేంద్రమంత్రి బండి సంజయ్
- ఎస్ఐబీని అడ్డుపెట్టుకొని బ్లాక్ మెయిల్ చేశారని ఆరోపణ
- టీవీ సీరియల్స్ పూర్తయ్యాయి, కానీ కేసు తేలలేదన్న విమర్శ
- విచారణ అధికారులకు స్వేచ్ఛనివ్వాలని డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు నోటీసులు జారీ చేయాలని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ణయించింది. ఈ నిర్ణయంపై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ స్పందిస్తూ, దీనిని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా బండి సంజయ్ బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. తనతో పాటు ఎందరో నేతల ఫోన్లను ట్యాప్ చేయడమే కాకుండా, కుటుంబాల్లో చిచ్చు పెట్టారని విమర్శించారు. "కన్నబిడ్డ, అల్లుడి ఫోన్లనూ ట్యాప్ చేయించి, ఎంతో పేరున్న ఎస్ఐబీ వ్యవస్థను భ్రష్టు పట్టించారు" అని మండిపడ్డారు. ఎస్ఐబీని అడ్డుపెట్టుకొని కాంట్రాక్టర్లు, నేతల నుంచి బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై కూడా సమగ్ర దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.అయితే, ఈ విచారణపై ఆయన పలు సందేహాలు వ్యక్తం చేశారు. కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటారా, లేక దోషులను తేలుస్తారా అని ప్రశ్నించారు. "ఫోన్ ట్యాపింగ్ కేసు మొదలైనప్పుడు ప్రారంభమైన టీవీ సీరియళ్లు కూడా పూర్తయ్యాయి కానీ, ఈ కేసు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది" అని ఎద్దేవా చేశారు. విచారణ అధికారులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, ఈ కుట్ర వెనుక ఉన్న సూత్రధారులను బయటపెట్టాలని ఆయన కోరారు.




# దేశాన్ని పోషిస్తున్న అన్నదాతలకు సెల్యూట్


**హైదరాబాద్ పెన్ పవర్:**జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా దేశ ఆహార భద్రతకు మూలస్తంభాలైన రైతులు, రైతు కూలీలకు సీఎం రేవంత్ రెడ్డి విషెస్ తెలిపారు. ఎండ, వానలను లెక్కచేయకుండా అహర్నిశలు శ్రమిస్తూ ప్రజలందరికీ అన్నం పెడుతున్న రైతుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. రైతు సంక్షేమం మరింత విస్తరించి, రైతులు తమ శ్రమకు తగిన గౌరవం, న్యాయమైన ఫలితాన్ని పొందాలన్నదే ప్రజా ప్రభుత్వ దృఢ సంకల్పమని స్పష్టం చేశారు. రైతు బాగుంటేనే

-4లో

- మిగతా 4లో...

# నువ్వు దొంగచాటుగా ఏం చేస్తున్నావో
# బహిర్గతం చెయ్యి రేవంత్ రెడ్డీ

- రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీవోలను దాచిపెడుతోందని హరీశ్ రావు ఆరోపణ
- 13 నెలల కాలంలో 82 శాతం జీవోలను రహస్యంగా ఉంచారని విమర్శ
- జీవోల గోప్యతపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని వ్యాఖ్య
- చీకటి జీవోల మాటున ఏం చేస్తున్నారో బహిర్గతం చేయాలని డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వేలాది ప్రభుత్వ ఉత్తర్వులను (జీవో) ప్రజలకు అందుబాటులో ఉంచకుండా దాచిపెడుతోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. దాచిపెట్టిన అన్ని జీవోలను నాలుగు వారాల్లోగా బహిర్గతం చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు... ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే రేవంత్ రెడ్డి సర్కార్‌కు చెంపపెట్టు లాంటిదని పేర్కొన్నారు.ఈ విషయంపై హరీశ్ రావు స్పందిస్తూ.. "ప్రజాపాలన అని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, జీవోలను దాచిపెడుతూ పెద్ద డ్రామా ఆడుతోంది. మా పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ సమాచార హక్కు చట్టం (RTI) ద్వారా సేకరించిన సమాచారంతో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (PIL) దాఖలు చేశారు. దీంతో ప్రభుత్వ అసలు రంగు బయటపడబోతోంది" అని తెలిపారు.

- ఈనెల 27న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్‌ల ముందు ఆందోళనకు పిలుపు..
- జీ.ఓ నెం. 252 పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని టీయుడబ్ల్యుజే ఆరోపణలు..
- పత్రికా సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్..
- జర్నలిస్టుల కనీస హక్కుపై, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని..
- జర్నలిస్టుల మధ్య విభేదాలు ఏర్పడేందుకు ఈ జీవో ఉందని అన్నారు..




# అక్రెడిటేషన్‌ల నూతన జీ.ఓను సవరించాలి

# టీయుడబ్ల్యుజే డిమాండ్

## కార్డు విశదీకరణలో స్పష్టత లేదు: మారుతి సాగర్..

మీడియా అక్రిడిటేషన్ కార్డు, మీడియా కార్డు పేరిట రెండు కార్డులు తెచ్చి గందరగోళం సృష్టించారని, ఏ కార్డు వల్ల ఏ ప్రయోజనం జరుగుతుందో జీవోలో విశదీకరించలేదని, జర్నలిస్టుల అందరికీ ఒకే రకమైన ప్రయోజనాలు ఉండాలని డిమాండ్ చేశారు.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు ఏళ్ళు పూర్తవుతున్న నేపథ్యంలో కొత్తగా ఇవ్వబోయే కార్డుల కోసం, నూతన విధానాలు, నిబంధనలు పెట్టి కార్డులలో 10 వేలకు పైగా కోత పెట్టె విధంగా ప్రస్తుత నిబంధనలు తెచ్చారన్నారు. ఈ నిబంధనలతో జర్నలిస్టులు తమ హక్కుగా పొందే అక్రెడిటేషన్స్ కార్డులను కోల్పోవడం అనివార్యం అన్నారు.. రిపోర్టర్స్, డెస్క్ జర్నలిస్టులకు మధ్య విబేధాలు సృష్టించే విధంగా "మీడియా కార్డును" తేవాలనే యోచన శోచనీయమని అన్నారు..

## కక్ష కట్టినట్టుగా జీఓ నెం.252 విడుదల..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి ఉన్న సమయంలో తీసుకు వచ్చిన జి.ఓ 239 ప్రకారం అప్పటి చైర్మన్ అల్లం నారాయణ కేబుల్ ఛానెల్‌లకు రాష్ట్ర స్థాయిలో 12, జిల్లా స్థాయిలో నాలుగు అక్రెడిటేషన్స్ ఇవ్వగా..! ప్రస్తుత చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కేబుల్ ఛానల్‌పై కక్ష కట్టినట్లుగా, రాష్ట్ర స్థాయిలో ఒక్క కార్డు కూడా ఇవ్వకుండా జీవో తేవడం వెనుక మర్మం ఏమిటో అర్థం కావటం లేదన్నారు.. రాష్ట్ర ముఖ్యమంత్రి, సమాచార శాఖ మంత్రికి ప్రస్తుతం మీడియా అకాడమీతో పాటు, ఆయన కొనసాగుతున్న సంఘం వారు తప్పుడు సమాచారం ఇవ్వడం వల్లే ఇలాంటి జీవో తెచ్చినట్టు తాము భావిస్తున్నామని పేర్కొన్నారు.. రాష్ట్రంలోని మెజార్టీ జర్నలిస్టులు వ్యతిరేకించే ఈ జీవోను వెంటనే పునః పరిశీలించి అర్హులైన అందరి జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌లు అందేలా నూతన జీఓను సవరించాలని డిమాండ్ చేశారు..



ఎ.రమణ కుమార్.. టెంజు ప్రధాన కార్యదర్శి..

### రెండు కార్డుల విధానానికి స్వస్తి పలకాలని సోమాజిగూడలో ప్రెస్‌మీట్..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 23:** దాదాపు రెండు సంవత్సరాలు వాయిదాలు వేస్తూ ఆలస్యంగా..! తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్స్ జారీ చేయడం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన జీ.ఓ నెంబర్ 252 పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో యూనియన్ కోశాధికారి పి.యోగనంద్, టెంజు ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్ లతో కలిసి ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల కనీస హక్కు, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా, జర్నలిస్టుల మధ్య విభేదాలు సృష్టించే విధంగా ఈ నూతన జీ.ఓ ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అన్న నినాదంతో పనిచేసిన జర్నలిస్టులకు.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 2014 మార్చి నెలలో జరిగిన జర్నలిస్టు జాతరకు వచ్చిన అప్పటి కాబోయే ముఖ్యమంత్రి కేసీఆర్ అందరి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చుకుందామని ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.. ఆయన సూచన మేరకు పూర్వ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 23 వేల మంది జర్నలిస్టులకు అక్రెడిటేషన్స్ కార్డులు జారీ చేయడం జరిగిందని అన్నారు. ప్రధానంగా డెస్క్ జర్నలిస్టులను కూడా గుర్తించి ఒకే గొడుగు కిందికి తెచ్చి అందరికీ కార్డులివ్వగా 40 ఏళ్ల నుంచి జర్నలిస్టుల సంక్షేమం కోసం పనిచేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతూ రెండు రాష్ట్రాల్లో ఉండే ఒక సంఘం అప్పట్లో దీనిని వ్యతిరేకించిందని..! నేడు వాళ్ళ యూనియన్‌కి చెందిన జాతీయ నాయకుడే మీడియా అకాడమీ చైర్మన్ ఉండటంతో ఇప్పుడు డెస్క్ జర్నలిస్టులను వేరు చేసి వాళ్ళ పంతాన్ని నెగ్గించుకున్నారని ఆరోపించారు.. ఈ విషయాన్ని డెస్క్ జర్నలిస్టులు నిశితంగా గమనించాలని కోరారు..

తెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ కుమార్, కోశాధికారి యోగానంద్ లు మాట్లాడుతూ ఇండిపెండెంట్ జర్నలిస్టుల కనీస అనుభవం 10 సంవత్సరాలనుండి 15 సంవత్సరాల పెంచడం అన్యాయం అన్నారు. 23 వేల అక్రిడేషన్ కార్డులు ఇస్తే ఇక్కడ అర్హులకు కార్డులు ఇవ్వడం లేదని ఢిల్లీకి పోయి ధర్నా చేసిన ఆ ఆంధ్రా సంఘం నాయకులు ఇప్పుడు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. పెద్ద పేపర్లకు, శాటిలైట్ ఛానల్ లకు సైతం భారీ స్థాయిలో కోత విధించారని, అనుభవంలోకి వస్తే కానీ అందరికీ అర్థం కాని విధంగా ఈ జీవోను తీసుకువచ్చారని అన్నారు. ఐజేయు నాయకులు భాస్కర్ మాట్లాడుతూ మీడియా అక్రిడిటేషన్ కమిటీలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులను ఎందుకు చేర్చారని ప్రశ్నించారు.. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఒకపక్క పిసిఐ కమిటీనే ఏర్పాటు చేయలేదని..! ప్రస్తుతం అసలు సభ్యులే లేరని, అలాంటప్పుడు ఎవరిని ఈ కమిటీలో సభ్యులుగా చేరుస్తారో అర్థం కావడం లేదన్నారు.. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ నవీన్ కుమార్ యారా, జిల్లా అధ్యక్షులు రాకేష్ రెడ్డి, జిల్లా కోశాధికారి బాపూరావు తదితరులు పాల్గొన్నారు..

**అక్రిడిటేషన్‌లు అంతా కోత మయం: టెంజు..**



ఆస్కాని మారుతి సాగర్.. టీయుడబ్ల్యుజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి..

## 27న కలెక్టరేట్‌ల ముందు ఆందోళనలు..

**ప్రభుత్వం కొత్తగా తెచ్చిన జీ.ఓ 252 ను సవరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 27న అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ కార్యాలయాల ముందు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. అప్పటిలోపు ప్రభుత్వం జీఓ ను సవరించాలని తాము కోరుకుంటున్నామని, ఒకవేళ తాత్సారం చేస్తే రాజ్యాంగం కల్పించిన హక్కుగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ ప్రకటించారు..**

---

### న్యూ ఇయర్ సెలెబ్రేషన్స్ పై స్పెషల్ ఫోకస్..

# సీపీ సజ్జనార్ స్ట్రాంగ్ వార్నింగ్..

-3 పేజి తరువాయి

స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.డిసెంబరు 31 రాత్రి 100 ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్స్ నిర్వహిస్తామని.. తనిఖీల కోసం 7 ప్లాటూన్ల అదనపు బలగాల మోహరించనున్నట్లు తెలిపారు సజ్జనార్.డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే వాహనం సీజ్, రూ.10 వేల జరిమానా, 6 నెలల జైలు శిక్ష విధిస్తామని.. అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్ శాశ్వత రద్దు కూడా చేస్తామని హెచ్చరించారు సజ్జనార్.పబ్‌లు, త్రీస్టార్ పైస్థాయి హోటళ్లలో వేడుకలకు రాత్రి 1 గంట వరకే అనుమతి ఉంటుందని.. శబ్ద కాలుష్య నిబంధనలు ఉల్లంఘిస్తే సౌండ్ సిస్టమ్‌లు సీజ్ చేస్తామని అన్నారు.న్యూ ఇయర్ వేడుకల్లో గంజాయి, మాదకద్రవ్యాలు, అశ్లీల నృత్యాలకు అనుమతి లేదని.. రూల్స్ అతిక్రమిస్తే.. యాజమాన్యాలపై కేసులు నమోదు చేసి లైసెన్స్ రద్దు చేస్తామని అన్నారు సజ్జనార్.మహిళల భద్రతకు 15 షీ టీమ్స్ మఫ్టీలో నిఘా ఏర్పాటు చేయనున్నామని.. అసభ్య ప్రవర్తనకు తక్షణ అరెస్టు ఉంటుందని అన్నారు సజ్జనార్. సో, హైదరాబాదీస్... న్యూ ఇయర్ సెలెబ్రేషన్స్ మనసారా ఎంజాయ్ చేయండి బట్, బీ అలర్ట్.. రూల్స్ అతిక్రమిస్తే న్యూ ఇయర్ జైల్లో గడపాల్సి వస్తుంది జాగ్రత్త.

### నువ్వు దొంగచాటుగా ఏం చేస్తున్నావో

# బహిర్గతం చెయ్యి రేవంత్ రెడ్డీ

-3 పేజి తరువాయి

2023 డిసెంబర్ 7 నుంచి 2025 జనవరి 26 వరకు మొత్తం 13 నెలల కాలంలో ప్రభుత్వం 19,064 జీవోలు జారీ చేయగా, వాటిలో కేవలం 3,290 మాత్రమే పబ్లిక్ డొమైన్‌లో పెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. "ఏకంగా 15,774 జీవోలను, అంటే 82 శాతం జీవోలను ఎందుకు దాచిపెడుతున్నారు? చీకటి జీవోల మాటున దొంగచాటుగా ఏం చేస్తున్నారు? రేవంత్ రెడ్డి, ఇదేనా మీరు చెప్పిన ప్రజా ప్రభుత్వం?" అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. తక్షణమే జీవోలన్నింటినీ బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### అసెంబ్లీకి రాని కేసీఆర్ మీడియా సమావేశంలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు


-3 పేజి తరువాయి

విద్యుత్ కోసం ప్రతి సంవత్సరం రూ.12,500 కోట్లు విద్యుత్ శాఖకు ప్రభుత్వం చెల్లిస్తోందని భట్టివిక్రమార్క తెలియజేశారు. బీఆర్ఎస్ నాయకులు తోలు తీస్తామంటూ దిగజారి మాట్లాడుతున్నారని, తాము వారిలా మాట్లాడలేమని పేర్కొన్నారు. అలా మాట్లాడే వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నారని భట్టివిక్రమార్క అన్నారు.

### దేశాన్ని పోషిస్తున్న అన్నదాతలకు సెల్యూట్ : సీఎం రేవంత్ రెడ్డి

-3 పేజి తరువాయి

దేశం బాగుంటుందన్న సత్యాన్ని గుర్తుచేశారు. రైతులు, రైతు కూలీలు ఆరోగ్యం, ఆనందం, సమృద్ధితో సుఖశాంతులతో జీవించాలని కోరారు.రైతు సంక్షేమం, సుస్థిర వ్యవసాయం, గ్రామీణ సమృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు సాగుతోందన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు . భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక అయితే, ఆ వ్యవసాయానికి రైతే ప్రాణం అని అన్నారు. దేశాన్ని పోషిస్తున్న రైతు అన్నదాతలకు సెల్యూట్ చెప్పారు. గత సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా రైతులు మంచి దిగుబడులు సాధించాలని కోరారు మంత్రి తుమ్మల. రైతుల సంక్షేమానికి ఈ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతును రాజును చేయడమే సీఎం రేవంత్ లక్ష్యమని తెలిపారు.




# వినియోగదారుల హక్కులపై..!
# పిల్లలకు అవగాహన శూన్యం..!

## విద్యార్థుల సమగ్ర సర్వేలో బయటపడ్డ ఆందోళనకర నిజాలు..

- మేడ్చల్ జిల్లాలో “5 నుంచి 10వ తరగతి“ వరకు, మండలానికి 400 మందితో సర్వే..
- సర్వే నిర్వహించిన మధుబాబు చికిలే.. జిల్లా పౌరసరఫరాల నిఘాకమిటీ సభ్యులు..
- పాడైపోయిన వస్తువులు, నాణ్యతలేని ఫుడ్ ప్రొడక్ట్ లాంటి ఎన్నో అంశాలపై..
- ఫిర్యాదు చేయడానికి హెల్ప్‌లైన్‌లు, కమిషన్‌లపై అవగాహన తక్కువ..

“వినియోగదారుల హక్కుల చట్టం2019” అనే పదాన్ని తొలిసారిగా విన్నట్టు విద్యార్థులు వ్యవహరించడం,చూస్తే పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని సామాజిక వేత్త ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. వినియోగ దారుల హక్కులపై పిల్లలకు అవగాహన శూన్యమని ఓ స్వరేలో వెల్లడైంది.. నేడు (డిసెంబర్ 24) వినియోగ దారుల హక్కుల దినోత్సవం సందర్భంగా, మేడ్చల్ జిల్లా పౌర సరఫరాల నిఘా కమిటి సభ్యులు మధుబాబు చికిలే, విద్యార్థులతో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సమగ్ర సర్వేలో సంచలన నిజాలు వెల్లడించారు.. పాడైన వస్తువులు మార్చుకోవడం హక్కుగా చట్టపరంగా ఉందని పిల్లలకు తెలియకపోవడం బాధాకరం అంటూ పేర్కొన్నారు.. వినియోగదారుల హక్కుల దినోత్సవంపై నేడు “పెన్ పవర్“ ప్రత్యేక కథనం..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, డిసెంబర్ 23:**

మొత్తం మీద, ప్రతి మండలంలో 400 మంది విద్యార్థులతో నిర్వహించిన ఈ అధ్యయనం ఒక విషయాన్ని బలంగా చెబుతోంది.. పిల్లలు కూడా వినియోగదారులే..! కానీ వారి హక్కులపై అవగాహన లేకపోవడం బాధాకరం.. ఒక్కో మండలాల వారీగా చేసిన, సర్వే నిర్వహణలో పెద్ద తేడాలు కనిపించలేదని, జిల్లా అంతటా సమస్యల స్వరూపం ఒకే విధంగా ఉందని పేర్కొన్నారు... ఈ సర్వే కేవలం అభిప్రాయాల సేకరణ మాత్రమే కాదు.. పిల్లల జీవితాల్లో చట్టాల అవగాహన ఎంత అవసరమో చూపించిన దర్పణం.. పాఠశాల స్థాయి నుంచే వినియోగదారుల అవగాహన తప్పనిసరి కావాలని ఈ అధ్యయనం స్పష్టంగా సూచిస్తోంది..

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని ప్రతి మండలంలో 400 మంది విద్యార్థులతో నిర్వహించిన పిల్లల వినియోగదారుల హక్కుల అవగాహనపై అనేక అంశాల వారీగా సమగ్ర సర్వే జిల్లావ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితి వెలుగులోకి వచ్చింది.. వినియోగదారుల హక్కుల చట్టం2019 ఆధారంగా రూపొందించిన(“5 నుంచి 10వ తరగతి“)వరకు, ఈ అధ్యయనంపై విద్యార్థులకు అవగాహన శూన్యమని తేలింది.. పిల్లలు వినియోగదారులే అయినప్పటికీ, వారి హక్కులపై అవగాహన లేకుండానే పెరుగుతున్నారని స్పష్టమవుతుంది. జిల్లాలోని అన్ని మండలాల నుంచి వచ్చిన అభిప్రాయాల ప్రకారం, పిల్లలు “వినియోగదారుల హక్కుల చట్టం” అనే పదాన్ని మొదటిసారిగా విన్నట్టు కనిపించింది. వస్తువు పాడైతే మార్చుకోవచ్చు అన్న భావన ఉన్నప్పటికీ, దాని వెనుక చట్టపరమైన హక్కు ఉందన్న విషయం వారికి తెలియక పోవడం బాధాకరం.. జిల్లా వ్యాప్తంగా అవగాహన లోపం ఒకే స్థాయిలో ఉందని సర్వే వెల్లడించింది.. వస్తువుల నాణ్యత, భద్రత విషయంలో పిల్లల అనుభవాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. పాడైన చాక్లెట్లు, గడువు తేదీ దాటిన ఫుడ్ ఐటమ్స్, తక్కువ నాణ్యత గల స్టేషనరీ వస్తువులు కొనుగోలు చేసిన అనుభవం చాలామందికి ఉందని విద్యార్థులు తెలిపారు. అయితే, అటువంటి సందర్భాల్లో దుకాణదారుని ప్రశ్నించడం, వస్తువు మార్చమని అడగడం చాలా అరుదుగా జరుగుతోందని సర్వే స్పష్టం చేసింది.. ఇది భయంతో కాదు, “ఇది సాధారణమే” అన్న భావన వల్లనే జరుగుతోందని పిల్లల అభిప్రాయాలు చెబుతున్నాయి..



### బ్రాండ్ అంటే నాణ్యత అనే భావన.. అదే సెలబ్రిటీలు చెబితే..?

ప్రకటనల ప్రభావం పిల్లలపై తీవ్రంగా ఉందన్న అంశం కూడా సర్వేలో బయటపడింది. టీవీ, యూట్యూబ్, సోషల్ మీడియా ప్రకటనల్లో చూపినట్టు ఉంటుందనే నమ్మకం కూడా, పిల్లల్లో అవగాహన లోపానికి కారణం.. బ్రాండ్ ఉంటే నాణ్యత ఉంటుందనే భావన తోపాటు, సెలబ్రిటీలు చెప్పితే అది నిజమే అవుతుందనే భావన, పిల్లలు కొనుగోళ్లకు ప్రేరేపితులు అవుతున్నారని సర్వేలో తేలింది.. అయితే, ప్రకటనలు తప్పుదోవ పట్టించే అవకాశం ఉందనే, అవగాహన జిల్లా వ్యాప్తంగా చాలా తక్కువగా ఉంది..



### ఫిర్యాదు హక్కుపై అవగాహన తక్కువ..

ఫిర్యాదు హక్కు, చెప్పుకునే ధైర్యం అంశంలో పరిస్థితి మరింత ఆందోళనకరం. అన్యాయం జరిగినప్పుడు పిల్లలు ఎక్కువగా తల్లిదండ్రులకే చెబుతుండగా, కొంతమంది మాత్రమే టీచర్లకు చెబుతున్నారు.. మరోవైపు గణనీయమైన సంఖ్యలో పిల్లలు ఎవరికి చెప్పకుండా మౌనంగా ఉండిపోతున్నారు. ఫిర్యాదు చేయడానికి హెల్ప్‌లైన్‌లు, కమిషన్లు, అధికారిక మార్గాలు ఎన్నో ఉన్నాయని తెలిసిన పిల్లలు చాలా తక్కువగా ఉన్నారు.. ఇది అవగాహన లోపంతో పాటు, పిల్లల్లో హక్కుల భావన పెరగాల్సిన అవసరాన్ని సూచిస్తోంది..

### సర్వేలో విద్యార్థుల సూచనలు-సలహాలు..

అయితే, ఈ సర్వేలో పాల్గొన్న విద్యార్థులు స్పష్టమైన సూచనలు కూడా చేశారు. పాఠశాలల్లో వినియోగదారుల హక్కులు నేర్పాలని, కథలు, వీడియోలు, ఆటల రూపంలో అవగాహన కల్పించాలని, విద్యార్థులు సూచించిన విషయాన్ని మధుబాబు చికిలే పేర్కొన్నారు.. సమస్యలు చెప్పడానికి ఒక టీచర్ లేదా క్లబ్ ఉండాలని, పెద్దలు పిల్లల మాట కూడా వినాలని వారు కోరారు. ఇవన్నీ పిల్లల నుంచే వచ్చిన అత్యంత విలువైన సూచనలుగా సర్వే పేర్కొంటోంది..



మధుబాబు చికిలే..
మేడ్చల్-మల్కాజిగిరి
జిల్లా పౌర సరఫరాల
నిఘా కమిటీ
సభ్యుడు..

# కరీంనగర్ పోలీసులకు సైబర్ నేరాలు, డిజిటల్ చెల్లింపులపై ఆర్బీఐ అవగాహన సదస్సు

**కరీంనగర్:** పెన్ పవర్: నకిలీ నోట్ల గుర్తింపు, డిజిటల్ అరెస్ట్ వంటి అంశాలపై పోలీసులకు శిక్షణ.రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్బిఐ, ఆధ్వర్యంలో మంగళవారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కేంద్రంలోని అస్త్ర హాలు నందు ఈ-బిఏటి ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ అవేర్నెస్ మరియు ట్రైనింగ్, కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ చెల్లింపులు, సైబర్ మోసాలు మరియు నకిలీ నోట్ల గుర్తింపుపై పోలీసు అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేరగాళ్లు అవలంబిస్తున్న కొత్త కొత్త పద్ధతుల పట్ల పోలీసు అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే బాధితులకు త్వరితగతిన న్యాయం చేయగలమని సూచించారు.ఈ సదస్సులో క్రింది అంశాలపై కూలంకషంగా వివరించారు.సైబర్ మోసాలు: ఇటీవల సంచలనం సృష్టిస్తున్న డిజిటల్ అరెస్ట్, లాటరీ స్కామ్‌లు మరియు అనుమానాస్పద లింక్‌ల ద్వారా జరుగుతున్న నేరాలు.సురక్షిత లావాదేవీలు: యూపీఐ, ఎన్ఇఎఫ్ టి,ఆర్ టి జిఎస్ మరియు ఎల్ ఎంపిఎస్ వంటి సేవలను ఉపయోగిస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు. ముఖ్యంగా యూపీఐ పిన్ భద్రత గురించి వివరించారు.నకిలీ నోట్ల గుర్తింపు: అసలు నోట్లకు, నకిలీ నోట్లకు ఫేక్ కరెన్సీ, మధ్య ఉండే తేడాలను ఎలా గుర్తించాలి మరియు నోట్ రీఫండ్ నియమాల గురించి అవగాహన కల్పించారు.ఫిర్యాదుల విధానం: డిజిటల్ లావాదేవీల్లో పొరపాట్లు జరిగినప్పుడు లేదా మోసపోయినప్పుడు ఏ విధంగా ఫిర్యాదు చేయాలి, ఆర్బీఐ అంబుడ్స్‌మన్ సేవలను ఎలా పొందాలి అనే విషయాలను వివరించారు.నగదు రహిత లావాదేవీల వల్ల కలిగే ప్రయోజనాలు మరియు సైబర్ భద్రతా చిట్కాలను పోలీసు సిబ్బందికి ప్రాక్టికల్‌గా వివరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్, వెంకటరమణ,ఆర్బీఐ అధికారులు, ఆర్బీఐ ఇంటిగ్రేటెడ్ బ్యాంకింగ్ మేనేజర్ సత్యజిత్ ఘోష్, మేనేజర్ ఖాదర్ హుస్సేన్, వెంకటరమణ, కమీషనరే టుకు చెందిన ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని చర్యలు చేపట్టాలి

**కరీంనగర్: పెన్ పవర్:** కలెక్టరేట్ లో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం

రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఆర్ అండ్ బి, పోలీస్, రవాణా, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, ఇతర శాఖల అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో జిల్లాలో తరచుగా ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి, గత సమావేశంలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టారు, జిల్లాలో ఎన్ని బ్లాక్ స్పాట్స్ ఉన్నాయి, గత కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు ఏమిటని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ లను గుర్తించి రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద ప్రదేశాలలో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద అవకాశం ఉన్న స్థలాల్లో వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న చోట్ల వాటికి గల కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నేషనల్ హైవే అథారిటీ, పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రోడ్ సేఫ్టీ కమిటీ మీటింగ్ లో చర్చించిన అంశాలకు సంబంధించి చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల్లో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలని అన్నారు. పాఠశాల బస్సులపై ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ అతికించాలని సూచించారు. జనవరి 1 నుండి 31వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు. ఉత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాలని సూచించారు. తిమ్మాపూర్ లోని సారథి ట్రాఫిక్ అవగాహన పార్కును విద్యార్థులు సందర్శించేలా చూడాలని తెలిపారు. విభిన్న కార్యక్రమాల ద్వారా రోడ్డు అవగాహన మాస ఉత్సవాలు ఏర్పాటు చేయాలని అన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గురించి వివరించారు. గత సంవత్సరం కాలంలో ప్రమాదాలు, మరణించిన వారి సంఖ్య తదితర వివరాలు వెల్లడించారు. కరీంనగర్- జగిత్యాల రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు ఎక్కువగా ఉన్నందున రాత్రి వేళల్లో దారి కనిపించక చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. సంభవిత అధికారులు ఈ మార్గంలో వాహనదారులకు ఉన్న ఇబ్బందులను తొలగించాలని సూచించారు.

# డుమ్మా టీచర్లకు రేవంత్ షాక్ 50 మంది తొలగింపు

**హైదరాబాద్, డిసెంబర్ 23, పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నానాటికీ దిగజారుతుంది. ఇప్పటికే ఒక్క విద్యార్థి కూడా లేని ప్రభుత్వ బడులు తెలంగాణలోనే అధికంగా ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. మరోవైపు సర్కార్ బడుల్లో విధులు నిర్వహించే కొందరు టీచర్లు వేళాపాళా లేకుండా ఇష్టారీతిన సెలవులు పెట్టడంపై రేవంత్ సర్కార్ కీలక చర్యలకు ఉపక్రమించింది. ఇకపై టీచర్లు చెప్పా పెట్టకుండా విధులకు నెల రోజులపాటు వరుసగా గైర్హాజరైతే వారి ఉద్యోగం శాశ్వతంగా తొలగించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ప్రకటన జారీ చేశారు. సర్కార్ బడుల్లోని ఎఫ్ఆర్ఎస్, మధ్యాహ్న భోజనం అమలు వంటి విషయాలపై డీఈఓలతో తాజాగా ఆన్‌లైన్‌లో సమీక్షించారు.ఎఫ్ఆర్ఎస్ ద్వారా ఏయే స్కూళ్లలో ఉపాధ్యాయుల హాజరు ఎంత శాతం ఉందో తెలుసుకునే వెసులుబాటు ఉంది. ఈ వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నందున వాటిపై డీఈవోలు తరచూ సమీక్షించాలని విద్యాశాఖ ఆదేశించింది. ఉపాధ్యాయులు నెలరోజులపాటు ఎలాంటి అనుమతి లేకుండా విధులకు హాజరు కాకుంటే షోకాజ్ నోటీసు జారీ చేయాలని, విచారణలో రుజువైతే ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు గెజిట్‌లో ప్రచురించాలని డీఈఓలకు సూచించారు. ఒక రోజు అనధికారికంగా స్కూల్‌కి రాకున్నా ఇదే విధంగా చర్యలు తీసుకోవచ్చు. అయితే అకస్మాత్తు అనారోగ్యం, రోడ్డు ప్రమాదం వంటి సాకులతో కోర్టుల్లో కేసులు



వేసే అవకాశం ఉన్నందున నెల రోజులు అనధికారిక సెలవు పెడితే షోకాజ్ నోటీసులు ఇవ్వాలని తెలిపారుకాగా గత ఆగస్టు నుంచి ఎఫ్ఆర్ఎస్ అమల్లోకి రావడంతో టీచర్లు వచ్చిన, వెళ్లిన సమయం నమోదవుతోంది. అయితే టీచర్స్ టైమింగ్స్‌పై అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. కేవలం విధులకు హాజరయ్యారా? లేదా? అన్నదే పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఇకపై టీచర్ల ఆలస్యంపై కూడా దృష్టి సారిస్తామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు యేటా కొందరు టీచర్లు దీర్ఘకాలిక సెలవులపై వెళ్తుంటారు. 6 నెలలని అనుమతి తీసుకొని రెండేళ్లైనా విధులకు రావడం లేదు. అలాంటి వారిని గత రెండేళ్లలో సుమారు 50 మందిని ఉద్యోగాల నుంచి తొలగించినట్లు విద్యాశాఖ తెలిపింది. కనీసం సెలవులను పొడిగించుకుంటామని కూడా సమాచారం ఇవ్వడం లేదని, ఇలా దీర్ఘకాలికంగా విధులకు హాజరు కానివారిని కూడా తొలగించాలని సూచించారు. కాగా ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 24 వేల పాఠశాలల్లో సుమారు 1.15 లక్షల మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు

# కేసీఆర్ గేర్ మార్చారా... పాలమూరు జిల్లా టార్గెట్..



**హైదరాబాద్, డిసెంబర్ 23, పెన్ పవర్:** రేవంత్ పేరును ప్రస్తావించకుండానే..గట్టిగానే అటాక్ చేశారు కేసీఆర్. రేవంత్ సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్‌కు చెందిన కృష్ణా జలాల వాటా, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను సెంట్రిక్‌గా కేసీఆర్ ఇండైరెక్ట్‌గా రేవంత్ రెడ్డిపై సీరియస్ కామెంట్స్ చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల డీపీఆర్‌ను కేంద్రం వెనక్కి పంపితే నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారంటూ ఫైరయ్యారు. డీపీఆర్ను వెనక్కి పంపితే భూమి, ఆకాశాన్ని ఏకం చేసి లొల్లి చేయాల్సింది పోయి ప్రభుత్వం సైలెంట్‌గా ఉందని పరోక్షంగా రేవంత్ రెడ్డిని టార్గెట్ చేశారు కేసీఆర్.పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో గ్రామగ్రామాన సభలు పెట్టి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎండగట్టి తీరుతామ్. పెద్ద ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామ్. బహిరంగ సభలకు తాను స్వయంగా హాజరవుతానంటూ..ఇక పూర్తిస్థాయిలో రంగంలోకి దిగుతానని చెప్పకనే చెప్పారు గులాబీ బాస్. ఎంతసేపు రియల్ ఎస్టేట్ దందాలే తప్ప.. వేరే ధ్యాసే లేదని రేవంత్ రెడ్డి సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎక్కడికక్కడ నిలదీస్తామని..అన్యాయాలపై ప్రశ్నిస్తామని హెచ్చరించారు.అయితే ఎక్కడా కేసీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరును పలకలేదు. రేవంత్ పేరును ప్రస్తావించకుండానే ఓ రేంజ్‌లో విమర్శలు, ఆరోపణలు చేయడం మరోసారి సమ్‌థింగ్ స్పెషల్‌గా మారింది. ఆఖరికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేరును పలికిన కేసీఆర్, రేవంత్ రెడ్డి పేరును మాత్రం పలకకపోవడం ఆసక్తికరంగా మారింది. రేవంత్ పేరును తీయకుండానే ఆయనపై కేసీఆర్ యుద్ధం ప్రకటించారన్న చర్చ సాగుతోంది.ఇక సీఎం రేవంత్ రెడ్డి యాజ్ టీజ్‌గా మాజీ సీఎం కేసీఆర్‌ను నేరుగాటార్గెట్ చేశారు. పదేళ్ల పాలనలో తెలంగాణను 8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిన కేసీఆర్ ఒక ఆర్థిక ఉగ్రవాది అంటూ మండిపడ్డారు. కలుగులో దాక్కున్న ఎలుకలా ఇన్నాళ్లూ మౌనంగా ఉండి.. ఇప్పుడు బయటకు వచ్చిఅబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దమ్ముంటే జనవరి 2న జరిగే అసెంబ్లీ సమావేశాలకు రావాలని..తెలంగాణకు ఎవరు మేలు చేశారో అక్కడే తేల్చుకుందామంటూ సవాల్ చేశారు రేవంత్.పంచాయతీఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా కేసీఆర్ తీరు మారలేదని..కమీషన్ల కోసమే రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారంటూ దుమ్మెత్తిపోశారు. అయితే రేవంత్ రెడ్డి పేరు తీయకుండా కేసీఆర్ సీఎం సొంత జిల్లాలోని పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణాజలాల అంశాలను బేస్ చేసుకుని టార్గెట్ చేస్తే, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం యథావిధిగా కేసీఆర్‌ను టార్గెట్ చేయడం చర్చకు దారితీస్తోంది. ఇక ఇప్పుడు కేసీఆర్ యాక్టీవ్ కాబోతుండటంతోతెలంగాణలో ఇకపై రాజకీయం రంజుగా ఉంటుందన్న టాక్ వినిపిస్తోంది.

టార్గెట్ సాగునీటి ప్రాజెక్టులుగులాబీ అధినేత కేసీఆర్ మొత్తానికి ఫామ్హౌస్ నుంచి బయటికి వచ్చారు. శనివారం రాత్రి హైదరాబాదులోని నంది నగర్ లో తన నివాసానికి వచ్చారు. చాలా రోజుల తర్వాత కెసిఆర్ బయటికి రావడంతో తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో సంచలనం నెలకొంది. కెసిఆర్ ఇప్పటికిప్పుడు బయటకు రావడం వెనుక బలమైన కారణం ఉంది.2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కేసీఆర్ బయటకు కనిపించడం అత్యంత అరుదుగామారింది. పార్లమెంటు ఎన్నికల్లో ప్రచారం తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రానికి పరిమితమైపోయారు. గులాబీ పార్టీ పాతిక సంవత్సరాల పండుగకు ఆయన వరంగల్ నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ఆ తర్వాత ఓ టీవీ ఛానల్ నిర్వహించిన ఇంటర్వ్యూకు కూడా హాజరయ్యారు. ఇటీవల తన మేనల్లుడు హరీష్ రావు తండ్రి చనిపోతే కేసీఆర్ బయటికి వచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో స్టార్ క్యాంపైనర్ గా కెసిఆర్ పేరుపేర్కొన్నప్పటికీ.. ఆయన బయటికి రాలేదు.తనను కలిసే నేతలతో మాత్రమే కేసీఆర్ మాట్లాడుతున్నారు. కేటీఆర్, హరీష్ రావు తో అప్పుడప్పుడు సమావేశం అవుతున్నారు.. ఎన్నికల్లో, వివిధ సందర్భాలలో పార్టీఅనుసరించాల్సిన వ్యూహాల గురించి మాత్రమే ఆయన మాట్లాడుతున్నారు. అయితే ఇన్ని రోజుల తర్వాత కెసిఆర్ బయటికి వచ్చారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులపై ప్రధానమైన చర్చ జరుగుతుందని సమాచారం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల పోలవరం నల్లమల సాగర్ నిర్మాణాన్ని ప్రతిపాదించింది. దీనిపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడుప్రతిపాదించిన పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుపై కూడా చర్చ జరుగుతుందని తెలుస్తోంది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు 45 టీఎంసీల కృష్ణా నీటితో సర్దుకుపోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన తీరును గులాబీపార్టీ తప్పుపడుతోంది. తాము అధికారంలో ఉన్నప్పుడు 90 టీఎంసీల నీటి కోసం పోరాటం చేసామని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 45 టీఎంసీలకు ఇలా ఒప్పుకుంటుందని గులాబీ పార్టీ ప్రశ్నిస్తోంది. ఈ వ్యవహారంపైఉద్యమ కార్యాచరణ రూపొందించాలని గులాబీ అధినేత భావించినట్టు సమాచారం. ఉద్యమ కార్యాచరణకు సంబంధించి తేదీలను మాత్రం ప్రకటించకపోవచ్చని.. ఎందుకంటే త్వరలో స్థానిక సంస్థలకు సంబంధించినఎన్నికలు జరగబోతున్నాయని.. అందువల్లే పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.. చాలాకాలం తర్వాత కెసిఆర్ బయటికి వచ్చిన నేపథ్యంలో రేవంత్ రెడ్డికి సవాళ్లు విసిరే అవకాశం లేకపోలేదని%ా% మరి దీనినిముఖ్యమంత్రి ఎలా స్వీకరిస్తారో చూడాల్సి ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# డీ లిమిటేషన్ కు లైన్ క్లియర్

**హైదరాబాద్, డిసెంబర్ 23, పెన్ పవర్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను 300 డివిజన్లను పెంచడంపై దాఖలైన 80 పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టి వేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో జోక్యం చేసుకోలేమని తెలిపింది. అభ్యంతరాలు తెలిపేందుకు ఇచ్చిన గడువు ముగిసిందని హైకోర్టు గుర్తు చేసింది. దీంతో ప్రభుత్వం గ్రేటర్ ను 300 వార్డులుగా విభజించడానికి అడ్డంకులు తొలగిపోయినట్లయిం ది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరిస్తూ, వార్డుల సంఖ్యను 150 నుండి 300కు పెంచుతూ ప్రభుత్వం డీలిమిటేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజన అశాస్త్రీయంగా ఉందంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. పిటిషన్లపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి, తొలుత 300 వార్డుల జనాభా వివరాలు, మ్యాప్‌లను 24 గంటల్లో పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని ఆదేశించారు. అయితే, దీనిపై ప్రభుత్వం అప్పీలుకు వెళ్లడంతో డివిజన్ బెంచ్ ఈ ఉత్తర్వులను పాక్షికంగా సవరించింది. కేవలం పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసిన వార్డులు ముఖ్యంగా వార్డు నెం. 104 – షా అలీ బండా, 134 – లంగర్ హౌజ్ వివరాలు మాత్రమే బహిర్గతం చేయాలని స్పష్టం చేసింది. వార్డుల విభజనపై ప్రజలు తమ అభ్యంతరాలను సమర్పించడానికి హైకోర్టు అదనపు సమయం కేటాయించింది. తొలుత డిసెంబర్ 17తో ముగియాల్సిన గడువును కోర్టు డిసెంబర్ 19 వరకు పొడిగించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ డీలిమిటేషన్ అనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఇందులో కోర్టుల జోక్యం పరిమితంగా ఉండాలని వాదించారు. కేంద్ర సెన్సస్ కమిషనర్ ఆదేశాల ప్రకారం డిసెంబర్ 31, 2025 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని, అందుకే వేగంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేశామని, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.డీలిమిటేషన్ పై ప్రభుత్వానికి చాలా అభ్యంతరాలు వచ్చాయి. ఒకే వార్డు రెండు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోకి వస్తోందని కొందరు ఫిర్యాదు చేశారు. కొన్ని వార్డుల్లో 18 వేల జనాభా ఉంటే, మరికొన్నింటిలో 70 వేల వరకు ఉండటంపై కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హయత్ నగర్ వంటి ప్రాంతాల్లో చారిత్రక కట్టడాలు ఒక వార్డులో, ఆ ప్రాంత పేరుతో ఉన్న మరో వార్డు వేరే చోట ఉండటంపై స్థానికులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు అభ్యంతరాలను స్వీకరిస్తూనే, మరోవైపు కోర్టు కోరిన వార్డుల మ్యాప్‌లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. డిసెంబర్ 31లోగా తుది నివేదిక సిద్ధం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దానికి సంబంధించి కోర్టు వద్ద అడ్డంకులు అన్నీ తొలగిపోయినట్లయింది.

## సింగరేణి 137 వ వార్షికోత్సవ వేడుకలు

**కొత్తగూడెం, డిసెంబర్ 23 పెన్ పవర్:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ 137వ వార్షికోత్సవ వేడుకలు కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్ వి సూర్యనారాయణ మాట్లాడుతూ, సింగరేణి విజన్ 2030 డాక్యుమెంట్ ద్వారా అంతర్జాతీయంగా గ్లోబల్ సింగరేణి విస్తరణ లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఆయన డైరెక్టర్లతో కలిసి సింగరేణి పతాకావిష్కరణ చేసి, ఉత్సవాల కేక్ ను కట్ చేశారు. ఈ విస్తరణ ప్రణాళిక సింగరేణి భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేస్తుంది.

## ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం: 250 మందికి పరీక్షలు

**భద్రాచలం, డిసెంబర్ 23 పెన్ పవర్::** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కాలేజీలో కొల్లి ఫౌండేషన్, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సంయుక్తంగా రెండు రోజుల పాటు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించాయి. పెరుగుతున్న కాలుష్యం దృష్ట్యా ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించి ఈ కార్యక్రమం చేపట్టారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించడం ద్వారా ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజే సుమారు 250 మంది స్క్రీనింగ్ చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో అనుబోస్ కాలేజీ చైర్మన్ భరత్, కాకతీయ ఫౌండేషన్ ప్రతినిధి గూడూరు సత్యనారాయణ, డాక్టర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ ఆధ్వర్యంలో సర్పంచ్, ఉపసర్పంచ్ ప్రమాణ స్వీకారం

**పినపాక, డిసెంబర్ 23 పెన్ పవర్:**కొత్తగూడెం జిల్లా, లక్ష్మీ దేవిపల్లి మండలం ప్రశాంతి నగర్ గ్రామపంచాయతీలో భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా నేతృత్వంలో వాడే రాములు సర్పంచ్‌గా, స్వప్న ఉపసర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వార్డు సభ్యులు కూడా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, పట్టణ కార్యదర్శి కంచల జములయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రామవరం బ్రాంచ్ కార్యదర్శి గోపి, ప్రజాసంఘాల నిర్మాణ కార్యదర్శి తోముల శ్రీనివాస్, డివిజన్ కార్యదర్శి మండల రాజేశ్వరరావు, బాలాజీ, గురుమూర్తి, జహీర్, ప్రేమ్, సురేష్, శ్రీనివాస్, మహిళా సంఘం నాయకులు షాహిన్ కైసర్, విజయలక్ష్మి, దార్ల లక్ష్మి, రోజా, లావణ్య, సుధారాణి, భవాని, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ఫాదర్ విజయపాల్ రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు

**జనగామ, డిసెంబర్ 23 పెన్ పవర్:** వరంగల్ కాథలిక్ డయాసీస్ అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ దుగ్గెంపూడి విజయపాల్ రెడ్డి, వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఫాదర్ విజయపాల్ రెడ్డికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇద్దరూ కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఫాదర్ విజయపాల్ ప్రత్యేక ప్రార్థన నిర్వహించి ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## చిట్యాల సర్పంచ్ ఆదేశాలతో వార్డుల అభివృద్ధి పనుల పరిశీలన



**భూపాలపల్లి, డిసెంబర్ 23 పెన్ పవర్:** ఉమ్మడి వరంగల్ జిల్లా, భూపాలపల్లిలోని చిట్యాల సర్పంచ్ తౌటం లక్ష్మీ ఆదేశాల మేరకు, 11వ వార్డు సభ్యులు వేల్పుల లక్ష్మీ, ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్, 4వ వార్డు సభ్యులు తౌటం నవీన్, పంచాయతీ కార్యదర్శి రవి కలిసి 11వ వార్డును పరిశీలించారు. ప్రజలను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. త్వరలో ఏర్పాటు చేయనున్న కాలని బోర్డ్, పార్క్, ఓపెన్ జిమ్ కోసం స్థలాన్ని పరిశీలించారు. మరుగుదొడ్లు, లైటింగ్, సైడ్ డ్రైనేజ్, ప్రజా అవసరాలపై ప్రజలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వేల్పుల రాజు, కుమార్, మైదం శ్రీకాంత్, నాగరాజు, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు. రామ్నగర్ కాలనీ 11వ వార్డు అభివృద్ధికి సర్పంచ్ లక్ష్మీ కృషి చేస్తున్నారు.

## బంగ్లాదేశ్ హిందువులపై దాడులు: విశ్వహిందూ పరిషత్ నిరసన

**మహబూబాబాద్, డిసెంబర్ 23 పెన్ పవర్:** మహబూబాబాద్‌లో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మతోన్మాద ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. హిందువులు సంఘటితమైతేనే మతోన్మాదులను ఎదుర్కోవచ్చని, ప్రపంచంలోని హిందువులందరూ బంగ్లాదేశ్ హిందువులకు మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణమోహన్, రాణా ప్రతాప్, హిందూ భారతి, చుక్కల నరేష్, యశ్వంత్, మహేష్, బద్రీనాథ్, సురేష్, రవికుమార్, విశ్వహిందూ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేడారంలో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

**ములుగు, డిసెంబర్ 23 పెన్ పవర్:** ములుగు జిల్లా మేడారంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క పర్యటించారు. తొలుత వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను వారు దర్శించుకున్నారు. అనంతరం మేడారం మహాజాతర ఏర్పాట్లు, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రులు పలు సూచనలు చేశారు. జనవరి 28 నుంచి 31 వరకు మేడారం జాతర జరగనుంది.

## వ్యక్తి అనుమానాస్పద మృతి

**పాలకుర్తి, డిసెంబర్ 23 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బోడమంచ తండాకు చెందిన భూక్య వీరన్న మంగళవారం తెల్లవారుజామున అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. రాత్రి ఫోన్ రావడంతో ఫోన్‌లో మాట్లాడుతూ ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయటికి వెళ్లాడు. అర్ధరాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళుతున్న ఓ వ్యక్తి తండా సమీపంలో వీరన్న మృతదేహాన్ని గమనించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు వీరన్న తలపై తీవ్ర గాయాలు ఉండడంతోపాటు, సమీపంలోని వరి పొలంలో రక్తపు మరకలు ఉండడాన్ని గుర్తించారు. వీరన్నను హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. పోలీసులు విచారణ చేపట్టారు.

# కేసీఆర్ ను నమ్మేదెలా



**హైదరాబాద్, డిసెంబర్ 23, పెన్ పవర్:** బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ మళ్లీ యాక్టివ్ కానున్నారన్నది ఆ పార్టీ నేతలకే నమ్మకం కలగడం లేదు. ఎందుకంటే పార్టీ ఆవిర్భావ సభలో వరంగల్ లో ఇక జనంలోనే ఉంటానని చెప్పిన కేసీఆర్ నిన్నటి వరకూ బయటకు రాలేదు. ఇప్పుడు మరోసారి వచ్చి ఇదిగో వస్తున్నానంటే నమ్మడానికి పార్టీ నేతలు కానీ, కార్యకర్తలు కాని మానసికంగా సిద్ధంగా లేరు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో వరంగల్ లో జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో కూడా ఇలాగే ప్రకటన చేశారు. కానీ ఆవిర్భావ దినోత్సవాలు జరిగి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఫామ్ హౌస్ గడప దాటలేదు. వరంగల్ సభలో కూడా ఆవేశంగా ప్రకటించిన కేసీఆర్ తర్వాత అయితా పయితా లేరు. అదే విషయాన్ని ఇప్పుడు కార్యకర్తలు గుర్తుకు తెస్తున్నారు.దాదాపు చాలా రోజుల తర్వాత తెలంగాణ భవన్ కు వచ్చిన కేసీఆర్ పార్టీ నేతల సమావేశంలో ఆవేశంగా మాట్లాడారు. నల్లగొండ, మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని ఆదేశించారు. అయితే ఈ మూడు సభలకు కేసీఆర్ హాజరవుతారా? లేదా? అన్నది ఇప్పటికీ అందరికీ అనుమానమే. కానీ తాను వస్తానని చెప్పి అన్ని ఏర్పాట్లు చేయమంటారు. కానీ వచ్చేంత వరకూ నమ్మకం లేదన్నది బీఆర్ఎస్ నేతల నుంచి వినిపిస్తున్న మాట. అయితే ఇక కేసీఆర్ బయటకు రాకపోతే అసలుకే ఎసరు తప్పదన్న భయం నేతల్లో ఇప్పటికే నెలకొని ఉంది.ఇప్పటికే అన్ని ఎన్నికల్లో ఓటమి పాలయిన బీఆర్ఎస్ ఇక కేసీఆర్ బయటకు రాకపోతే మరింత క్యాడర్ నీరుగారిపోతుందని తెలుసు.బీఆర్ఎస్ వర స ఓటములతో పాటు కుమార్తె కల్వకుంట్ల కవిత ఇప్పటికే యాత్ర పేరిటజనంలోకి వెళుతున్నారు. సామాజికయాత్ర పేరుతో తెలంగాణలో పర్యటిస్తూ పార్టీ నేతలపైనే విమర్శలు చేయడాన్ని కనీసం కేసీఆర్ ఖండించకపోవడం కూడా విమర్శలకు దారి తీస్తుంది. శాసనసభ ఎన్నికల్లో ఓటమిపాలయి రెండేళ్లు దాటుతున్నప్పటికీ పార్టీ అధినేత కేసీఆర్ కార్యకర్తలను కలిసేందుకు ఇష్టపడకపోవడం కూడా పార్టీపై ఎఫెక్ట్ పడనుందని చెబుతున్నారు. కేసీఆర్ ఫాం హౌస్ వదిలి జనంలోకి రావాలని క్యాడర్కోరుకుంటున్నారు. కానీ కేసీఆర్ ను చూస్తుంటే ఇప్పట్లో కదిలేలా కనిపించడం లేదు. మరి కేసీఆర్ మీడియా సమావేశంలో చెప్పినట్లు బయటకు వస్తారా? రారా? అన్న చర్చ పార్టీలో జరుగుతుంది.

పొన్నం కౌంటర్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ మీడియా సమావేశంలో కూర్చుని తోలు తీస్తామంటే ఊరుకోబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే డీపీఆర్ వెనక్కు వచ్చిందని అన్నారు. నిజంగా నీటి పారుదల శాఖపై చర్చించాలంటే అసెంబ్లీ సమావేశాలకు రావాలని కోరారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై చర్చించడానికి తాము కూడా సిద్ధమని మంత్రిపొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు.ప్రజలు మీ తోలు తీసినా మీలో మార్పు రాలేదన్నారు. కేసీఆర్ పాతపురాణాన్ని వల్లె వేశారన్నారు. దద్దమ్మ పాలన చేసింది తాము కాదని,మీరేనని పొన్నం ప్రభాకర్ అన్నారు. మీ

హయాంలో డీపీఆర్ వెనక్కు వచ్చినప్పుడు నిద్రపోతున్నారా? అని ప్రశ్నించారు. జగన్, మోదీతో అంటకాగినప్పుడు ఏమయిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ఇప్పటికే మీ బిడ్డ కవిత నీ తోలు తీస్తుందని

మండి పడ్డారు.

# గ్రేటర్ హైదరాబాద్ వాసులకు గుడ్‌న్యూస్

**హైదరాబాద్, డిసెంబర్ 23, పెన్ పవర్:**
హైదరాబాద్ నగర ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గించే దశగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిల్ కార్పొరేషన్ ఒక సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిల పరిష్కారం కోసంజీహెచ్ఎంసీ బంపర ఆఫర్ ప్రకటించింది. నగరంలోని ప్రైవేటు, ప్రభుత్వం ఆస్తులకు సంబంధించి పేరుకుపోయిన పన్ను బకాయిలపై భారీ మినహాయింపులను కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 90 శాతం వడ్డీమినహాయింపు: ఒకేసారి చెల్లింపుతో విముక్తి ఈ పథకం ప్రకారం ఆస్తి పన్ను బకాయి ఉన్న వినియోగదారులు తమ పెండింగ్ బకాయిలపై ఉన్న వడ్డీలో ఏకంగా 90 శాతం మినహాయింపును పొందవచ్చు. అంటేవినియోగదారులు తాము చెల్లించాల్సిన అసలు పన్నుతోపాటు కేవలం పది శాతం వడ్డీని మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఈ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానం ద్వారా వేల సంఖ్యలో ఉన్న పన్ను చెల్లింపుదారులకు గొప్ప ఉపశమనం లభించనుంది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని రాల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు ఈ రాయితీ వర్తిస్తుందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. విస్తరించిన నగరానికి వర్తింపు: ఇటీవల గ్రేట్ హైదరాబాద్ పరిధిని ప్రభుత్వం భారీగా విస్తరించిన సంగతి తెలిసిందే. ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని ఉన్న 20 పురపాలక సంఘాలు, ఏడు నగరపాలక సంస్థలన జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ నోటిఫికేషన్‌విడుదలయ్యింది. ఈ విలీన ప్రక్రియతో బృహత్ నగరంగా అవతరించిన హైదరాబాద్‌లో కొత్త ప్రాంతాలను కూడా ఈ ప్రాపర్టీ ట్యాక్స్ ఆఫర్ వర్తించనుంది. దీని వల్ల అటు ప్రజలకు వడ్డీ భారం తగ్గడమే కాకుండా ఇటుజీహెచ్ఎంసీకి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా నగర వాసులు తమ ఆస్తి పన్ను రికార్డులను క్లియర్ చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. అప్పుల భారం లేకుండా నవ నగర నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరుతున్నారు.



# మూడేళ్ల ముందు నుంచే టిక్కెట్ల లొల్లి

**మహబూబ్ నగర్, డిసెంబర్ 23, పెన్ పవర్:**
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్ బీఆర్ఎస్‌లో వర్గ విభేదాలు పీక్ లెవల్‌కు చేరాయి. కారు పార్టీలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరుతో క్యాడర్ రెండుగా చీలిపోయిందన్న టాక్ వినిపిస్తోంది. షాద్ నగర్‌నియోజకవర్గంలో 2014, 2018లో రెండు సార్లు ఘన విజయం సాధించిన గులాబీ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైంది. గత రెండేళ్లుగా పార్టీ వర్గ విభేదాలతో కొట్టుమిట్టాడుతోంది. బీఆర్ఎస్ పార్టీ మాజీఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు, మహబూబ్ నగర్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ఏ మాత్రం పొసగడం లేదు. అంజయ్య యాదవ్, నవీన్ రెండు వర్గాలుగా విడిపోవడంతో ద్వితీయస్థాయి నేతలతో పాటుకార్యకర్తలు అయోమయంలో పడ్డారట. అధికార పార్టీ మీద పోరాడాల్సింది పోయి..సొంత పార్టీలో ఈ కుంపటి ఏంటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారట గులాబీ పార్టీ కార్యకర్తలుమాజీ ఎమ్మెల్యే అంజయ యాదవ్ ఈ సారి తన కుమారుడికి టికెట్ ఇప్పించుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కూడా వచ్చే ఎన్నికల్లో షాద్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ట్రై చేస్తున్నారట. నవీన్ రెడ్డి ఎమ్మెల్యేసీటుపై కన్నేయడంతో తమ సీటుకు ఎసరు వస్తుందన్న ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వర్గం అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారట. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నవీన్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్‌తరఫున స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా గెలవడంతో ఆయనపై బీఆర్ఎస్ అధిష్టానానికి మంచి అభిప్రాయం ఉండటంతో పాటు ఆర్థికంగా రాజకీయంగా అన్ని విధాల నవీన్ కుమార్ బలంగా ఉండటంతో స్పీడు పెంచారు. ఇదే ఇప్పుడు అంజయ్య యాదవ్ వర్గంలో ఆందోళనకు కారణమవుతోందని తెలుస్తోంది.ఎమ్మెల్సీ హోదాలో ఉన్న నవీన్ రెడ్డి..హైదరాబాద్‌లోని పార్టీ ఆఫీస్ మొదలుకొని షాద్‌నగర్ వరకు ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తూ ప్రజల దృష్టిలో, అధిష్టానం దృష్టిలో పడే ప్రయత్నం చేస్తున్నారట. అంతేకాదు బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలకు షాద్‌నగర్ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలను తరలించడంతో..కేటీఆర్ కూడా నవీన్ రెడ్డిని



అభినందించారట. ఇది మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వర్గానికి ఏ మాత్రం రుచించడం లేదంటున్నారు. అప్పటి నుంచి ఇరు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోదన్న టాక్ వినిపిస్తోంది.లేటెస్ట్‌గా జరిగినపంచాయతీ ఎన్నికల్లోనూ ఓ వైపు అంజయ్య యాదవ్, మరోవైపు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఎవరికి వారు సెపరేట్‌గా.. తమ వర్గానికి చెందిన అభ్యర్థులను బరిలోకి దింపి చాలా వరకు గెలిపించుకున్నారు. అయితే అంజయ్యయాదవ్, నవీన్ రెడ్డి వర్గ పోరు పార్టీకి డ్యామేజ్ చేస్తుందన్న ఆందోళన క్యాడర్ కనిపిస్తోందట. ఇంకా కొన్ని పంచాయితీల్లో గెలవాల్సి ఉన్నా అంజయ్య యాదవ్, నవీన్ రెడ్డి విభేదాలతో అధికార కాంగ్రెస్‌కు మేలు జరిగిందని అంటున్నారు. ఇక షాద్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ మద్దతుదారులుగా బరిలో నిలిచి గెలిచిన సర్పంచ్‌లను తెలంగాణ భవన్‌లో సన్మానించారు కేటీఆర్.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరు కాలేదు. అంతేకాకుండా ఈ సమావేశంలో అంజయ్య యాదవ్ మళ్లీ భారీ మెజార్టీతో గెలుస్తారని కేటీఆర్ చెప్పడంతో మళ్లీ ఆయనకే టికెట్ అని చెప్పకనే చెప్పారన్న చర్చ మొదలైంది. ఇంకా ఎన్నికలకు మూడేళ్ల సమయంఉండగానే..మాజీ ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ టికెట్ ఫైట్ ఇంట్రెస్టింగ్‌గా మారింది. అప్పటి వరకు పరిస్థితుల్లో మార్పు వచ్చి తనకే టికెట్ వస్తుందన్న ధీమాతో నవీన్ రెడ్డి ఉంటే..అధిష్టానం ఆశీస్సులు తనకే ఉన్నాయని అంజయ్య యాదవ్ చెప్పుకుంటున్నారట. మొత్తానికి షాద్‌నగర్ నియోజక వర్గంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వర్గాల మధ్య కార్యకర్తలు నలిగిపోవాల్సి వస్తుందట. మాజీ ఎమ్మెల్యే వెంటనడవాలో..ఎమ్మెల్సీ చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొనాలో తెలియక గులాబీ పార్టీ కార్యకర్తలు సతమతం అవుతున్నారని అంటున్నారు.

## సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మంచిర్యాల, డిసెంబర్ 23 ( పెన్ పవర్:** మంగళవారం, మందమర్రి ఏరియాలోని జీఎం కార్యాలయం ఆవరణలో 136వ సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏరియా జీఎం రాధాకృష్ణ జెండాను ఆవిష్కరించారు. సమిష్టి కృషితో కార్మికులు, అధికారులు ఉత్పత్తి లక్ష్యాల కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబీకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు అవార్డు

**బెల్లంపల్లి, డిసెంబర్ 23 పెన్ పవర్:** బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రాష్ట్రస్థాయి ఉత్తమ విద్యా సంస్థగా అవార్డు లభించింది. హైదరాబాదులో జరిగిన హై బిజీ టీవీ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు 2025 కార్యక్రమంలో కళాశాలను ఈ సంవత్సరానికి గాను ఎంపిక చేశారు. ప్రిన్సిపాల్ అంజయ్య, జెడి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాల పెంపు, ఉత్తమ ఫలితాలు, సిబ్బంది పనితీరుకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది.

## బీసీలకు 50% రిజర్వేషన్లు:

## కేంద్రానికి జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి డిమాండ్

**చెన్నూరు, డిసెంబర్ 23 పెన్ పవర్:** మంచిర్యాల జిల్లా సిసిసి కార్నర్ లో మంగళవారం జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం 50 శాతం సీలింగ్ రిజర్వేషన్లను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్లు దాటొద్దనే తీర్పును కేంద్రం బూచిగా చూపిస్తోందని, రాజ్యాంగంలో అలాంటి నిబంధన లేదని, అగ్రకులాలకు 10% రిజర్వేషన్లతో 50% సీలింగ్ దాటిందని ఆయన అన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలు, చట్టసభలలో 50% రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కొత్త సర్పంచ్‌కు ఆదివాసీ విద్యార్థి సంఘం సన్మానం



**ఆసిఫాబాద్, డిసెంబర్ 23 పెన్ పవర్:** కేరమరి గ్రామపంచాయతీ నూతన సర్పంచ్ పెందోర్ ఆనందరావును ఆదివాసీ జిల్లా విద్యార్థి సంఘం నాయకుడు మాడవి భరత్ భూషణ్ శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో ఛైర్మెన్ శంకర్, మాజీ ఎంపీటీసీ ఇఫ్తిఖర్ అహ్మద్, మెట్టపిప్రి సర్పంచ్ ఖుద్దు, తుడుందెబ్బ మండల అధ్యక్షులు సోము, బీఆర్ఎస్ నాయకులు కంబాల వినేష్, జావీద్, పోషన్న తదితరులు పాల్గొన్నారు.

## జంగుబాయి జాతర..

**సిర్పూర్, డిసెంబర్ 23 పెన్ పవర్:** ఆసిఫాబాద్ జిల్లా కెరమెరిలో కొలువైన అడవిబిడ్డల దైవం జంగుబాయి తల్లికి పుష్య మాసంలో ఏటా జరిగే జాతర ప్రారంభమైంది. ప్రకృతికి ప్రతిరూపమైన జంగుబాయి దీపం రూపంలో దర్శనమిస్తుంది. నెల రోజుల పాటు జరిగే ఈ జాతరకు తెలంగాణ, మహారాష్ట్రల నుంచి లక్షలాది మంది ఆదివాసీలు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఈ సంప్రదాయం ప్రకారం జాతర ప్రారంభమైంది.

## అయిలాపూర్ లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పాఠశాల పరిశీలన



**కోరుట్ల, డిసెంబర్ 23 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలో చేపడుతున్న నూతన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను గ్రామ సర్పంచ్ ద్యావన పెల్లి రామకృష్ణ, ఉపసర్పంచ్ శ్రీమతి వనపర్తి సౌమ్య, గ్రామ సెక్రటరీ పాతర్ల నవీన్, వార్డు సభ్యులు మంగళవారం సందర్శించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, లబ్ధిదారులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడి మౌలిక వసతులను పరిశీలించి, ఉపాధ్యాయురాలు సంధ్యతో చర్చించి అవసరమైన వసతులు త్వరలోనే కల్పిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు మెరుగైన నివాసాలు, విద్యార్థులకు సౌకర్యవంతమైన విద్యావాతావరణం కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతుపై సర్పంచ్ దాడి!

**మంథని, డిసెంబర్ 23 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాకర్లపల్లి గ్రామంలో, సర్పంచ్ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వలేదనే కారణంతో, గ్రామ సర్పంచ్ కన్నెబోయిన కొమురయ్య, రైతు పర్శవేన సమ్మయ్యపై దాడి చేశాడు. తన పొలంలోకి నీళ్లు వస్తున్నాయని చెప్పిన రైతును, సర్పంచ్ కొట్టి, చంపుతానని బెదిరించినట్లు బాధితుడు తెలిపారు. ఈ ఘటనపై మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, గ్రామస్తులు సర్పంచ్‌ను సస్పెండ్ చేయాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ప్రమాణ స్వీకారం చేసిన 24 గంటల్లోపే ఈ దాడి జరగడం విచారకరం.

## జగిత్యాల జిల్లాలో పెరిగిన హత్యలు: ఎస్పీ

**జగిత్యాల, డిసెంబర్ 23 పెన్ పవర్:** మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, జగిత్యాల జిల్లాలో హత్యల సంఖ్య గత సంవత్సరం కంటే పెరిగిందని తెలిపారు. 2023లో 28 హత్యలు జరుగగా, ఈ సంవత్సరం ఇప్పటివరకు 29 హత్యలు నమోదయ్యాయని ఆయన వెల్లడించారు. అయితే, మిగతా నేరాల రేటు గత సంవత్సరం కంటే 5 శాతం తగ్గినట్లు వివరించారు. ఈ క్రమంలో సహకరించిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

## రైతులకు యూరియా బుకింగ్ యాప్ ద్వారా లభ్యం:

## వ్యవసాయ అధికారి

**పెద్దపల్లి, డిసెంబర్ 23 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలంలో ప్రస్తుత యాసంగి పంట కొరకు రైతులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియాను బుకింగ్ చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి ఉమాపతి తెలిపారు. యాప్ డౌన్లోడ్ చేసి, ఫోన్ నంబర్ ద్వారా లాగిన్ అయి, సాగు విస్తీర్ణం నమోదు చేసి యూరియా బస్తాలను బుక్ చేసుకోవాలని సూచించారు. బుకింగ్ ఐడిని డీలర్ వద్ద చూపించి యూరియా పొందవచ్చని, ప్రస్తుతం ఎలిగేడు మండలంలో 2000 బస్తాలు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

## మొహమాటం వద్దు.. చికిత్స మేలు

**ధర్మపురి, డిసెంబర్ 23 పెన్ పవర్:** కుష్ఠును నిర్మూలించేందుకు ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోంది. వ్యాధిగ్రస్థులను గుర్తించి చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టింది. మైక్రో బ్యాక్టీరియం లెప్రె అనే సూక్ష్మక్రిమితో ఇది సంక్రమిస్తుంది. ముక్కు ద్వారా శరీరంలోకి ప్రవేశించాక అయిదు నుంచి పది సంవత్సరాల్లో లక్షణాలు కనిపిస్తాయి. సర్వేలో అనుమానితులకు 1 నుంచి 5లోపు మచ్చలు ఉంటే పరీక్షలు నిర్వహిస్తారు. అయిదులోపు ఉన్నవారికి బాసిల్లగా పరిగణించి ఆరు నెలలపాటు చికిత్స అందిస్తారు. అయిదు కంటే ఎక్కువగా ఉంటే మల్టీ బాసిల్లగా పరిగణించి ఏడాది పాటు వైద్యం అందిస్తారు.

## నల్ల వాగులో నీటిని వదిన ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, డిసెంబర్ 23 పెన్ పవర్:** సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగుల ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి మంగళవారం పంటల సాగు కోసం నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ శంకర్, సిడిసి మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, నాయకులు సాయిలు, నరేందర్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## నీరు లేని బావిలో పడిపోయిన వ్యక్తి



**సంగారెడ్డి, డిసెంబర్ 23 పెన్ పవర్:** దుబ్బాక పురపాలిక పరిధిలోని చేరువాపూర్ వార్డులో మంగళవారం ఉదయం నీరు లేని పాత బావిలో ప్రమాదవశాత్తూ పడిపోయిన వృద్ధుడిని స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో, బావిలోంచి అరుపులు విన్న రైతులు పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ సహాయంతో వృద్ధుడిని బయటకు తీసి, గాయాలతో ఉన్న అతన్ని దుబ్బాక ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఆధార్ కార్డు, బస్సు పాస్ ఆధారంగా వృద్ధుడిని కామారెడ్డి జిల్లా పెద్దమల్లారెడ్డికి చెందిన ఆర్ల శివరాజయ్యగా గుర్తించారు. వృద్ధుడు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వచ్చాడా లేక మద్యం మత్తులో పడ్డాడా అనే వివరాలు తెలియాల్సి ఉంది.

## డాకుర్ గ్రామ పంచాయతీలో 14వ వార్డు సభ్యుడి ప్రమాణ స్వీకారం

**ఆందోల్, డిసెంబర్ 23 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలంలోని డాకుర్ గ్రామంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ వినీత్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ వసంత్ రెడ్డి, ఉప సర్పంచ్ మురళి సమక్షంలో 14వ వార్డు సభ్యుడు నాగ్యారి నాగయ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నాగయ్య, 14వ వార్డు అభివృద్ధికి సర్పంచ్‌తో కలిసి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శాంతినగర్ సెయింట్ ఆంటోనీ పాఠశాలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**జహీరాబాద్, డిసెంబర్ 23 పెన్ పవర్:** సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్ లోని సెయింట్ ఆంటోనీ పాఠశాలలో 23 డిసెంబర్ 2025 మంగళవారం నాడు ఫ్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. రెఫరెంట్ ఫాదర్ శ్రీ బి జోసెఫ్ గారు 'ఇతరులను ప్రేమిస్తే ఇతరులు మనల్ని ప్రేమిస్తారు' అనే దైవ వాక్యాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఏసుక్రీస్తు బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీ ఈ విజయ్ కుమార్ రెడ్డి విద్యార్థులందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, మంచి ఆలోచనతో పాఠశాలకు తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్, చైర్మన్ శ్రీమతి శ్రీ పాపులమ్మ సల్మాన్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఈ అరుణ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ జయ బాల రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఈ జ్యోతి రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పశువుల సంక్షేమంపై ప్రభుత్వ దృష్టి: జూలేకల్ లో వైద్య శిబిరం



**గద్వాల, డిసెంబర్ 23 పెన్ పవర్:** మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం జూలేకల్ లో పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల, గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నట్లు మండల పశు వైద్య అధికారి స్వరూపరాణి తెలిపారు. సర్పంచ్ ఉప్పల రాజు ప్రారంభించిన ఈ శిబిరంలో గర్భకోశ వ్యాధుల పరిశీలన, 20 గొడ్డు మోతు పశువులకు పరీక్షలు, మందులు, సలహాలు అందించారు. అలాగే, 18 మంది కాపర్లకు చెందిన 2144 జీవాలకు (గొర్రెలు 2085, మేకలు 59) నట్టల నివారణ మందులు తాగించారు.

## యాసంగిలో క్రాప్ హాలిడే దుర్మార్గం:

**అచ్చంపేట, డిసెంబర్ 23 పెన్ పవర్:** జూరాల ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నా, యాసంగి సాగుకు నీటిని నిలిపివేసి క్రాప్ హాలిడే ప్రకటించడం దుర్మార్గమని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. సాగునీటి సరఫరాపై కాంగ్రెస్ నాయకులకు అవగాహన లేకపోవడం వల్లే రైతులు నష్టపోతున్నారని ఆయన ఆరోపించారు. వర్షాలు బాగా కురిసినా నీరివ్వకపోవడం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించిన ఆయన, రైతుల పక్షాన పోరాడతామని పేర్కొన్నారు.

## రైలు ఎక్కబోయి జారిపడి వ్యక్తి మృతి

**వనపర్తి, డిసెంబర్ 23 పెన్ పవర్:** గద్వాలలో వనపర్తి జిల్లాకు చెందిన చాకలి కొండన్న (49) కదులుతున్న రైలు ఎక్కబోయి ప్రమాదవశాత్తూ జారి కిందపడి మృతి చెందారు. తీవ్ర గాయాలైన ఆయనను గద్వాల ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని రైల్వే కానిస్టేబుల్ అశోక్ తెలిపారు. ఈ ఘటన రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది.

## అటవీ సంపదలో ఆఖరున మనమే..!

**కల్వకుర్తి, డిసెంబర్ 23 పెన్ పవర్:** అటవీ సంపదలో రాష్ట్రంలో ఆఖరు స్థానం జోగులాంబ గద్వాల జిల్లాదే. అడవుల పెంపకం కోసం పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములున్నప్పటికీ వాటిలో మొక్కలు నాటేందుకు ఏటా సరైన చర్యలు తీసుకోవటం లేదు. రహదారుల పక్కన మొక్కలు నాటేందుకు ఇచ్చిన ప్రాధాన్యం ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో నాటేందుకు ఇవ్వటం లేదు. దీంతో జోగులాంబ గద్వాల ఏటా అటవీ సంపద పెంపు సర్వేలో వెనకబాటులోనే ఉంటోంది. ధరూరు, గట్టు, కేటీదొడ్డి, మల్దకల్ మండలాల పరిధిలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములున్నాయి. ధరూరు మండలం ర్యాలంపాడు గుట్టల్లో 90 ఎకరాలకుపైగా చదును చేసిన భూమి అందుబాటులో ఉంది.

## రేవంత్ రెడ్డిది ఒకటే ఏడుపు: మాజీ మంత్రి

**సూర్యాపేట, డిసెంబర్ 23 పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం విమర్శలు చేస్తున్నారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఆరోపించారు. కరెంటు, కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడం, ఫార్ములా-ఈ రేసులో మహిళలను తీసుకురావడం, ఫార్మా సిటీ సమ్మిట్, మెస్సీని ఆహ్వానించి ఫుట్‌బాల్ ఆడించడం వంటి అంశాలపై రేవంత్ రెడ్డి స్పందిస్తూ, బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు గుప్పించడంపై జగదీశ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. రేవంత్ రెడ్డి తీరును ఆయన ఎద్దేవా చేశారు.

# పావు వంతు లెక్చరర్లతో చదువు సాగేదెలా...

**హైదరాబాద్, డిసెంబర్ 23, పెన్ పవర్:**
రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల పరిస్థితి దారుణంగా తయారైంది. సరిపడ బోధనా సిబ్బంది లేక సర్కారు కాలేజీల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఉన్నత విద్యను ప్రభుత్వం పట్టించుకోవడంలేదనే విమర్శలువినిపిస్తున్నాయి. ఖాళీ అవుతున్న పోస్టులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు భర్తీ చేయకపోవడంతో డిగ్రీ కాలేజీల్లో బోధించే అధ్యాపకుల సంఖ్య ప్రతి ఏటా తగ్గిపోతోంది.రెగ్యులర్ అధ్యాపకులను నియ మించకుండా వారిస్థానంలో గెస్ట్, కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించుకొని నెట్టుకొస్తున్నారు. కాలేజీల్లో సరి పడా సిబ్బంది లేకపోవడంతో తమ పిల్లలను ఆ కాలేజీల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు పెద్దగా సుముఖత చూపించడంలేదు.డిగ్రీ కాలేజీల్లోని కీలక పోస్టులైన ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 149 డిగ్రీ కాలేజీలుంటే, వీటిలో 4,520 పోస్టులకు పనిచేస్తున్నది మాత్రం కేవలం 1,695 మందే. 2,825 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇందులోనూ 2,570 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండడం గమనార్హం. ఈ 2,570 పోస్టుల్లో 50 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా, మరో 50 శాతంజూనియర్ లెక్చరర్లను ప్రమోషన్ల ద్వారా భర్తీచేస్తారు. అంతేకాకుండా 145 ప్రిన్సిపాల్ పోస్టులకు గానూ ప్రస్తుతం పని చేస్తున్నది కేవలం 84 మందే.మిగతా పోస్టులు ఖాళీనే. ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు 133 ఉంటేకేవలం 23 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా 110 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థులను ఆటలు ఆడించే పరిస్థితే లేదు. లైబ్రేరియన్ పోస్టులు 133 ఉంటే, ఏకంగా 90 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.పనిచేస్తున్నది 43 మంది మాత్రమే. ఇలా ప్రధాన పోస్టుల్లో సిబ్బంది లేక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు కునారిల్లుతున్నాయి. ఉన్నవారినే ఇన్‌చార్జిలుగా పెట్టి కళాశాలలను నెట్టుకొస్తున్న పరిస్థితి ఉంది. సరిపడ అధ్యాపకులు



కాలేజీల్లో లేకపోవడంతో అడ్మిషన్లు తీసుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఇష్టపడంలేదు. పేరున్న మంచి కాలేజీల్లో సీట్లు నిండితున్నా మిగతా కాలేజీల్లో అయితే నిండడం కష్టంగానే మారింది. ఈ ఏడాది కాలేజీల్లోసీట్లు అంతంత మాత్రంగానే నిండాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో దాదాపు 90 వేల సీట్లుంటే 51 వేల అడ్మిషన్లు మాత్రమే నిండాయి.సిబ్బంది కొరత, సరైన వసతుల్లేకపోవడంతో ఇంటర్ తర్వాత చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లోనే చేరుతున్నారు. ప్రైవేట్ కాలేజీల్లో దాదాపు 1.22 లక్షల మంది చదువుతున్నారు. ప్రైవేట్ వైపు విద్యార్థులు మళ్లకుండా ఉండాలంటే ప్రభుత్వం అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంతోపాటు కాలేజీల్లో ల్యాబ్‌లు, ఇతర వసతులను కల్పించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# 29 నుంచి అసెంబ్లీ



**హైదరాబాద్, డిసెంబర్ 23, పెన్ పవర్:**
అసెంబ్లీ సమావేశాలు ఈనెల 29 నుంచి మొదలు కానున్నాయి. సమావేశాల్లో కృష్ణా, గోదావరి జలాల అంశమే ప్రధాన అజెండా కావాలి. అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ హయాంలో జరిగిన అన్యాయాన్ని ఎండగడదాం. గతబీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాల కారణంగా సాగు జలాల విషయంలో తెలంగాణ కోల్పోయిన హక్కులను ప్రజలకు తెలియజేద్దాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అవసరమైతే సభలోనే పవర్ పాయింట్‌ప్రజెంటేషన్ ఇవ్వాలని అభిప్రాయపడ్డారు.పాలమూరు – రంగారెడ్డి ఎత్తుపోతల ప్రాజెక్టుపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం ఆయన మంత్రులతో సమావేశమయ్యారు. ఇటీవలి సర్పం చ్ ఎన్నికలు, వచ్చే ప్రాదేశిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, పీఏసీఎస్ ఎన్నికలు, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలషెడ్యూల్‌తోపాటు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.దాదాపు మూడున్నర గంటల పాటు అనేక అంశాలపై చర్చ సాగింది. తెలంగాణ అనుమతి లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్కడ నిర్మిస్తున్న ప్రాజెక్టులను అడ్డుకునే కార్యాచరణపై సీఎం చర్చించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్లే కృష్ణా నీటి వాటాలో అన్యాయం జరిగిందని, ఇదే విషయాన్ని సభ వేదికగా ప్రజలకు పూర్తిగా వివరించాలనే నిర్ణయంతీసుకున్నారు. పంచాయతీ ఎన్నికలు మంచి ఫలితాలనే ఇచ్చాయని, కొన్ని పొరపాట్లు వల్ల స్థానాలు తగ్గాయని సీఎం అభిప్రాయపడినట్లు తెలిసింది.వచ్చే ప్రాదేశిక ఎన్నికల్లో ఆ పొరపాట్లకు తావు లేకుండా చూసేందుకు ఎత్తుగడలు రూపొందించేందుకు సిద్ధమయ్యారని సమాచారం. పంచాయతీ ఫలితాలపై మంత్రులకు ర్యాంకులు ఇచ్చినట్లుగా తెలిసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులదే బాధ్యత తీసుకోవాలనిసీఎం సూచించినట్లుగా తెలిసింది. మండల పరిషత్‌లతో పాట్లు జడ్పీ పీఠాలను క్లీన్ స్వీప్ చేయాలని సీఎం పిలుపునిచ్చినట్లు సమాచారం.జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల విలీనం.. డివిజన్ల ఏర్పాటుపై తీసుకున్ననిర్ణయాలు, నిబంధనలు మంత్రులకు సీఎం వివరించారు. కేంద్రం వద్ద పెండింగ్ నిధుల అంశంపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రానికి రావాల్సిన వాటిపై శాఖల వారిగా ఆయా మంత్రులు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎంసూచించారు.

## ఓటరు జాబితా సవరణ,మ్యాపింగ్ సమర్థవంతంగా నిర్వహించాలి

**జగిత్యాల, పెన్ పవర్:**
:జగిత్యాల జిల్లా నియోజకవర్గ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీలను నూతన ఓటర్ జాబితాలలో జనవరి 13 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ సూచించారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎస్.వి ఎల్ ఆర్ గార్డెన్ లో జగిత్యాల నియోజకవర్గం ఓటర్ జాబితా మ్యాపింగ్ అవగాహన సదస్సులో పాల్గొని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూరాబోయే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఎలక్టర్ మ్యాపింగ్‌ను సమర్థవం తంగా చేపట్టాలని, ఓటరు జాబితాల్లో ఉన్న డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీలను జాగ్రత్తగా గుర్తించి సరిచేయాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అంత్యంత ప్రధాన్యతగా పరిగణించాలని, నిర్ధేశిత గడువు లోగా అన్ని దశలను పూర్తి చేయాలని తెలిపారు. ముఖ్యంగా బ్లర్ ఫోటోలు ఉన్న ఓటరు ఎంట్రీలు, ఒకే వ్యక్తికి సంబంధించిన సమానమైన వివరాలతో ఉన్న డూప్లికేట్ ఎంట్రీలను తప్పనిసరిగా పరిశీలించి సవరణలు చేపట్టాలని, బిఎల్ వో లకు, ఎమ్మార్వోలకు, డిటి లకు, సూపర్ వైజర్లకు ఓటరు జాబితా పూర్తిగా తప్పులు లేకుండా సమర్థవంతంగా ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ స్పందన, ఎమ్మార్వోలు, తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక లో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందిగా...నీళ్ళు అడగొచ్చు

**వనపర్తి: పెన్ పవర్:** వనపర్తి జిల్లా ఆత్మకూరు లో జూరాల ప్రాజెక్ట్ యాసంగి నీటి విడుదల అంశం పై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణ నది ప్రవహించేదే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా. సరైన సమయంలో ప్రాజెక్ట్ లు కట్టకపోవడం వల్లే పాలమూరు జిల్లా కు ఈ దుస్థితి. నిజాం కాలంలో ఉన్నటువంటి ప్రాజెక్టు లను ఉమ్మడి ఏపీ లో రద్దు చేశారు. బచావత్ ట్రిబ్యునల్ ద్వారా జూరాల కు నీటి కేటాయింపు జరిగింది. ఆరున్నర టీఎంసి లు మాత్రమే జూరాలలో ఉంటాయని అన్నారు.లక్ష పదివేల ఎకరాలకు నీళ్లు ఇవ్వడానికి ముప్పై మూడు ఏళ్ళు పట్టింది. పూర్తిస్థాయి నీళ్లు నింపకుండా గేట్ లు తెరిచి పెట్టేవాళ్ళు. కర్ణాటక రాష్ట్రంలో పరిహారం ఇవ్వకుండా నాలుగేళ్లు ఆపారు. తొమ్మిది టీ ఏం సి లు వాడుకోలేని దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం లో ఉంది. యాసంగికి క్రాప్ హాలీడే ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జూరాల కింద సొంత ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది.. ఇంత భారీ వర్షాలు కురిసిన సాగునీళ్లు వాడుకోవడం లో అవగాహన లేదు. కాంగ్రెస్ మంత్రులు బుద్ధి లేని మాటలు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కు రోజుకి అవసరమైన నీళ్ళు రెండు టీ ఏం సి లు. జూరాల ను భారీ ఎత్తిపోతల కు రిసోర్స్ గా వాడలేమని అన్నారు.ఇది చాలాసార్లు చెప్పినం అయినా అర్థం కావట్లేదు. శ్రీశైలం లో అట్టడుగున నీళు ళ్ళ వాడుకునే విధంగా ఏపీ ప్రాజెక్టు లు నిర్మాణం చేపట్టింది. మనం అక్కడి నుండి నీళ్ళు తీసుకుంటాం అంటే వద్దు అంటారు. పాలమూరు ప్రాజెక్టు కోసం 27,100 ఎకరాలు భూసేకరణ చేశాం . రెండేళ్ల నుండి ప్రాజెక్టు పనులు పడావు పెట్టారు. 145 మెగావాట్ల సామర్థ్యం ఉన్న పంప్ లను ఏర్పాటు చేశాం. కొడంగల్ నారాయణ పేట కు పాలమూరు రంగారెడ్డి నుండే నీళ్లు పోతాయి..తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు కి నీళ్లు పోతాయి.. అంతకంటే ఎక్కువ ఖర్చుతో కొడంగల్ నారాయణ పేట కు నీళ్ళు తీసుకెళ్తా అంటాడు. బీఆర్ఎస్ ఉన్నపుడు క్రాప్ హాలీడే పెట్టకుండా నీళ్ళు ఎట్లా ఇచ్చినం. కర్ణాటక లో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందిగా...నీళ్ళు అడగొచ్చు కదా? రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. పాలనకు హాలీడే తీసుకోండి.. మీది పనికిమాలిన పాలన .. షాప్ లో ఇవ్వడానికి చేతకాదు.. కానీ యాప్ లో యూరియా ఇస్తాడట.. నది పై ప్రాంతాలు ఎండిపోయిన....కింద ప్రాంతాలు బాగుండాలని చెప్పిన ఆంధ్రా పాలకులు.. అదే నిజం అన్నట్లు పాలించిన మహా పురుషులు ఆంధ్రా పాలకులు. కల్వకుర్తి పంపులు రెండు వందల ఇరవై రోజులు నడిచాయి. జూరాల మీద పాలమూరు రంగారెడ్డి పెట్టాలన్న ఆలోచన మూర?మైనది. ఎవరన్న అది మాట్లాడితే బుద్ధి లేని మాటలు. ఆధారరహితంగా,పూర్తి భిన్నంగా మాట్లాడిన వారిని ఏమనాలి . ఏపీ కి 512 టి ఎం సి ,తెలంగాణ కు 299 టీ ఏం సి తాత్కాలిక ఏర్పాటు. ఏడాది కాలం కోసం ఇచ్చిన వెసులుబాటు. ఇవి ఉనికిలో ఉన్నాయి.. ఎవరు ఒప్పుకున్నది కాదు. అధిత్యనాథ్ దాస్ ఏపీ నుండి నీటి వాటా పై సంతకం చేశారు. ఎస్ కే జోషి తెలంగాణ నుండి సంతకం చేశారు. కేసీఆర్ మరణ శాసనం చేశారని పిచ్చి మాటలు మాట్లాడుతున్నారు. సీఎం రేవంత్ కి సలహాదారుగా పెట్టుకున్న అధిత్యనాథ్ దాస్ పెట్టిన సంతకం. ఆయన్ను అడగండి... ప్రెస్ మీట్ పెట్టీ చెప్పించండని అన్నారు.ఎందుకు సంతకం చేశారో ఆయన్ను అడిగితే చెప్తాడు. మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి. సముద్రంలో కలిసే నీళ్ళు మనకు రావాలని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ డిజైన్ చేశారు. జూరాల 19 టీ ఏం సి నుండి తొమ్మిది కి ఎందుకు వచ్చిందో కాంగ్రెస్ నాయకులకు తెలుసు. మక్తల్ లో రెండు లక్షల ఎకరాలకు బీమా నుండి నీళ్ళు వస్తున్నాయి.. ఆలమట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచుతున్నారు. జిల్లా కేంద్రం మొత్తం ఖాళీ చేయాలనుకుంటున్నారు. నీళ్ళు ఆపాల్సింది పోయి.. చెక్ డ్యాం లు కూల్చివేస్తున్నారు. సాగు, తాగు నీళ్లు అందించి ఈ ప్రాంతం కరువు తీర్చారు.రాష్ట్ర ప్రభుత్వానికి సోయి లేదు...ఇరిగేషన్ మంత్రికి సబ్జెక్ట్ లేదు..ఉత్తమ్ కుమార్ రెడ్డికి కనీస అవగాహన లేదు. మంత్రులు హెలికాప్టర్ వేసుకొని వస్తె కూడా జూరాల లో నాలుగు వందల మెజారిటీతో బీ ఆర్ ఎస్ గెలిచినం. కొడంగల్ కి పైప్ లైన్ ద్వారా నీళ్లు తీసుకొని పోతాం అంటే ఊరుకునేది లేదు.. మా నీళ్ళు తీసుకుపోతే నర్వ, ఆత్మకూరు,అమరచింత ఎడారి గా మారుతుంది.

## అర్ధరాత్రి అంతాయిపల్లిలో గుండాల హల్చల్

**మేడ్చల్: పెన్ పవర్:** మేడ్చల్?మల్కాజిగిరి జిల్లా శామీర్ పేట మండలం అంతయిపల్లి బిట్స్ కాలనీ సర్వేనెంబర్ 108 వద్ద ఉద్రిక్తత....సోమవారం రాత్రి పెద్ద ఎత్తున కిరాయి గుండాలు, రౌడీ మూకలు పట్టాదారుల భూమిలో హద్దులు మార్చి ఆక్రమణలకు యత్నం. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన కిరాయి గుండాలతో గత కొన్ని రోజులుగా పహారా కాస్తూ భయబ్రాంతులకు గురిచేస్తున్నారు. మాగం దేవేందర్ రెడ్డి మరియు మాగం నర్సింహారెడ్డి లకు చెందిన పట్టా భూమిలో సీసీ కెమెరాలను ధ్వ%శీ%సం చేసి, కంచెలను తొలగించారు. స్థానిక ప్రజలు నిత్యం ప్రయాణించే రోడ్డు ను సైతం కబ్జా చేసి అడ్డంగా కంటైనర్ను ఏర్పాటు చేసారు. స్థల టు యజమాని ఉదయం తమ స్థలంలోకి వెళ్లి చూడగా వారు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలు సూచిక బోర్డులు మరియు హద్దు రాళ్లు ముక్కలు ముక్కలుగా పడి ఉండడంతో వెంటనే పోలీసులను ఆశ్రయించారు. సంఘటన స్థలానికి చేరుకున్న శామీర్ పేట సిఐ శ్రీనాథ్ తన బృందంతో కబ్జాకి గురైన స్థలాన్ని పరిశీలించి ఆ స్థలంలో తిష్ట వేసిన 15 మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు,.

## బంగ్లాదేశ్ ఘటనలను ఖండిస్తూ హిందూ సంఘాల అందోళన

**హైదరాబాద్: పెన్ పవర్:** బంగ్లాదేశ్లో హిందువులపై జరుగుతున్న మారణహోమాన్ని ఖండిస్తూ కొత్తపేట చౌరస్తాలో బంగ్లాదేశ్ జిహాదీల దిష్టిబొమ్మ దహనం జరిగింది. హిందూ మైనారిటీలపై జరుగుతున్న మారణహోమాన్ని తీవ్రంగా ఖండిస్తూ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, హిందూ వాహిని, స్థానిక బీజేపీ కార్పొరేటర్స్ లతో కలిపి కొత్తపేట చౌరస్తాలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్లో హింసకు పాల్పడుతున్న జిహాదీ శక్తులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వారి దిష్టిబొమ్మను దహనం చేశారు.హైదరాబాద్ లో ఉన్న కేంద్ర రక్షణ రంగ సంస్థల చుట్టూ రోహింగ్యాలు అక్రమంగా వచ్చి నివాసం ఉంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వలెనే పెద్ద సంఖ్యలో అక్రమంగా వలస వచ్చి ఇక్కడ శాశ్వతంగా నివాసాలు ఏర్పరుచుకుని ఉండడం ఆందోళనకర విషయమని, కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థత వలనే నిఘా లేకపోవడం వలెనే అక్రమంగా వలసలు వస్తున్నారని, వారిని గుర్తించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ వలస దారులకు అడ్డుకట్ట వేయాలని %ఎన్డూ% నాయకులు డిమాండ్ చేశారు. బాధిత హిందువులకు న్యాయం చేయాలని, అంతర్జాతీయ సమాజం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకున్న కవిత

**యాదాద్రి: పెన్ పవర్:** జాగృతి జనంబాట కార్యక్రమం లో పాల్గొనేందుకు కవిత వెళ్తుండగా ఆమెకు అభివాదం చేసేందుకు ప్రయత్నించి తండ్రీకుమార్తె బైక్ పై నుంచి కింద పడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటనలో భాగంగా బీబీ నగర్ ఎయిమ్స్ కు వెళ్తుండగా నారపల్లి వద్ద బైక్ అదుపుతప్పి తండ్రీకుమార్తె కింద పడిపోయారు,. వారిని గమనించి కవిత వెంటనే తన వాహనం ఆపేసి కింద పడిన తండ్రీకుమార్తె వద్దకు వెళ్లి తన కాన్వాయ్ లోని వాహనం లో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.తండ్రీకుమార్తెలకు ప్రథమ చికిత్స చేయించారు. ఇద్దరికి ప్రమాదం లేదని డాక్టర్లు తెలిపారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## టీడీపీ నేతల్లో ఆనందం లేదెందుకంటే



**విజయవాడ, డిసెంబర్ 23, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ ఎన్నికల హీట్ మొదలయింది. వచ్చే ఏడాది నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. అందులో వైసీపీకి చెందిన మూడు, టీడీపీకి చెందిన ఒక స్థానం ఖాళీ అవుతుంది. టీడీపీకి చెందిన సానా సతీష్ తో పాటు వైసీపికి చెందిన పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డితో పాటు పరిమళ్ నత్వానీ పదవీ కాలం పూర్తి కావస్తుంది. అయితే ఇదే ఇప్పుడు టీడీపీ అధిష్టానినకి తలనొప్పిగా మారింది. టీడీపీకి చెందిన సానా సతీష్ కు మరోసారి రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. ఆయన పూర్తి కాలం పదవిలో లేకపోవడంతో మరొక అవకాశం ఇవ్వాలని ఇప్పటికే నాయకత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఆ ఒక్కటీ మాత్రం సానా సతీష్ కు తిరిగి దక్కనుంది. ఖాళీ అవుతున్న నాలుగు స్థానాల్లో ఖచ్చితంగా కూటమి గెలుచుకుంటుంది. అందుకే ఈ సారి ఈ పదవులకు పోటీ ఎక్కువగా ఉందని సమాచారం. ఇక మిగిలేది మూడు మాత్రమే. ఈ మూడింటిలో టీడీపీకి దక్కేది ఒక్కటేనని తెలుస్తోంది. ఎందుకంటే పరిమళ్ నత్వానీ స్థానంలో బీజేపీ నేత ఒకరిని పోటీకి దింపేందుకు ఇప్పటికే ఒప్పందం కుదిరినట్లు సమాచారం. రాష్ట్రంలో బీజేపీ నేతకు ఈ అవకాశం ఇస్తారా? లేక జాతీయ స్థాయిలో మరొకరికి ఇస్తారా? అన్నది మత్రం తేలకపోయినా మూడింటిలో ఒక్కటి మాత్రం కమలం ఖాతాలో పడుతుంది. చంద్రబాబు నాయుడు కూడా ఇటీవల ఢిల్లీ పర్యటనలో వచ్చే ఏడాది ఖాళీ అయ్యే రాజ్యసభ స్థానంలో మిత్రపక్షమైన బీజేపీకి ఇస్తామని చెప్పి వచ్చినట్లు కూడా హస్తిన నుంచి వినిపిస్తున్న టాక్. ఇక మరొకటి జనసేనకు ఖచ్చితంగా ఈ సారి రాజ్యసభ అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది. జనసేనకు ఇప్పటి వరకూ రాజ్యసభలో అవకాశం కలగలేదు. అయితే ఖాళీ అవుతున్న నాలుగు స్థానాల్లో ఒకటి ఇస్తామని చంద్రబాబు పవన్ కల్యాణ్ కు ఎప్పుడో మాట ఇచ్చినట్లు అంటున్నారు. జనసేన నుంచి అభ్యర్థి ముందుగానే ఖరారయినట్లు తెలుస్తోంది. లింగమనేని రమేష్ ను జనసేన నుంచి పోటీ చేయించి రాజ్యసభకు పంపాలని నిర్ణయించారు. చంద్రబాబు కూడా ఇందుకు అంగీకరించడంతో అది జనసేన ఖాతాలో పడినట్లే మిగిలిన ఒక్క సీటు కోసం పార్టీలో తీవ్రమైన పోటీ ఉంది. అనేక మంది ఆశావహులున్నారు. అయితే చంద్రబాబు చివరికి ఎవరి పేరును నిర్ణయిస్తారన్నది మాత్రం ఉత్కంఠ రేపుతుంది.

## వన్ స్టాప్ సొల్యూషన్ యాప్

**నెల్లూరు, డిసెంబర్ 23, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పురమిత్ర పేరుతో కూటమి ప్రభుత్వం ఓ యాప్‌ను గతంలో అందుబాటులోకి తెచ్చింది. తాజాగా ఈ యాప్‌లో పలు మార్పులు చేశారు. ఇక నుంచి ప్రజలు సమస్యలు మరింత త్వరగా పరిష్కారం కానున్నాయి. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ఏపీ ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను గతంలో తీసుకొచ్చింది. ఈ యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకుని ప్రజలు ఫొటోలతో సహా తమ సమస్యను అప్‌లోడ్ చేయవచ్చు. ప్రభుత్వ వీలైనంత త్వరగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని స్థానిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళు తున్నారు. అధికారులు సమస్యలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నారు. అయితే తాజాగా ఈ యాప్‌కి సంబంధించి ఏపీ ప్రభుత్వం పలు కీలక మార్పులు చేసింది. ఒక ప్రాంతంలో ఒకే అంశంపై ఐదుకిపైగా ఫిర్యాదులు వస్తే మున్సిపల్ కమిషనర్ల లాగిన్‌లో ఆరెంజ్ కలర్ హాట్‌స్పాట్లుగా కనిపిస్తాయి. వీటిని పరిష్కరించడానికి అధికారులు తమ క్షేత్రస్థాయి పర్యటనల్లో హై ప్రయారిటీ ఇవ్వాల్సి ఉంటుంది. ఒక సమస్యపై ఏదైనా ప్రాంతంలో ఐదుకిపైగా ఫిర్యాదులు వస్తే అవి కమిషనర్ల దృష్టికి ఆటోమేటిక్‌గా వెళ్తాయి. కమిషనర్ల లాగిన్స్‌లో అవి హాట్‌స్పాట్లుగా కనిపించడం వల్ల వెంటనే చర్యలు తీసుకోవడానికి వీలుంటుంది. నగరపాలక, మున్సిపల్, నగర పంచాయితీల కమిషనర్ల లాగిన్స్‌లో ఈ కొత్త మార్పు కనిపించనుంది. ఇలా ఒకే సమస్యపై ఐదు మందికిపైగా ఫిర్యాదు చేసినప్పుడు అది హాట్‌స్పాట్‌గా యాప్‌లో కనిపించడం వల్ల అక్కడ సమస్య తీవ్రంగా ఉందని అధికారులకు అర్థమవుతుంది. దీని వల్ల అధికారులు వెంటనే అప్రమత్తమై ప్రత్యేక దృష్టి పెట్టవచ్చు. దీని వల్ల ప్రజల సమస్యకు కూడా వెంటనే పరిష్కారం లభిస్తుంది. అంతేకాకుండా అధికారులందరూ కలిసి సమస్యను పరిష్కరించడానికి ఇది ఉపయోగపడుతుంది. అలాగే అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ సమస్యను పరిష్కరించాలి. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించినట్లు యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. స్ట్రీట్ లైట్స్, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్య, కుక్కలు, దోమల బెడద వంటి సమస్యలను కమిషనర్ల స్థాయిలోనే పరిష్కరించాలి.

## ఏపీలో కమలం సరికొత్త స్ట్రాటజీస్..!

**విశాఖపట్టణం, డిసెంబర్ 23, పెన్ పవర్:** కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు..దేశం మొత్తం బీజేపీ పాలిత రాష్ట్రాలుగా ఉండాలనేది కమలనాథుల కల. ఈ ఎజెండాతోనే 2014లో మోదీ పీఎ అయినప్పటి నుంచి..అయితే సొంతంగా..లేకపోతే కూటమి పక్షాలతో కలిపి ఒక్కో రాష్ట్రంలో జెండా పాతుతూ వస్తోంది బీజేపీ. అయితే ఏపీకి వచ్చేసరికి బీజేపీ డిఫరెంట్ సినారియోను ఫేస్ చేస్తోంది. కూటమిలో భాగంగా ఉంది. కేంద్రంలో జనసేన, టీడీపీ మద్దతు కీలకమైంది. అయినా నవ్యాంధ్రలో సొంతంగా బలపడాలనే ఆకాంక్షను మాత్రం వదిలిపెట్టడం లేదు కమలం పార్టీ లీడర్లు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నట్లుగా అధికారం ఉండగానే పార్టీని బలోపేతం చేసుకునే ప్లాన్‌లో ఉన్నారట. జాతీయ నాయకత్వం డైరెక్షన్స్ ప్రకారం అడుగులు ముందుకు వేస్తున్నారు ఏపీ బీజేపీ నేతలుగత ఎన్నికల్లో ఏపీలో బీజేపీ ఎనిమిది ఎమ్మెల్యే, మూడు ఎంపీ స్థానాలను గెలుచుకుంది. ఇక ఒక ఎమ్మెల్సీ పదవితో పాటు కొన్ని నామినేటెడ్ పోస్టులను ఆ పార్టీకి కూటమి పొత్తులో దక్కాయి. అలాగే రెండు రాజ్యసభ సీట్లు సొంతం చేసుకుంది. అయితే బీజేపీకి దక్కిన సీట్లు, నామినేటెడ్ పదవులు..పొత్తు వల్లనే అన్నది కమలనాథులతో పాటు ప్రజలందరికీ తెలిసిన ఓపెన్ సీక్రెట్. బీజేపీ 2014లో టీడీపీతో కలిసి 4 ఎంపీ, 4 ఎమ్మెల్యే సీట్లను గెలుచుకుంది. 2019లో సింగిల్‌గా పోటీ చేసే సరికి ఓటు షేర్ ఒక్క శాతం కంటే పెద్దగా రాలేదు. 2024లో మళ్లీ పొత్తుతో కమలం మరోసారి సత్తా చాటింది. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్నా..ఏపీలో కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయినా..ఏపీలో బీజేపీకి పట్టున్న ప్రాంతం ఏదంటే టక్కున సమాధానం చెప్పలేని పరిస్థితి. అర్బన్ ఏరియాల్లో బీజేపీ పట్ల జనం సానుభూతితో ఉండటం కామనే. కానీ రూరల్ ఏరియాలో మాత్రం అంతంత మాత్రమే. అయితే పట్టణ ప్రాంతాల్లో బీజేపీ బలాన్ని మరింత పెంచుకునేందుకు సరికొత్త వ్యూహాన్ని తెరమీదకు తెచ్చారు కమలనాథులు. బీజేపీ సీనియర్ నేత దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయ్ శత జయంతి వేడుకలను పెద్దఎత్తున నిర్వహించి.. విద్యావంతులను, పట్టణ ప్రాంత వాసులను తమవైపు తిప్పుకోవాలని చూస్తోందట. దీంతో వాజ్ పేయ్ శత జయంతి పేరిట యాత్ర అనంతపురం నుంచి ప్రారంభమైంది. శ్రీకాకుళం నుంచి విజయనగరం, విశాఖ దాకా సాగనుంది. గోదావరి జిల్లాలు, కృష్ణా గుంటూరులో కూడా ఈ యాత్ర నిర్వహించి 25న అమరావతిలో భారీ బహిరంగ సభతో ముగిస్తారట. వాజ్ పేయ్ పాలన, పనిలో పనిగా మోదీ అడ్మినిస్ట్రేషన్‌ను వివరిస్తూ జనం మద్దతు కూడగట్టే వ్యూహరచన చేస్తోందట బీజేపీ. దీనికి కేంద్రమంత్రులను బీజేపీకి చెందిన ఇతర రాష్ట్రాల సీఎంలను తీసుకొస్తున్నారు. అలాగే బీజేపీ నేషనల్ లీడర్లను కూడా ఏపీకి రప్పిస్తూ ఇప్పుడు మోదీ నాయకత్వంలో, అంతకు ముందు వాజ్ పేయ్ పాలనలో దేశానికి జరిగిన అభివృద్ధి ఏంటి.? తీసుకొచ్చిన సంస్కరణలేంటి.? అన్నదానిపై వివరించే ప్రయత్నం చేస్తున్నారుత్వరలో ఏపీలో జరగబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే బీజేపీ తనదైన పావులు కదుపుతూ..కార్యాచరణను రూపొందిస్తోందట. ఎక్కువ సీట్లను తాము తీసుకోవడం ద్వారా గ్రౌండ్ లెవల్‌లో బలపడితే అది 2029 ఎన్నికలకు ప్లస్ పాయింట్ అవుతుందని లెక్కలు వేసుకుంటుంది. అప్పుడు కనీసం 20 సీట్ల దాకా పొత్తులో భాగంగా గెలుస్తామనేది కమలనాథుల అంచనా అంటున్నారుదీనికి తోడు ఈ మధ్యే ఏపీ బీజేపీ ఎంపీల మీట్‌లో ప్రధాని మోదీ చేసిన దిశానిర్దేశం కూడా పనిచేస్తుందని అంటున్నారు. ఏపీలో వైసీపీపై ఎటాక్ స్టార్ట్ చేయాలని మోదీ సూచించినట్లు చెబుతున్నారు. దీంతో వైసీపీ ఓటు బ్యాంకును తమవైపునకు తిప్పుకోవాలనేది బీజేపీ స్కెచ్ అన్న టాక్ వినిపిస్తోంది. ఏపీలో బలపడేందుకు బీజేపీ వేస్తున్న మాస్టర్ ప్లాన్స్ ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి మరి

# ఐటి ఉద్యోగులకు ఎఐ ఎసరు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఊడ్చేస్తోంది. ఒకప్పుడు తిరుగులేని ఉద్యోగ రంగంగా ఉన్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) రంగంలో కొలువు. ఈ రోజుల్లో గాల్లో దీపంలా మారింది. గతంలో ఓ ఉద్యోగిని తొలగించారంటే ఎన్నో కారణాలు ఉండేవి. ఈ ఏడాది ఎఐ కారణంగా ప్రపంచవ్యాప్తంగా దాదాపు లక్షన్నర ఉద్యోగాలు పోయినట్లు అంతర్జాతీయ గణాంకాలు చెబుతుండగా, వీటిలో నూటికి 90 టెక్ ఉద్యోగాలే కావటం గమనార్హం. ఇలా ఉద్యోగాలు పీకేసిన సంస్థల్లో టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో, టెక్ మహీంద్రా వంటి కంపెనీలుండటం గమనార్హం. వీటిలో ఒక్క టిసిఎస్ సుమారు 20 వేల ఉద్యోగులను ఇంటికి పంపింది. గతంలో ఎవరి ఉద్యోగమైనా పోతే.. అనేక కారణాలుండేవి. కానీ, ప్రస్తుతం ఏ టెక్ సంస్థ అయినా లేఆఫ్ ప్రకటించిందంటే దానికి ఎఐ ప్రభావమే కారణమవుతోంది. ఈ నేపథ్యంలో టెక్ రంగంలోని ఉద్యోగులు తీవ్రమైన మానసిక ఒత్తిళ్ల మధ్య పనిచేయాల్సి వస్తోంది. ఏ రోజుకారోజు దినదిన గండం.. నూరేళ్ల ఆయుష్షుఅన్నట్లుగా వారు భయభయంగా ఉద్యోగాలు చేస్తున్నారు. రాబోయే ఐదేండ్లలో తమ ఉద్యోగులను పెద్దమొత్తంలో తొలగించనున్నట్టు 41% కంపెనీలు పేర్కొన్నట్టు వరల్డ్ ఎకానమిక్ ఫోరమ్ (డబ్ల్యుఇఎఫ్) ఇటీవల ఒక నివేదికలో వెల్లడించింది. ప్రధాన రంగాల్లోకి ఎఐ ప్రవేశించడమే దీనికి కారణంగా వివరించింది. అమెజాన్ ఎఐలో భారీ పెట్టుబడులు పెడుతోంది. 2025 నాటికి ఎఐ మెషిన్ లెర్నింగ్‌లో సుమారు ఎనిమిదిన్నర లక్షల కోట్లు ఖర్చు చేయడానికి కంపెనీ సిద్ధంగా ఉందని ప్రకటించింది. ఈ పెట్టుబడులతో, సంస్థలోని హై-పెయిడ్ వైట్-కాలర్ ఉద్యోగులను ఎఐద్వారా భర్తీచేయాలని అమెజాన్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఇప్పుడు విస్తృత చర్చకు దారితీస్తోంది. అమెజాన్ లేఆఫ్‌ల ప్రత్యక్ష ప్రభావం భారతదేశంపై పెద్దగా ఉండకపోవచ్చు. కానీ ఇతర బహుళజాతి కంపెనీలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయనేది ప్రశ్నార్థకంగా మారింది. బెంగళూరు, చెన్నై, పుణె, హైదరాబాద్‌లోని అవుట్‌సోర్సింగ్ హబ్‌లు ఇప్పటికే ఎఐ నుండి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. చాలా వరకు ఐటి కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఉద్యోగులకు శిక్షణ కూడా ఇస్తున్నాయి. రానున్న రోజుల్లో దీనిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం అవుతున్నాయి. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, క్రౌడ్ స్ట్రైక్, ఐబిఎం వంటి పెద్ద కంపెనీలు సుమారు 70,000 మంది ఉద్యోగులను తొలగించారు. మైక్రోసాఫ్ట్ లాభదాయకతను పెంచుకోవడం, ఎఐ, డేటా సెంటర్లలో భారీ పెట్టుబడుల కోసం ఉద్యోగులను తొలగిస్తోంది. ఐబిఎం హెచ్‌ఆర్ కార్యకలాపాలలో ఎఐ వ్యవస్థలను విస్తృతంగా ప్రవేశపెట్టి 8 వేల మంది ఉద్యోగులను తగ్గించింది. అమెరికా టెక్ దిగ్గజాలు భారతదేశంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులను కలిగి ఉన్నాయి. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, సేల్స్, సపోర్ట్ వంటి విభాగాల్లో భారతీయ నిపుణులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఈ లేఆఫ్‌లు భారతీయ ఉద్యోగులపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావం చూపుతాయి. ఐటి రంగంలో ఇప్పుడు ఆటోమేషన్, ఎఐ టెక్నాలజీలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ టెక్నాలజీల పుణ్యమా అని పునరావృత పనుల్లో ఉద్యోగుల అవసరం లేకుండాపోతోంది. మిగతా పనుల్లోనూ ఐటి కంపెనీలు ఎఐని విరివిగా ఉపయోగిస్తున్నాయి. అందుకోసం ఉన్న ఉద్యోగులకే కొత్త డిజిటల్ టెక్నాలజీల్లో శిక్షణ ఇచ్చి వినియోగించుకుంటున్నాయి. ఆ టెక్నాలజీలపై పట్టు సాధించలేని ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. ఐటి ఉద్యోగులకు ఎఐ ఒక పెద్ద సవాలుగా మారింది. పొదుపు చర్యలు, పెరుగుతున్న నైపుణ్య అవసరాలు, ఆటోమేషన్, ఎఐ అడాప్టేషన్ ఒత్తిళ్లతో ఉద్యోగ ప్రపంచం తలకిందులవుతోంది. ఉద్యోగం ఉంటుందా, ఊడుతుందా అనే టెన్షన్‌తో టెకీలు ఆందోళన చెందుతున్నారు. ఇఎంఐలు ఎలా కట్టాలి? మరో ఉద్యోగం ఎప్పుడు వస్తుంది అనే ప్రశ్నలు వారిని వెంటాడుతున్నాయి. కంపెనీలు వ్యయం తగ్గింపు, నష్టాల నియంత్రణ వంటి కారణాలకు బదులు, ఇప్పుడు సంస్థ పునర్నిర్మాణం, పురోగతి, వర్క్‌ఫోర్స్ ఆప్టిమైజేషన్ వంటి పదాలను ఉపయోగిస్తూ ఉద్యోగులను తొలగిస్తున్నాయి. కమ్యూనికేషన్లు, పాడ్‌కాస్టింగ్, పరికరాలు, హెచ్‌ఆర్, సర్వీస్ డిపార్ట్‌మెంట్‌లలో కోతలు ఎక్కువగా ఉన్నాయి. వ్యయ నియంత్రణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. భారత ఐటి రంగంలో సైలెంట్ లేఆఫ్‌లు ఉద్యోగుల్లో దడ పుట్టిస్తున్నాయి. ఎఐ సాంకేతికతతో ఇంజనీరింగ్ పనులను ఆటోమేట్ చేయడం, వ్యయ తగ్గింపు చర్యలు, వ్యాపార వృద్ధిలో మందగమనం వంటివి దీనికి కారణాలు. కంపెనీలు సామూహిక లేఆఫ్‌లను ప్రకటిస్తే మార్కెట్లో చెడు సంకేతం వెళ్తుందని భావించి, ఉద్యోగులే స్వచ్ఛందంగా రాజీనామా చేసేలా ఒత్తిడి చేసే పద్ధతులను అనుసరిస్తున్నాయి. ఎఐ వల్ల ఉద్యోగాలు పోతాయని 67.5 శాతంమంది ఇంజినీర్లలో ఆందోళన నెలకొన్నట్లు ఒక అధ్యయనంలో తేలింది.

నైపుణ్యాల్ని పెంచుకోకపోతే కెరీర్‌కు రక్షణ ఉండదని 87.5 శాతం మంది అభిప్రాయపడ్డారు. వచ్చే పదేళ్లలో 40 శాతం వరకు జాబ్స్ ఎఐ పరిధిలోకి వెళ్లే అవకాశం ఉందని, దీంతో 89 శాతం మేర ఇంజినీర్లు ఎఐ, ఎంఎల్‌లోనే కొత్త నైపుణ్యాల్ని నేర్చుకోవాలనుకుంటున్నారని ఆ అధ్యయంలో పేర్కొంది. ఎఐ విప్లవంపై మరో వాదన కూడా ఉంది. ఎఐ అభివృద్ధి వల్ల ఉద్యోగాల స్వరూపం మారుతుందని ఒకవైపు చర్చ జరుగుతుంటే, అనేక సంస్థలు ఖర్చులను తగ్గించుకోవడానికి ఉద్యోగాలను తొలగిస్తూ, దానికి ఎఐ ని కారణంగా చూపుతున్నాయని విమర్శలు ఉన్నాయి. ఎఐ సాధనాలు ఇప్పటివరకు కొన్ని రంగాల్లో మాత్రమే ప్రభావవంతంగా ఉన్నాయని, వేలాది మంది ఉద్యోగాలను ఒకేసారి భర్తీ చేసే స్థాయికి ఇంకా చేరలేదని కొందరు నిపుణులు వాదిస్తున్నారు. ఈ పరిణామాల మధ్య ఎఐ సునామీని ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది, భారతీయ ఉద్యోగ మార్కెట్ ఈ మార్పులకు అనుగుణంగా మారాల్సి ఉంటుంది.

# క్వాంటం వ్యాలీ... కొత్త దిశ

**విజయవాడ, డిసెంబర్ 23, పెన్ పవర్:**
అమరావతి ఇక కేవలం రాజధాని మాత్రమే కాదు. రానున్న కాలంలో దేశానికి దిశ చూపే టెక్నాలజీ కేంద్రంగా మారేందుకు అడుగులు వేస్తోంది. క్వాంటం టెక్నాలజీ వంటి అత్యాధునిక రంగంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, పరిశోధనలు, ఉద్యోగాల కల్పన.. ఆల్ ఇన్ వన్ కాన్సెప్ట్ అమరావతి నుంచే ప్రారంభం కానుంది. తాజాగా క్వాంటం వ్యాలీకి నిధులు విడుదల చేయడంతో ఈ దిశగా ప్రభుత్వ సంకల్పం మరోసారి స్పష్టమైంది. ‘ఉద్యోగాలే ఉద్యోగాలు’ అన్న నినాదం కాగితాలకే పరిమితం కాకుండా, గ్రౌండ్ పై కనిపించే దశకు చేరుతోంది. సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సీఆర్డీయే 65వ అథారిటీ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలు అమరావతి భవిష్యత్తుకు మైలురాయిగా నిలుస్తున్నాయి. క్వాంటం వ్యాలీకి సంబంధించిన ప్రత్యేక భవనాల నిర్మాణానికి టెండర్లు ఖరారు కావడం, అదనంగా మరిన్ని భవనాల నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించడం అన్నీ కలిపి అమరావతిని టెక్నాలజీ మ్యాప్‌లో మరో మెట్టు ఎక్కిస్తున్నాయి. ప్రపంచం వేగంగా మారుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, డేటా అనలిటిక్స్‌తో పాటు ఇప్పుడు క్వాంటం టెక్నాలజీ దేశాల భవిష్యత్తును నిర్ణయించే రంగంగా మారింది. కంప్యూటింగ్ శక్తిని విప్లవాత్మకంగా మార్చే ఈ టెక్నాలజీలో ముందడుగు వేయడం అంటే భవిష్యత్తును ముందే అందుకోవడమే. ఆ అవకాశాన్ని అమరావతి సొంతం చేసుకుంటోంది. క్వాంటం వ్యాలీ లక్ష్యం ఒక్క పరిశోధన కేంద్రం మాత్రమే కాదు. ఇది ఒక పూర్తి ఎకోసిస్టమ్. రీసెర్చ్ ల్యాబ్స్, స్టార్టప్ ఇన్క్యుబేషన్, ఇండస్ట్రీ భాగస్వామ్యం, గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్స్.. అన్నీ కలిసి పనిచేసే వ్యవస్థ. దీనివల్ల నేరుగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందని ప్రభుత్వ అంచనా. సీఆర్డీయే సమావేశంలో తీసుకున్న ప్రధాన నిర్ణయాల్లో ఒకటి.. క్వాంటం వ్యాలీలో ఎక్విప్‌మెంట్ కోసం ప్రత్యేక భవనం నిర్మించడం. సుమారు 43,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 103.96 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ భవనానికి టెండర్లు పిలిచి %ా%1ను ఖరారు చేశారు. ఇది రెండు ఎకరాల విస్తీర్ణంలో, టెక్నికల్ నిపుణుల డిజైన్ ప్రకారం నిర్మించనున్నారు. ఈ భవనం సాధారణ కార్యాలయంగా కాదు. అత్యాధునిక క్వాంటం పరికరాలు, సెన్సిటివ్ ఎక్విప్‌మెంట్, పరిశోధనల కోసం అవసరమైన ప్రత్యేక వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్మించనున్నారు. టెంపరేచర్ కంట్రోల్, వైబ్రేషన్ ఫ్రీ ఫ్లోర్స్, సెక్యూరిటీ అన్నీ కలిపి ప్లాన్ చేసినవిక్వాంటం వ్యాలీలో మరో రెండు భవనాల నిర్మాణాన్ని కూడా వెంటనే చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా, టైమ్‌లైన్‌కు కట్టుబడి ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. “డిజైన్ దశలోనే ఆలస్యం చేయొద్దు. పనులు మొదలైతే ఆగకూడదు” అన్నది ముఖ్యమంత్రి స్పష్టం చేసిన దిశ. ఈ రెండు భవనాలు రీసెర్చ్ టీమ్స్, స్టార్టప్స్, గ్లోబల్ కంపెనీలకు అవసరమైన ఆఫీస్, ల్యాబ్ స్పేస్‌గా ఉపయోగపడనున్నాయి. అంటే, క్వాంటం వ్యాలీ ప్రారంభ దశ నుంచే కార్యకలాపాలు గట్టిగా మొదలయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. క్వాంటం వ్యాలీ వల్ల ఉద్యోగాలు ఎలా వస్తాయి? అన్న ప్రశ్న సహజం. ఇది కేవలం ఒక ప్రభుత్వ ప్రాజెక్ట్ కాదు. ఇది ఒక మల్టీ-లేయర్ ఎకోసిస్టమ్. మొదటి దశలో నిర్మాణ పనుల ద్వారానే వందల మంది కార్మికులకు ఉపాధి. ఇంజినీర్లు, టెక్నికల్ సిబ్బంది, సపోర్ట్ స్టాఫ్ అందరూ అవసరం. రెండో దశలో పరిశోధన కేంద్రాలు ప్రారంభమవుతాయి. ఫిజిక్స్, మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న యువతకు రీసెర్చ్ అసిస్టెంట్స్, సైంటిస్ట్స్, ల్యాబ్ టెక్నీషియన్లుగా అవకాశాలు. మూడో దశలో స్టార్టప్స్. క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం సెక్యూరిటీ, క్వాంటం సెన్సార్స్ వంటి రంగాల్లో స్టార్టప్స్ రావడం ద్వారా సాఫ్ట్‌వేర్ డెవలపర్స్, డేటా సైంటిస్ట్స్, హార్డ్‌వేర్ ఇంజినీర్లకు భారీగా ఉద్యోగాలు. నాలుగో దశలో గ్లోబల్ కంపెనీలు. ఒకసారి ఎకోసిస్టమ్ ఏర్పడితే, పెద్ద కంపెనీలు అమరావతిని తమ ఆర్‌అండ్‌డీ హబ్‌గా ఎంచుకునే అవకాశం ఉంది. అప్పుడు ఉద్యోగాల సంఖ్య వేలల్లోకి వెళ్తుందిఇప్పటివరకు ఐటీ అంటే బెంగళూరు, హైదరాబాద్ అన్న భావన ఉండేది. క్వాంటం వ్యాలీతో అమరావతి కూడా ఆ లిస్టులో చేరనుంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ యువతకు ఇది గోల్డెన్ ఛాన్స్. బయట రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి తగ్గే అవకాశం ఉంది. ఇక్కడే చదువు, ఇక్కడే పరిశోధన, ఇక్కడే ఉద్యోగఅన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కాలేజీలతో లింకేజ్ ఏర్పడితే, స్టూడెంట్స్‌కు ఇంటర్న్‌షిప్స్, ప్రాజెక్ట్ వర్క్, ప్లేస్‌మెంట్స్ అన్నీ కలిపి ప్లాట్‌ఫామ్‌గా క్వాంటం వ్యాలీ మారుతుంది. అమరావతి బ్రాండ్ బలపడేలా క్వాంటం వ్యాలీ కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు. ఇది అమరావతి బ్రాండ్‌ను గ్లోబల్ మ్యాప్‌పై నిలబెట్టే ప్రయత్నం. ఇప్పటివరకు అమరావతి అంటే పరిపాలనా రాజధాని అనే గుర్తింపు. ఇకపై టెక్నాలజీ రాజధానిగా కూడా గుర్తింపు పొందే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇది ఇతర రంగాలకు కూడా ఊతమిస్తుంది. హౌసింగ్, రియల్ ఎస్టేట్, ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్ అన్ని రంగాల్లో ఉద్యోగాలు పెరిగితే నగరంలో ఆర్థిక చక్రం వేగం పెరుగుతుంది. స్పష్టమైన విజన్ సీఆర్డీయే సమావేశంలో కనిపించింది.

# భారీగా పెరిగిన కోడిగ్రుడ్డు ధర



**విజయవాడ, డిసెంబర్ 23, పెన్ పవర్:**
నాన్‌వెజ్ ప్రియులకు ఇది బ్యాడ్‌న్యూస్ అనే చెప్పవచ్చు. ఇప్పటికే కోడి గుడ్ల ధరలు పెరుగుతోండగా.. దానితో పాటు చికెన్ ధరలు కూడా భగ్గుమంటున్నాయి. త్వరలో క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి లాంటి ప్రధాన పండుగలు వస్తుండటంతో వివిధ ప్రాంతాలకు కోళ్ల సరఫరా పెరిగిపోయింది. దీంతో డిమాండ్ కారణంగా చికెన్ ధరలు పెరిగిపోతున్నాయి. దాణా ఖర్చులు పెరుగడంతో కోళ్ల ఫామ్స్ నిర్వహణ కూడా యజమానులకు కష్టంగా మారిపోయింది. దీంతో ధరల పెరుగుదలకు ఇది కూడా ఒక కారణంగా చెబుతున్నారు. గుడ్లు, చికెన్ ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల ఇంటి ఖర్చు పెరుగుతోంది. దీంతో పండుగ వేళ సామాన్యులకు భారం తప్పడం లేదు. మరికొన్ని రోజుల పాటు ధరలు ఇలాగే కొనసాగే అవకాశముందని తెలుస్తోంది. నెల క్రిందట గుడ్డు ధర రూ.5 ఉండగా.. ఇప్పుడు ఏకంగా రూ.3 పెరిగి రూ.8కి చేరుకుంది. హోల్‌సెల్ మార్కెట్లో రూ.7.50గా ఉండగా.. రిటైలర్లు రూ.8కి విక్రయిస్తున్నారు. ఇక నాటుకోడి గుడ్డు ధర రూ.15 పలుకుతోంది. ఇక వీటితో పాటు చికెన్ ధరలు కూడా అమాంతం పెరిగాయి. నెలలోనే రూ.100 మేర కేజీ చికెన్ ధర పెరిగింది. నెల క్రితం రూ.190 నుంచి రూ.200 మధ్య కేజీ చికెన్ ధర కొనసాగింది. ఈ నెల ప్రారంభంలో రూ.230 వరకు చేరుకోగా.. ఆదివారం నాటికి రూ.290కి చేరుకుంది. దీంతో నెల రోజుల్లో రూ.100 మేర చికెన్ ధర పెరిగినట్లయింది. పండుగల సీజన్ కావడంతో చికెన్‌కు ఫుల్ డిమాండ్ పెరగడం, డిమాండ్‌కు తగ్గట్లు కోళ్ల ఫామ్స్ నుంచి కోళ్లు రాకపోవడంతో ధరలు పెంచుతున్నారు. ఇక కోళ్లకు వేసే దాణా ఖర్చులు కూడా భారీగా పెరిగాయి. అలాగే ఇతర ఖర్చులు కూడా పెరగడంతో చికెన్ ధరలు పెంచాల్సి వస్తోందని యజమానులు చెబుతున్నారు. అసలే త్వరలో పండుగల సీజన్ వస్తుండటంతో చికెన్ ఎక్కువగా తింటూ ఉంటారు. ఈ సమయంలో రేట్లు పెరగడం సామాన్యులకు భారం కానుందని చెప్పవచ్చు. మరో నెల రోజుల పాటు పరిస్థితి ఇలాగే ఉంటుందని, ఆ తర్వాత ధరలు తగ్గే అవకాశం ఉంటుందని పౌల్ట్రీ ఎక్స్‌పర్ట్ చెబుతున్నారు. ప్రస్తుతం ఒక్క కోడిగుడ్డు రికార్డు స్థాయిలో రూ. 8కి చేరింది. ఇక హోల్‌సేల్ మార్కెట్లోనే ఒక్కో గుడ్డు ధర రూ.7.30 పలుకుతుండటం విశేషం. గతంలో ఒక ట్రే (30 గుడ్లు) రూ.160 నుంచి రూ.170 వరకు లభించేవి. కానీ, ప్రస్తుతం అది రూ.210 నుంచి రూ. 220కి చేరింది. కోడిగుడ్డు ధరలు ఈ స్థాయికి చేరుకోవడం పౌల్ట్రీ ఇండస్ట్రీ చరిత్రలోనే తొలిసారి అని చెబుతున్నారు. అయితే, ధరలు ఇంతలా పెరగడానికి ప్రధాన కారణం డిమాండ్ కు తగిన ఉత్పత్తి లేకపోవడమే. ఇక నాటు కోడి గుడ్ల విషయానికి వస్తే ఒక్కో గుడ్డు ధర రూ.15 వరకు పలుకుతోంది. గతంలో తెలుగు రాష్ట్రాల్లో రోజుకు సుమారు 8కోట్ల గుడ్లు ఉత్పత్తి అయ్యేవి. అయితే, కోళ్ల ఫారాల నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతున్న నేపథ్యంలో చాలా మంది పౌల్ట్రీ యాజమానులు ఈ రంగానికి దూరమవుతున్నారు. కోళ్లకు పెట్టే దాణా, మక్కలు, సోయా, చేపపొట్టు వంటి ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల చిన్న, మధ్యతరహా రైతులు కోళ్ల ఫారాలను మూసివేస్తున్న పరిస్థితి. గతంలో కోల్డ్ స్టోరేజీల్లో దాదాపు 20కోట్ల గుడ్లు నిల్వ ఉండేవని, ప్రస్తుతం ఆ నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మరికొద్దిరోజులు కోడిగుడ్డు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. కోళ్ల దాణాపై సబ్సిడీ ఇవ్వడం లేదా ఉత్పత్తిని పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తప్ప ధరలు అదుపులోకి వచ్చే సూచనలు కనిపించడం లేదు.

## పని గంటల కంటే నాణ్యత ముఖ్యం
## ఇన్ఫోసిస్ సహ-వ్యవస్థాపకుడు శిబులాల్



**హైదరాబాద్ పెన్ పవర్:** గత కొంతకాలంగా ఉద్యోగుల పని గంటల గురించి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా దేశీయ ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ సహ–వ్యవస్థాపకుడు ఎన్ ఆర్ నారాయణ మూర్తి వారంలో 70 గంటలు పని చేయాలని సూచించారు.ఈ నేపథ్యంలో ఇన్ఫోసిస్ సహ–వ్యవస్థాపకుడు ఎస్ డీ శిబులాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఐఐఎంయూఎన్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. వారంలో ఎక్కువ గంటలు పనిచేయడం కంటే, చేసే పనిపై ఎక్కువ దృష్టి ఉండాలని అభిప్రాయపడ్డారు. వారానికి 70 గంటల పని మూర్తి వ్యాఖ్యలపై స్పందించిన శిబులాల్.. నా దృష్టిలో సమయం కంటే, నాణ్యత ముఖ్యం. చేస్తున్న పని విషయంలో లీనమై ఉండాలి. దృష్టి మరల్చకూడదు. పని చేస్తున్నప్పుడు సెల్‌ఫోన్, ఇతర ఆలోచనలపై దృష్టి వెళ్లకూడదు. ఒక వ్యక్తి ఏ పని ఎంచుకున్నా, 100 శాతం అందులో లీనమై ఉండాలని, పూర్తి అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు. అంతిమంగా వ్యక్తిగత నిర్ణయాలు, సమయపాలన వంటి వివిధ అంశాలకు మనమిచ్చే ప్రాధాన్యతలకు సంబంధించినవని అన్నారు. వ్యక్తిగత, వృత్తిపరమైన, ప్రజా జీవితం అనేవి ఉంటాయి, ఈ మూడింటి మధ్య సమయాన్ని విభజించడమే ఒక వ్యక్తి చేయాల్సిన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

## ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ట్రేడింగ్‌ను స్వల్ప నష్టాలతో, దాదాపు ఫ్లాట్‌గా ప్రారంభించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వస్తున్న మిశ్రమ సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తుండటంతో సూచీలు పెద్దగా కదలికలు లేకుండా కనిపిస్తున్నాయి. ప్రారంభ సెషన్‌లో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ సుమారు 88 పాయింట్లు కోల్పోగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 23 పాయింట్ల స్వల్ప నష్టంతో కొనసాగుతోంది. సెన్సెక్స్ 30 ప్యాక్‌లోని కంపెనీల పనితీరును గమనిస్తే, కొన్ని భారీ సంస్థలు లాభాల బాటలో పయనిస్తూ మార్కెట్‌కు మద్దతు ఇస్తున్నాయి. ముఖ్యంగా బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్, టాటా స్టీల్ వంటి షేర్లు కొనుగోళ్ల మద్దతుతో రాణిస్తున్నాయి. వీటితో పాటు లార్సెన్ అండ్ టూబ్రో, టైటన్ కంపెనీ షేర్లు కూడా సానుకూల ధోరణిని ప్రదర్శిస్తూ ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. రంగాల వారీగా చూస్తే మెటల్, పవర్ రంగాలు కొంత మెరుగ్గా పనిచేస్తున్నాయి. మరోవైపు, ఐటీ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తోంది, ఇది మార్కెట్ సూచీలను కిందికి లాగుతోంది. ప్రముఖ ఐటీ దిగ్గజాలైన ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా వంటి సంస్థలు నష్టాల్లో ట్రేడవుతుండటం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోంది. వీటితో పాటు ఏషియన్ పెయింట్స్ షేర్లు కూడా నష్టాల బాట పట్టడంతో, ఐటీ మరియు కన్స్యూమర్ గూడ్స్ రంగాల్లో బలహీనత కనిపిస్తోంది. గ్లోబల్ ఐటీ ఖర్చులపై నెలకొన్న అనిశ్చితి ఈ ప్రభావానికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను విశ్లేషిస్తే, ఇన్వెస్టర్లు పెద్దగా రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడటం లేదని అర్థమవుతోంది. ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిణామాలు మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తున్నాయి. రానున్న గంటల్లో మరిన్ని కంపెనీల త్రైమాసిక ఫలితాలు మరియు విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళిని బట్టి మార్కెట్ ఏదో ఒక దిశలో పయనించే అవకాశం ఉంది. ప్రస్తుతానికి మార్కెట్ స్వల్ప శ్రేణిలోనే కదలాడుతూ స్థిరపడేందుకు ప్రయత్నిస్తోంది.

## ఆకాశమే హద్దుగా పసిడి పరుగులు



**హైదరాబాద్ పెన్ పవర్:** బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి.
సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుతూ పసిడి ధరలు సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి.కేవలం ఒక్క రోజులోనే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.2,400 పెరిగి రూ.1,38,550కి చేరడం ఇన్వెస్టర్లను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గత కొద్ది రోజులుగా మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితి, అంతర్జాతీయ పరిణామాల కారణంగానే ధరలు ఈ స్థాయిలో పెరుగుతున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.గత రెండు రోజుల్లోనే బంగారం ధర దాదాపు రూ.4,370 మేర పెరగడం గమనార్హం. ఈ భారీ పెరుగుదల కొనుగోలుదారులకు కోలుకోలేని షాక్ ఇస్తోంది. 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర కూడా దీనికి ఏమాత్రం తీసిపోకుండా పరుగులు పెడుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధరపై రూ.2,200 ఎగబాకి ప్రస్తుతం రూ.1,27,000 వద్ద కొనసాగుతోంది. శుభకార్యాల సీజన్ నడుస్తున్న తరుణంలో ఈ ధరల పెరుగుదల మధ్యతరగతి ప్రజలకు పెను భారంగా మారుతోంది. కేవలం బంగారం మాత్రమే కాకుండా, వెండి ధరలు కూడా భారీగానే పెరిగాయి. కిలో వెండి ధరపై ఏకంగా రూ.3,000 పెరగడంతో మార్కెట్‌లో వెండి ధర రూ.2,34,000 మార్కును తాకింది. పారిశ్రామిక అవసరాలు మరియు వెండిపై పెరుగుతున్న పెట్టుబడుల కారణంగానే ఈ స్థాయిలో రేట్లు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. వెండి నగలు లేదా వస్తువులు కొనాలనుకునే వారు ఇప్పుడు భారీగా జేబులు ఖాళీ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.
తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపు అన్ని ప్రధాన నగరాల్లోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నంలలో కూడా బంగారం, వెండి ధరల్లో పెద్దగా మార్పులు లేకుండా ఒకే రీతిన ట్రేడ్ అవుతున్నాయి. రానున్న రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులను బట్టి ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందనే వార్తలు వినియోగదారులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.

## వడ్డీ రేటు 7.15 శాతానికి తగ్గిస్తూ
## ఎల్‌ఐసీహెచ్‌ఎఫ్‌ఎల్ నిర్ణయం




**హైదరాబాద్ పెన్ పవర్:** ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గృహ రుణ గ్రహీతలకు శుభవార్తను అందించింది. గృహ రుణాలపై వడ్డీ రేట్లను 7.15 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇటీవల ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎల్‌ఐసీహెచ్‌ఎఫ్‌ఎల్ ఈ ప్రయోజనాన్ని వినియోగదారులకు అందిస్తోంది. ఈ తగ్గింపు నిర్ణయం నేటి నుంచి అమలులోకి వస్తుందని సంస్థ తెలిపింది.ఈ మేరకు ఎల్‌ఐసీహెచ్‌ఎఫ్‌ఎల్ ఎండీ అండ్ సీఈవో త్రిభువన్ అధికారి మాట్లాడుతూ, ఈ సంవత్సరం ఆర్బీఐ 125 బేసిస్ పాయింట్ల రెపో రేటును తగ్గించిందని తెలిపారు. ఇది గృహ రుణాలు తీసుకునే వారికి కొంత భారం తగ్గిస్తుందని ఆయన అన్నారు. 2026లోకి అడుగుపెట్టనున్న ఈ సమయంలో వడ్డీ రేట్ల తగ్గింపు గృహ రుణాల డిమాండ్‌కు ఊతమిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఆర్బీఐ ఇటీవల రెపో రేటు తగ్గించిన తరువాత పలు బ్యాంకులు ఇప్పటికే వడ్డీ రేట్లను తగ్గిస్తూ నిర్ణయాలు తీసుకున్నాయి. ఈ క్రమంలో ఎల్‌ఐసీహెచ్‌ఎఫ్‌ఎల్ కూడా రుణ గ్రహీతలకు ఊరట కలిగిస్తూ నిర్ణయం తీసుకుంది. సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు ఈ నిర్ణయం తోడ్పడుతుందని ఎల్‌ఐసీహెచ్‌ఎఫ్‌ఎల్ ఒక ప్రకటనలో పేర్కొంది.

# కీలక రంగాల ఉత్పత్తి పడక



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత పారిశ్రామికోత్పత్తి రంగంలో అత్యంత కీలకమైన ఎనిమిది ప్రాధాన్యత రంగాలు పడకేశాయి. ఈ ఏడాది నవంబర్‌లో ఈ మౌలిక వసతుల రంగాల ఉత్పత్తి ఏకంగా 1.8 శాతానికి మందగించినట్టు సోమవారం కేంద్ర ప్రభుత్వ గణంకాలు వెల్లడించాయి. సిమెంట్, ముడి చమురు, సహజ వాయువు, ఎరువులు, విద్యుత్, బొగ్గు, స్టీల్, రిఫైనరీ తదితర ప్రధాన రంగాలు గతేడాది ఇదే నెలలో 5.8 శాతం వృద్ధిని కనబర్చగా.. గడిచిన నెలలో ఏకంగా 1.8 శాతానికి పడిపోవడం ఆర్థిక వ్యవస్థలోని మందగమనాన్ని సూచిస్తోంది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో వీటి వాటా 40.27 శాతంగా ఉంది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 2025 నవంబర్‌లో బొగ్గు ఉత్పత్తి పెరుగుదల 2.1 శాతానికి పరిమితమయ్యింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ కాలంలో ఇది 1.4 శాతం వృద్ధితో సరిపెట్టుకుంది. గడిచిన నెలలో చమురు ఉత్పత్తి 3.2 శాతానికి పడిపోయింది. సహజ వాయువు ఉత్పత్తి 2.5 శాతానికి, పెట్రోలియం రిఫైనరీ 0.9 శాతానికి పరిమితమయ్యాయి. ఎరువులు 5.6 శాతం, స్టీల్ 6.1 శాతం, సిమెంట్ 14.5 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేశాయి. విద్యుత్ రంగం ఉత్పత్తి 2.2 శాతానికి పడిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ కాలంలో ఎనిమిది ప్రాధాన్యత రంగాల ఉత్పత్తి 2.4 శాతానికి క్షీణించింది. గతేడాది ఇదే కాలంలో 4.4 శాతం వృద్ధి నమోదయ్యింది. దీంతో పోల్చితే ప్రాధాన్యత రంగాల ఉత్పత్తి సగానికి కుంచించింది. మందగమనం వల్ల అధిక ధరలు, నిరుద్యోగం, ప్రజల ఆదాయాలు తగ్గడం తదితర పరిణామాలు వస్తు డిమాండ్‌ను దెబ్బతీస్తున్నాయి. దీంతో కొనుగోళ్లు తగ్గుతున్నాయి. ఈ ప్రభావం కీలక మౌలిక వసతుల రంగాల ఉత్పత్తిపై ప్రభావం చూపుతుతున్నాయని తెలుస్తోంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో పరిశ్రమలు, ఉపాధి మరింత దెబ్బతినే అవకాశాలున్నాయి. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో జవృద్ధి రేటు 7.8 శాతంగా, సెప్టెంబర్ త్రైమాసికంలో ఏకంగా 8.2 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. సాధారణంగా దేశ జీడీపీలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ వాటా 27 శాతంగా ఉంది. పారిశ్రామిక ఉత్పత్తి ప్రభావం మిగితా రంగాలపై ప్రత్యక్షంగా కనబడుతుంది. అలాంటి పారిశ్రామికోత్పత్తి పేలవమైన ప్రదర్శన కనబర్చినప్పటికీ జీడీపీ పరుగులు పెడుతోన్నట్టు మోడీ సర్కార్ గణంకాలను ప్రకటించడం అనేక అనుమానాలకు తావిస్తోందని నిపుణులు విశ్లేషిస్తోన్నారు.

# న్యూజిలాండ్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాతో ఆలస్యమవుతున్నా, పలు దేశాలతో వరుసపెట్టి వాణిజ్య ఒప్పందాలను మనదేశం కుదుర్చుకుంటోంది. జులైలో బ్రిటన్, ఈ నెల మొదట్లో ఒమన్‌తో సంతకాలు చేయగా, తాజాగా న్యూజిలాండ్‌తో ఒప్పంద సంప్రదింపులను మనదేశం పూర్తి చేసింది. భారత, న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి (ఎఫ్‌టీఏ) సంబంధించిన సంప్రదింపులు కొలిక్కి వచ్చాయని భారత ప్రధాని నరేంద్ర మోదీ, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సోమవారం ప్రకటించారు. 2026 ప్రథమార్ధంలో సంతకాలు జరగనున్న ఈ ఎఫ్‌టీఏ కింద వచ్చే 15 ఏళ్లలో భారత్‌లో 20 బి. డాలర్ల (సుమారు రూ.1.8 లక్షల కోట్ల) పెట్టుబడులను న్యూజిలాండ్ పెట్టనుంది. ఇరుదేశాల మధ్య వస్తు, సేవల ద్వైపాక్షిక వాణిజ్యం 2024లో2.4 బిలియన్ డాలర్ల
(సుమారు రూ.21,600 కోట్ల) మేర జరిగింది. ఇందులో వస్తువుల వాటా 1.3 బి.డా. (సుమారు రూ.11,700 కోట్లు). ఎఫ్‌టీఏ కుదిరాక, అయిదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపై 5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.45,000 కోట్ల)కు చేరే అవకాశం ఉంది. ఉన్ని, బొగ్గు, కలప, వైన్, అవకాడో, బ్లూబెర్రీ వంటి 95% వస్తువులపై మనదేశం టారిఫ్‌ల రద్దు/తగ్గింపు చేస్తుంది. అయితే మన రైతులు, పరిశ్రమ ప్రయోజనాలను కాపాడడానికి డెయిరీ ఉత్పత్తులు, చక్కెర, సుగంధ ద్రవ్యాలు, నూనెలు, రబ్బరు దిగుమతులపై మాత్రం ఎటువంటి మినహాయింపులూ ఇవ్వలేదు.

# వినియోగదారుల హక్కుల పరిరక్షణ నెరవేరుతున్నదా!

**హైదరాబాద్ పెన్ పవర్:**వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణం.. వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కును కలిగి ఉండటమే వినియోగదారుల యొక్క హక్కు అని అర్థం. భారత దేశంలో 1986లో వినియోగదారుల ప్రయోజనార్థం, వారి హక్కుల పరిరక్షణ కోసం వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం రూపొందించారు. భారత రాష్ట్రపతి ఆమోదంతో 1986 డిసెంబర్ 24న ఉత్తర్వులు జారీ అయ్యాయి.ఈ చట్టం ప్రకారం వినియోగదారులకు ఆరు హక్కులు ప్రకటించింది. వినియోగదారుల రక్షణ మానవ ప్రాణాలకు, ఆస్తికి ప్రమాద కారక వస్తువులు, సేవల నుంచి రక్షణ పొందే హక్కు.. అవసరాలు తీర్చడమే కాకుండా, దీర్ఘకాలం మన్నే వస్తువులు, సేవలను పొందాలి. సమాచారం పొందే హక్కు...అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించేందుకు వస్తు నాణ్యత, బరువు, స్వచ్ఛత, పుష్టి, ప్రమాణం గురించి తెలియజేయాలి. నాణ్యమైన సేవలు పొందే సమాచారాన్ని తెలుసుకునే హక్కు ఉంది. వస్తువులను, సేవలను ఎంపిక చేసుకునే హక్కు...వివిధ రకాల వస్తువులు, సేవలు పొందేటప్పుడు వాటి మధ్య రేటు తెలుసుకోవడం మంచిది. సముచిత రేటులో నాణ్యత, సేవలు పొందడం. ప్రాతినిధ్యం వహించే హక్కు...వినియోగదారుల ఆసక్తిని, వారి అవసరాలను సరైన వేదికలు, ఫోరంలలో వినిపించడం. వినియోగదారుల సంక్షేమార్థం ఏర్పాటు చేసిన వివిధ వేదికలలో ప్రాతినిధ్యం వహించడం. వినియోగదారుల ఫోరంలో విజ్ఞప్తి చేయడం ద్వారా సేవాలోపాలు, వస్తు లోపాల నుండి పరిహారం పొందే హక్కు... వినియోగ దారులు మోసానికి గురయినప్పుడు ఫోరంలో కేసులు వేసి, తగిన పరిహారాన్ని పొందడం. వినియోగదారుల విద్య హక్కు... వినియోగ దారులు నిరంతరం తమ హక్కులను తెలుసుకుంటూ, తమ జ్ఞానాన్ని పెంచుకోవడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతో అవసరం. గ్రామీణ ప్రాంతాలలో వినియోగదారులు హక్కులపట్ల అవగాహన లేక ఎంతో మోసపోతున్నారు. నూతన వ్యాపారాభివృద్ధి సంస్కరణల వల్ల ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో, ఈ–కామర్స్, టెలిషాపింగ్ విధానంలో వస్తువుల్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రజలను మోసగించే సైబర్ నేరాలు దీని వల్ల చోటుచేసుకుంటున్నాయి. వినియోగదారులను తప్పుడు ప్రకటనలు, సందేశాలతో మోసగించడం పెరిగి పోతున్నది. దీంతో వినియోగదారుల హక్కుల రక్షణ కోసం కొత్త చట్టాల ఆవశ్యకత ఏర్పడింది. 1986నాటి చట్టం స్థానంలో 2019లో మరో చట్టాన్ని రూపొందించారు. అది ఈ 2020 సంవత్సరంలో అమలులోకి వచ్చింది. వాణిజ్య వ్యాపారాల్లో, ప్రభుత్వ యంత్రాంగంలో, సేవా సంస్థల్లో పనిచేసే వారు నిర్లక్ష్యంగా, మోస పూరితంగా వ్యవహరించి నప్పుడు కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రపంచంలోని చట్టాలన్నింటి కన్నా మెరుగ్గా భారతదేశంలో తొలిసారి 1986లో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని రూపొందించారు. తక్కువ సమయంలో, అతి తక్కువ రుసుముతో, దళారుల ప్రమేయం లేకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ వినియోగదారుల ఫోరాల్ని, కమిషన్లను ఆశ్రయించి వ్యక్తిగతంగా సత్వర న్యాయం పొందే సౌలభ్యం దీని ద్వారా లభించింది. ఇప్పుడు సైబర్ నేరాల కారణంగా దాని స్థానంలో కొత్త చట్టాన్ని తెచ్చారు. ఈ నూతన చట్టాన్ని 2020 జూలై 20 నుంచి దేశవ్యాప్తంగా అమలు పరుస్తున్నారు. వినియోగదారులకు తక్కువ ఖర్చులో, ఇబ్బందులకు తావు లేని రీతిలో, శీఘ్రంగా ఫిర్యాదులను పరిష్కరించే వెసులుబాటు కల్పించాలనే సంకల్పంతో దేశ వ్యాప్తంగా వేరు వేరు స్థాయిలలో వినియోగదారు వేదికలను నెలకొల్పడం జరిగింది. వినియోగదారు రక్షణ చట్టంలోని 9వ సెక్షన్ మూడు అంచెల వివాద పరిష్కార సంస్థల ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. (ఎ) కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే జాతీయ వినియోగదారు వివాదాల పరిష్కార సంఘం. ఈ కోర్టునే జాతీయ సంఘంగా వ్యవహరిస్తారు. (బి). కేంద్ర ప్రభుత్వం ముందస్తు అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే రాష్ట్ర వినియోగదారు పరిష్కార సంఘం. ఈ కోర్టునే రాష్ట్ర సంఘంగా కూడా వ్యవహరిస్తారు. (సి). రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఆ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేసే వినియోగదారు వివాదాల పరిష్కార వేదిక.ఈ కోర్టునే డిస్ట్రిక్ట్ ఫోరమ్‌గా కూడా వ్యవహరిస్తారు. ఈ ఏజెన్సీలన్నీ వాటి స్వభావం, అధికారాల పరంగా క్వాసీ– జ్యుడీషియల్ యంత్రాంగంగా పని చేస్తాయి. జాతీయస్థాయిలో సెంట్రల్ కన్స్యూమర్ అథారిటీ అనే ప్రత్యేక వ్యవస్థను రూపొందించి తగిన విచారణాధికారాలు, విచక్షణాధికారాలు కల్పించారు. ఇందులో డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారితో కూడిన కమిటీ ఉంటుంది. నేరాలకు పాల్పడినట్లు నిరూపితమైన వ్యక్తులపై, సంస్థలపై అవసరమైన చర్యలు తీసుకుంటారు. నూతన చట్టం ప్రకారం.. అరెస్టులు చేయించే అధికారం, మూడు సంవత్సరాల వరకు జైలుశిక్షను, పది లక్షల రూపాయల వరకూ జరిమానాను విధించే అధికారం సెంట్రల్ అథారిటీకి ఉంటుంది. జిల్లా కమిషన్లు ఇచ్చిన తీర్పులపై ఉన్నత రాష్ట్రస్థాయి కమిషన్‌ను ఆశ్రయించేందుకు వ్యతిరేక పార్టీ కనీసం యాభైశాతం లేదా రూ.25 వేలు రాష్ట్ర కమిషన్‌లో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గతంలో ఉన్న 30 రోజులకు బదులుగా 45 రోజులుగా కాలవ్యవధిని నిర్ణయించారు. రాష్ట్ర కమిషన్‌లో ప్రెసిడెంట్‌తో పాటు విధిగా నలుగురు సభ్యులుండాలి. రెండు బెంచీలు నిర్వహించి వినియోగ దారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషిచేయాలి.ఈ మేరకు రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అధ్యక్షులు, సభ్యుల నియామకం కాలాన్ని ఐదేండ్లకు బదులు నాలుగేండ్లకు కుదించారు. గరిష్ఠ వయస్సు 65 ఏండ్లుగా నిర్ణయించారు. రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో వినియోగ దారుల హక్కుల పరిరక్షణ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. నూతన వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో, కళాశాల, విశ్వ విద్యాలయాల్లో పాఠ్య పుస్తకాల్లో, పాఠ్యాంశాల్లో వినియోగదారుల విద్య, చట్టం ప్రాధాన్యం, అమలుపై గురించి తెలియజేయాలి.

# అపోలో 8 మిషన్ విశ్వాన్వేషణలో తొలి అడుగు

**హైదరాబాద్ పెన్ పవర్:** డిసెంబర్ 24, 1968, అంతరిక్ష పరిశోధనలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిన రోజు. ఆ రోజు, నాసా చేపట్టిన అపోలో 8 మిషన్ చంద్రుడి కక్ష్యలోకి చేరింది. ఇది మానవుల అంతరిక్ష పరిశోధనకు కీలక ఘట్టంగా నిలిచింది. అపోలో 8 మిషన్ ద్వారా మానవులు తొలిసారి చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించి, చంద్రుడి చుట్టూ పరిభ్రమించిన చరిత్ర సృష్టించారు. అపోలో 8 మిషన్, అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా చేపట్టిన అపోలో ప్రోగ్రామ్‌లో భాగంగా జరిగింది. 1968 డిసెంబర్ 21న, కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ మిషన్ ప్రారంభమైంది. వ్యోమగాములు ఫ్రాంక్ బోర్మన్, విలియం ఆండర్స్, జేమ్స్ లవెల్ చంద్రుడి కక్ష్యలోకి వెళ్లిన తొలి మానవులుగా నిలిచారు. డిసెంబర్ 24న అపోలో 8 చంద్రుడి కక్ష్యలో ప్రవేశించింది. వ్యోమగాములు చంద్రుడి చుట్టూ 10 సార్లు పరిభ్రమించారు. ఆ ప్రయాణంలో, వారు భూమి వైపు తిరిగి చూసి ప్రపంచానికి “ఎర్త్‌రైజ్” అనే ప్రసిద్ధ ఫొటో పంపారు. ఆ ఫోటో భూమిని చంద్రుడి నుండి ఆకాశంలో ఒక నీలి గోళంలా చూపిస్తుంది. ఇది భూమి అందాన్ని, పర్యావరణ పరిరక్షణను గుర్తుచేసే అత్యంత ప్రభావవంతమైన దృశ్యాల్లో ఒకటిగా నిలిచింది. డిసెంబర్ 24, 1968న అపోలో 8 నుంచి వ్యోమగాములు చందమామ నుంచి ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. ఈ ప్రసారంలో వారు
బైబిల్లోని ఆదికాండం మొదటి అధ్యాయాన్ని చదివి, ప్రపంచ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఇది చరిత్రలో అత్యధికంగా వీక్షించబడిన ప్రత్యక్ష ప్రసారముగా నిలిచింది. వారి సందేశం ప్రపంచ ప్రజలందరికీ శాంతి, సామరస్యానికి ప్రేరణ ఇచ్చింది. అపోలో 8 మిషన్, మానవుడు చంద్రుడిపై అడుగు పెట్టడానికి మార్గదర్శకమైంది. ఈ మిషన్ ద్వారా నాసాకు చంద్రుడి గురుత్వాకర్షణ, రేడియేషన్ స్థాయిలు వంటి అనేక ముఖ్యమైన సమాచారం లభించింది. అపోలో 8 మిషన్ విజయవంతమవడం, అంతరిక్ష పరిశోధనలో సాంకేతిక సామర్థ్యాలకు ప్రతీకగా నిలిచింది. చంద్రుడి కక్ష్యలో ప్రవేశించి సురక్షితంగా భూమికి తిరిగి రావడం మానవ ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. “ఎర్త్‌రైజ్” ఫొటో ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించింది. భూమి ప్రకృతి అందాలను కాపాడాల్సిన బాధ్యతను గుర్తు చేసింది. ఇది ఆపై పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలకు స్ఫూర్తిగా మారింది. మానవజాతి ఐక్యతకు సంకేతంగా మారి, ఈ మిషన్, మానవజాతి ఏకమై ఉన్నత లక్ష్యాలు సాధించగలదని
ప్రపంచానికి సందేశం అందించింది. డిసెంబర్ 24, 1968, అంతరిక్ష పరిశోధన చరిత్రలో చిరస్మరణీయమైన రోజు. అపోలో 8 మిషన్ ద్వారా మానవజాతి తన శాస్త్ర, సాంకేతిక ప్రగతిని చాటింది. ఈ రోజు మానవుల ఆత్మవిశ్వాసాన్ని, భవిష్యత్తు శోధనలకు నాంది పలికింది. “ఎర్త్‌రైజ్” ఫొటో మన భూమి విలువను గుర్తుచేస్తూ, మనం సంరక్షించాల్సిన బాధ్యతను తెలియజేస్తుంది. అపోలో 8 మిషన్ మానవ చరిత్రలో శాశ్వతంగా నిలిచే ఒక అద్భుత విజయగాథ.

# రోగనిరోధక శక్తిని పెంచే అంజీర్





## ఖాళీ కడుపుతో వెల్లుల్లి తింటే.. ఇన్ని ప్రయోజనాలా!

వెల్లుల్లి ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటుందని చాలా మందికి తెలుసు కానీ.. ఇక్కడ అందరికీ ఉన్న డౌట్ ఏమిటంటే.. వెల్లుల్లిని ఏ సమయంలో తినాలి.. ఖాళీ కడుపుతో వెల్లుల్లి తినడం సరైనదేనా అని?.. కాబట్టి ఇప్పుడు మనం వెల్లుల్లి ఖాళీ కడుపుతో తినడం సరైదేనా? వెల్లుల్లి ఇది లేకుంటే వంటకాలకు టేస్టే ఉండదు. ఇది కేవలం రుచికి మాత్రమే కాదు.. మన శరీరానికి ఔషధంగా కూడా పనిచేస్తుంది. ఇందులో ఉండే యాంటీ బాక్టీరియల్, క్రిమినాశక లక్షణాలు మనను అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయి. దీని ప్రధాన ప్రయోజనం అల్లిసిన్ అనే సమ్మేళనం వల్ల వస్తుంది. వెల్లుల్లిలో భాస్వరం, జింక్, పొటాషియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో విటమిన్ సి, విటమిన్ కె , ఫోలేట్ , నియాసిన్, థియామిన్ కూడా ఉన్నాయి. అయితే దీన్ని ఖాళీ కడుపుతో తినడం సరైనదా.. కాదా అని చాలా మందికి సందేహాలు ఉన్నాయి. అయితే దీన్ని ఖాళీ కడపుతో తినొచ్చని నిపుణులు అంటున్నారు. రోగనిరోధక శక్తి: వెల్లుల్లి శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. వెల్లుల్లిలోని అల్లిసిన్ ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. అలాగే, ఇది జలుబు, ఫ్లూ వంటి సమస్యలను దూరం చేస్తుంది.గుండె ఆరోగ్యం: ఉదయం ఖాళీ కడుపుతో వెల్లుల్లి తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు సమతుల్యం అవుతాయి. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను నిర్వహించేందుకు సహాయపడుతుంది. ఇది రక్తపోటును సైతం నియంత్రించి గుండె ఆరోగ్యానికి మెరుగుపరుస్తుంది. బరువు తగ్గడం: బరువు తగ్గాలనుకునే వారికి వెల్లుల్లి ఒక మంచి ఎంపిక.. ఇది జీవక్రియను సక్రియం చేస్తుంది, ఇది మన శరీరంలోని కొవ్వును వేగంగా కరిగించడానికి సహాయపడుతుంది. పచ్చి వెల్లుల్లిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్లా త్వరగా బరువు తగ్గవచ్చు. జీర్ణక్రియ: ఖాళీ కడుపుతో వెల్లుల్లి తినడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. అలాగే గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. దీన్ని తినడం వల్ల కడుపు తేలికగా అనిపిస్తుంది. చర్మం,జుట్టుకు ప్రయోజనాలు: వెల్లుల్లి చర్మంతో పాటు జుట్టుకు కూడా ప్రయోజకరంగా ఉంటుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని స్పష్టంగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. దీని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. అదే సమయంలో, ఇది జుట్టును బలపరుస్తుంది, జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది. ఉదయం పళ్ళు తోముకున్న తర్వాత వెల్లుల్లి రెబ్బ తొక్క తీసి తేలికగా నమలవచ్చు. లేకపోతే, నీటిలో నానబెట్టుకొని కూడా తినవచ్చు. ఒక వేళ పచ్చి వెల్లుల్లి తినడం మీకు కష్టంగా అనిపిస్తే, దాని మెత్తగా దంచి గోరువెచ్చని నీటిలో వేసుకొని తాగవచ్చు. అయితే ఇక్కడ మీరు గుర్తుంచుకోవలసి విషయం ఏమిటంటే మీకు ఏవైనా అలెర్జీ సమస్యలు ఉంటే, మీరు దానిని తినకుండా జాగ్రత్త వహించాలి. అలాగే, దీనిని తక్కువ పరిమాణంలో తీసుకోవడం చాలా ముఖ్యం.

చలికాలంలో అంజీర్ పండ్లు అద్భుతమైన ఔషధంగా పనిచేస్తాయి. ఆయుర్వేదం, ఆధునిక వైద్యం రెండూ గుర్తించిన ఈ సూపర్ ఫుడ్ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఎముకల బలం, మలబద్ధక నివారణ, గుండె ఆరోగ్యం, మధుమేహ నియంత్రణ, రక్తహీనత దూరం, బరువు తగ్గడానికి తోడ్పడుతుంది. చలికాలం వచ్చిందంటే చాలు.. బాడీలో ఇమ్యూనిటీ తగ్గి రకరకాల ఇన్ఫెక్షన్లు చుట్టుముడుతుంటాయి. ఈ సమయంలో ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన వరం అంజీర్. ఆయుర్వేదం, ఆధునిక వైద్యం రెండూ సూపర్‌ఫుడ్‌గా గుర్తించిన అంజీర్ పండ్లు.. చలికాలంలో ఔషధంగా పనిచేస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి. అంజీర్ పండ్లు కాల్షియానికి కేరాఫ్ అడ్రస్. వయసు పెరిగే కొద్దీ వచ్చే ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల వ్యాధుల నుండి ఇది రక్షణ కల్పిస్తుంది. ముఖ్యంగా చలికాలంలో వేధించే కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందాలంటే అంజీర్ తప్పనిసరి. చలికాలంలో నీరు తక్కువగా తాగడం వల్ల చాలామంది మలబద్ధకంతో బాధపడుతుంటారు. అంజీర్‌లో ఉండే అధిక ఫైబర్ కంటెంట్ సహజ విరేచనకారిలా పనిచేసి, పేగులను శుభ్రపరుస్తుంది. రక్తంలోని చెడు కొవ్వు (ట్రైగ్లిజరైడ్స్) స్థాయిలను తగ్గించడంలో అంజీర్ కీలక పాత్ర పోషిస్తుంది. దీనిలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తూ, గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంజీర్ తియ్యగా ఉన్నప్పటికీ దీనిలో ఉండే క్లోరోజెనిక్ ఆమ్లం శరీరంలో ఇన్సులిన్ స్థాయిలను మెరుగుపరుస్తుంది. ఇది టైప్-2 డయాబెటిస్ బాధితులకు మేలు చేస్తుంది. శరీరంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉండి, త్వరగా అలసిపోయేవారికి అంజీర్ ఒక వరం. దీనిలోని ఐరన్ కంటెంట్ రక్తాన్ని వృద్ధి చేసి శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. విటమిన్ సి, ఇ, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే అంజీర్ పండ్లు.. జలుబు, దగ్గు వంటి వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని కాపాడతాయి. చర్మం పొడిబారకుండా కాంతివంతంగా ఉండేలా చేస్తాయి. శీతాకాలంలో బరువు పెరగకుండా ఉండాలంటే అంజీర్‌ను స్నాక్‌గా తీసుకోవచ్చు. ఇది తిన్న తర్వాత ఆకలి త్వరగా వేయదు, దీనివల్ల జీవక్రియ వేగవంతమవుతుంది. నిపుణుల సూచన ప్రకారం.. రెండు అంజీర్ పండ్లను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో ఆ పండ్లను తిని, ఆ నీటిని కూడా తాగాలి. ఇలా చేయడం వల్ల పోషకాలు శరీరానికి పూర్తిస్థాయిలో అందుతాయి.



## మునగ వీరికి విషంతో సమానమే!

మునగ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఆరోగ్యానికి మేలు చేసే విటమిన్లు, ఖనిజాలు,యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల వివిధ ప్రయోజనాలను పొందవచ్చు. మునగ సాధారణంగా దాదాపు అన్ని సీజన్లలో లభిస్తుంది. మునగ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఆరోగ్యానికి మేలు చేసే విటమిన్లు, ఖనిజాలు,యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల వివిధ ప్రయోజనాలను పొందవచ్చు. మునగ సాధారణంగా దాదాపు అన్ని సీజన్లలో లభిస్తుంది. దీని రుచి, ఆరోగ్య ప్రయోజనాల కారణంగా వివిధ కూరలు, సూప్‌లు, సాంప్రదాయ వంటకాలలో ఉపయోగిస్తుంటారు. మునగ కాయలేకాదు దీని ఆకుల్లో కూడ సహజంగా లభించే ప్రోటీన్ పుష్కలంగా ఉంటాయి. మునగ కాయ జీర్ణక్రియ, రోగనిరోధక శక్తి, వాపుకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. దీని ఔషధ గుణాల కారణంగా వంటల్లో విస్తృతంగా వినియోగిస్తుంటారు. కానీ మునగతో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ కొంతమంది ఆరోగ్యానికి ఇది అస్సలు మంచిది కాదు. ఇలాంటి వారు మునగ వంటకాలు తినడం కోరి సమస్యలను కొని తెచ్చుకోవడమే. మునగ వంటకాలు తినాలా? వద్దా? అనేది ఆయా వ్యక్తుల ఆరోగ్య పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. గర్భిణీలు మునగ తినకపోవడమే మంచిది. ఎందుకంటే ఇది శరీరంలో వేడిని ఉత్పత్తి చేస్తుంది. ఇది గర్భధారణ సమయంలో అసౌకర్యం, సమస్యలకు దారితీస్తుంది. అలాగే పీరియడ్స్ సమయంలో అధిక రక్తస్రావంతో ఇబ్బంది పడే స్త్రీలు కూడా మునగ తినకుండా ఉండాలి. దీనిలోని వేడి లక్షణాలు రక్తస్రావాన్ని మరింత పెంచుతాయి. అంతేకాకుండా శరీరంలో బలహీనత, అసౌకర్యాన్ని కూడా కలిగిస్తాయి. మునగ సహజంగానే రక్తపోటును తగ్గిస్తుంది. అయితే ఇప్పటికే తక్కువ రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులు ఈ కూరగాయను తినకూడదు. ఎందుకంటే ఇది పరిస్థితిని మరింత దిగజార్చవచ్చు. తలతిరగడం, అలసట వంటి లక్షణాలతో బాధపడే వారు కూడా మునగ కాయల వినియోగాన్ని పరిమితం చేయాలి. దీర్ఘకాలిక జీర్ణ సమస్యలతో బాధపడేవారు మునగ ఎక్కువగా తినకూడదు. వీటిని పరిమితంగా తీసుకోవాలి లేదంటే పూర్తిగా మానేయాలి. ఎందుకంటే ఇందులో ఫైబర్, శక్తి శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది కొంతమందిలో ఉబ్బరం, ఆమ్లత్వం, కడుపులో అసౌకర్యాన్ని కలిగిస్తుంది. కాబట్టి మునగ తినేటప్పుడు కొంచెం జాగ్రత్తగా ఉండటం మంచిది.

## రాత్రి భోజనంలో తప్పులు ఈ వ్యాధులకు కారణం

బ్రేక్ ఫాస్ట్ ఎంత ముఖ్యమో, రాత్రి తినే ఆహారం కూడా అంతే ముఖ్యం. మీ డిన్నర్ లో 3 తప్పులు చేస్తే, తప్పకుండా షుగర్, బిపి, కొలెస్ట్రాల్, బ్లడ్ ప్రెజర్, గుండె జబ్బులు తప్పకుండా వస్తాయని డైటీషియన్ రిచా హెచ్చరిస్తున్నారు. రాత్రిపూట ఆలస్యంగా తినడంలో చేసే తప్పులు: కొన్ని అధ్యయనాలు 90% ఆహారం రాత్రిపూట తింటాయని చెబుతున్నాయి. మనం రోజంతా బిజీగా ఉండటం వల్ల, రాత్రిపూట ప్రశాంతంగా తినవచ్చు. మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారాలు, బిర్యానీ వంటి ఆహారాలు, చపాతీ వంటి ఆహారాలు, కారంగా ఉండే ఆహారాలు ఎక్కువగా తీసుకుంటారు. తదుపరి తప్పు ఏమిటంటే రాత్రి భోజనం చాలా ఆలస్యంగా తినడం. మూడవ తప్పు ఏమిటంటే, రాత్రి భోజనం చేసిన తర్వాత సెల్ ఫోన్‌లో కొంత సమయం గడిపి నేరుగా పడుకోవడం. ఇది చాలా చాలా తప్పు విషయం. రాత్రి భోజనం చేయడానికి, నిద్రించడానికి మధ్య కనీసం మూడు గంటల గ్యాప్ ఉండాలి. ఈ తప్పులన్నీ చేయడం వల్ల తలెత్తే సమస్యలు మీపైకి వస్తాయని పోషకాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. చెడు కొలెస్ట్రాల్ పెరిగే సమస్య: రాత్రిపూట బిర్యానీ తినే అలవాటు ఇప్పుడు చాలా పెరుగుతోంది. దీనితో పాటు, వారు కబాబ్స్ మరియు చికెన్ 65 వంటి వేయించిన, డీప్-ఫ్రై చేసిన ఆహారాలను కూడా తింటారు. అధిక కొవ్వు, ముఖ్యంగా సంతృప్త కొవ్వు, చెడు కొలెస్ట్రాల్ అని పిలువబడే ట్రాన్స్ ఫ్యాట్, %ాణూ% కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతాయి. ప్రేగు కదలిక సమస్యలు: సిర్కాడియన్ రిథమ్ ప్రకారం, సూర్యాస్తమయం తర్వాత శరీర అవయవాలు విశ్రాంతి తీసుకోవడం ప్రారంభిస్తాయి. ఆ సమయంలో, రాత్రి భోజనం ఆలస్యంగా లేదా కఠినమైన ఆహారం రూపంలో తిన్నప్పుడు, అది రాత్రంతా జీర్ణం కాకుండా కడుపులోనే ఉంటుంది. జీర్ణవ్యవస్థ మరుసటి రోజు ఉదయం మళ్ళీ పనిచేయడం ప్రారంభిస్తుంది. రాత్రి భోజనం జీర్ణం కావడానికి ముందు, మనం అల్పాహారం తినడం ప్రారంభిస్తాము. మనం స్నాక్స్, తదుపరి భోజనం తిన్నప్పుడు, అవి జీర్ణం కావు. అపానవాయువు, ఉబ్బరం, గుండెల్లో మంటకు కారణమవుతాయి మరియు ఇది దీర్ఘకాలిక స్థితిలో కొనసాగితే, పెద్దప్రేగు క్యాన్సర్ వస్తుంది. మధుమేహం వచ్చే ప్రమాదం: మధుమేహం రావడానికి అతి ముఖ్యమైన ప్రమాద కారకాల్లో ఒకటి పేలవమైన ఆహారపు అలవాట్లు. ప్రజలు రోజంతా నియంత్రణలో ఉండవచ్చు కానీ రాత్రి సమయంలో నియంత్రణ కోల్పోతారు. లేదా, దోస, చపాతీ వంటి కార్బోహైడ్రేట్ ఆహారాలు రాత్రిపూట తినడం, ఆలస్యంగా తినడం, అధిక గ్లైసెమిక్ సూచిక ఉన్న ఆహారాలు తీసుకోవడం ద్వారా, శరీరంలో రక్తంలో




గ్లూకోజ్ స్థాయి రాత్రంతా ఎక్కువగా ఉంటుంది. ఇది ఉదయం రక్తంలో చక్కెర స్థాయిలు గణనీయంగా పెరగడానికి దారితీస్తుంది. రక్తపోటు, గుండె జబ్బుల ప్రమాదాలు: రాత్రి ఆలస్యంగా తినడం, చాలా ఆలస్యంగా నిద్రపోవడం వల్ల శరీరంలో ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ పెరుగుతుంది. ఒత్తిడి పెరిగినప్పుడు, రక్తపోటు పెరుగుతుంది. ఇది రాత్రిపూట గుండెకు మంచిది కాదు. రాత్రిపూట రక్తపోటులో హెచ్చుతగ్గులు గుండెపోటు వంటి సమస్యలకు దారితీయవచ్చు. ఊబకాయం సంబంధిత సమస్యలు: మీరు రాత్రిపూట బిర్యానీ, స్పైసీ ఫుడ్స్ మరియు కార్బోహైడ్రేట్లు కలిగిన అధిక కేలరీల ఆహారాలు తిన్నప్పుడు, మీ కేలరీలు సహజంగా పెరుగుతాయి. ఇది బరువు పెరగడానికి దారితీస్తుంది. మీరు ఇలా చేస్తూనే ఉంటే, ఆలస్యంగా నిద్రపోతే, రాత్రిపూట ఆకలిగా ఉండి జంక్ ఫుడ్ తింటే, మీరు అత్యంత తీవ్రమైన ఊబకాయం సమస్యతో బాధపడతారు.

## ఈ తప్పులతో జ్ఞాపకశక్తి గల్లంతే..

మన మెదడు అత్యంత కీలకమైన అవయవం. తెలియకుండానే మనం చేసే కొన్ని అలవాట్లు దాని పనితీరును దెబ్బతీస్తాయి. నిద్రలేమి, అధిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం, జంక్ ఫుడ్, డిజిటల్ వ్యసనం జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను తగ్గిస్తాయి. మన శరీరంలో అత్యంత కీలకమైన, సున్నితమైన అవయవం మెదడు. ఇది మనం నిద్రపోతున్నప్పుడు కూడా విశ్రాంతి లేకుండా పనిచేస్తూనే ఉంటుంది. అయితే మనకు తెలియకుండానే మనం చేసే కొన్ని చిన్న చిన్న తప్పులు మెదడు పనితీరును దెబ్బతీస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జ్ఞాపకశక్తి తగ్గడం, ఏకాగ్రత లోపించడం వంటి సమస్యలకు కారణమయ్యే ఆ 5 ప్రమాదకరమైన అలవాట్లు ఏమిటో ఇప్పుడు చూద్దాం.నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది నిద్రను త్యాగం చేస్తున్నారు. కానీ నిద్ర లేకపోవడం వల్ల మెదడు కణాలకు తీరని నష్టం జరుగుతుంది. మనం నిద్రపోతున్నప్పుడు మెదడు రోజంతా సేకరించిన సమాచారాన్ని భద్రపరుస్తుంది. వ్యర్థాలను శుభ్రం చేస్తుంది. నిద్ర తగ్గితే మెదడు మొద్దుబారిపోయి అల్జీమర్స్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. చిన్నపాటి ఒత్తిడి పనులను త్వరగా పూర్తి చేయడానికి సహాయపడవచ్చు.. కానీ నిరంతర ఒత్తిడి మెదడుకు విషం లాంటిది. ఒత్తిడి పెరిగినప్పుడు శరీరంలో కార్టిసాల్ అనే హార్మోన్ విడుదలవుతుంది. ఇది మెదడులో జ్ఞాపకశక్తికి కేంద్రమైన హిప్పోకాంపస్ అనే భాగాన్ని దెబ్బతీస్తుంది. దీనివల్ల విషయాలను త్వరగా మర్చిపోవడం, నిర్ణయాలు తీసుకోవడంలో తడబడటం వంటివి జరుగుతాయి. వ్యాయామం కేవలం కండరాల కోసమే కాదు మెదడు చురుగ్గా ఉండటానికి కూడా అవసరం. మనం వ్యాయామం చేసినప్పుడు మెదడుకు రక్త ప్రసరణ పెరిగి, తగినంత ఆక్సిజన్ అందుతుంది. ఇది కొత్త మెదడు కణాలు పుట్టడానికి సహాయపడుతుంది. రోజంతా ఒకే చోట కూర్చుని ఉండటం వల్ల మెదడు పనితీరు నెమ్మదిస్తుంది. జంక్ ఫుడ్ -అధిక చక్కెరమనం తినే ఆహారం మెదడు ఆరోగ్యంపై నేరుగా ప్రభావం చూపుతుంది. ప్రాసెస్ చేసిన ఆహారాలు, అధిక చక్కెర ఉన్న స్వీట్లు, సోడాలు మెదడులో వాపును కలిగిస్తాయి. ఇవి మెదడులోని న్యూరాన్ల మధ్య సమాచార మార్పిడిని అడ్డుకుంటాయి. తెలివితేటలు పెరగాలంటే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉండే వాల్‌నట్స్, చేపలు, ఆకుకూరలు తీసుకోవడం ఉత్తమం. గంటల తరబడి స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియాలో గడపడం వల్ల మెదడుపై తీవ్రమైన భారం పడుతుంది. ముఖ్యంగా రాత్రివేళ మొబైల్ నుంచి వచ్చే నీలి కాంతి మెదడును నిద్రపోనివ్వదు. ఇది ఏకాగ్రతను దెబ్బతీయడమే కాకుండా, మెదడును ఎప్పుడూ అలసిపోయినట్లు చేస్తుంది. మెదడు ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. సరైన నిద్ర, పౌష్టికాహారం, ఒత్తిడి లేని జీవనం అలవాటు చేసుకుంటే వృద్ధాప్యంలో కూడా మీ మెదడు 20 ఏళ్ల యువకుడిలా చురుగ్గా పనిచేస్తుంది.



# టీ20ల్లో వరల్డ్ రికార్డు సృష్టించిన ఇండోనేషియా బౌలర్

- ఒకే ఓవర్‌లో ఐదు వికెట్లు తీసిన ఇండోనేషియా బౌలర్ ప్రియాందన
- కంబోడియాతో జరిగిన మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన
- తొలి మూడు బంతుల్లోనే హ్యాట్రిక్ పూర్తి
- అంతర్జాతీయ టీ20ల్లో ఈ ఘనత సాధించిన తొలి బౌలర్‌గా గుర్తింపు




**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో అపూర్వమైన ఘట్టం ఆవిష్కృతమైంది. ఇండోనేషియాకు చెందిన ఫాస్ట్ బౌలర్ గెడె ప్రియాందన ఒకే ఓవర్‌లో ఐదు వికెట్లు పడగొట్టి సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. టీ20 ఫార్మాట్‌లో ఇప్పటివరకు ఎవరికీ సాధ్యం కాని ఈ అద్భుత ఫీట్‌ను సాధించిన తొలి బౌలర్‌గా చరిత్రకెక్కాడు. బాలి వేదికగా కంబోడియాతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో మంగళవారం ఈ సంచలనం చోటుచేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండోనేషియా, ధర్మ కేసుమా అజేయ శతకం (110) సాయంతో 167 పరుగులు చేసింది. అనంతరం 168 పరుగుల లక్ష్య ఛేదనలో కంబోడియా 15 ఓవర్లు ముగిసేసరికి 5 వికెట్లకు 106 పరుగులతో ఫర్వాలేదనిపించింది. కానీ, 16వ ఓవర్ బౌలింగ్‌కు వచ్చిన ప్రియాందన మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. ప్రియాందన తన ఓవర్‌లోని తొలి మూడు బంతులకు 3 వికెట్లు తీసి హ్యాట్రిక్ నమోదు చేశాడు. నాలుగో బంతి డాట్ కాగా, చివరి రెండు బంతులకు మరో రెండు వికెట్లు పడగొట్టాడు. చివరి రెండు బంతుల మధ్య ఒక వైడ్ ఉండడంతో ఈ ఓవర్లో ఒక అదనపు పరుగు మాత్రమే వచ్చింది. దీంతో కంబోడియా 107 పరుగులకే ఆలౌట్ కాగా, ఇండోనేషియా 60 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఇంతకుముందు టీ20ల్లో లసిత్ మలింగ, రషీద్ ఖాన్, జేసన్ హోల్డర్ వంటి దిగ్గజాలు ఒకే ఓవర్‌లో నాలుగు వికెట్లు తీసిన సందర్భాలు ఉన్నప్పటికీ, ఐదు వికెట్లు తీయడం ఇదే తొలిసారి. ప్రియాందన అసాధారణ ప్రదర్శన ప్రస్తుతం క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది.

# ఎంత కష్టం బాసూ : పంజాబ్ తరపున రంజీ మ్యాచ్ ఆడనున్న శుభమన్ గిల్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ 20 వరల్డ్ కప్ జట్టులో స్థానం కోల్పోయిన శుభమన్ గిల్.. ఇప్పుడు ఏం చేస్తున్నాడు అనే డౌట్ అందరికీ వచ్చే ఉంటుంది.. దానికి క్లారిటీ ఆన్సర్ ఇప్పుడు దొరికింది. రంజీ మ్యాచ్ లు ఆడనున్నాడు.. అవును.. పంజాబ్ తరపున రంజీ ట్రోఫీలో శుభమన్ గిల్ ఆడనున్నాడు. శుభ్‌మన్ గిల్ 2025-26 విజయ్ హజారే ట్రోఫీలో పంజాబ్ తరపున రెండు మ్యాచ్‌లు ఆడనున్నాడు, తర్వాత న్యూజిలాండ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం టీమ్ ఇండియాలో చేరనున్నాడు. 2025-26 విజయ్ హజారే ట్రోఫీ డిసెంబర్ 24 నుండి జనవరి 18 వరకు జరుగుతుంది, అయితే ఇండియా న్యూజిలాండ్ మధ్య మూడు వన్డేలు జనవరి 11న వడోదరలో, జనవరి 14న రాజ్‌కోట్‌లో జనవరి 18న ఇండోర్‌లో జరగనున్నాయి. గిల్ జనవరి 3, 6 తేదీలలో జైపూర్‌లో సిక్కిం, గోవాతో జరిగే పంజాబ్ ఎలైట్ గ్రూప్ సి విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లలో ఆడనున్నాడు. ఆ తర్వాత, ఇండియా న్యూజిలాండ్ సిరీస్ ముగిసిన తర్వాత, రంజీ ట్రోఫీలోని మిగిలిన గ్రూప్ మ్యాచ్‌లలో పంజాబ్ జట్టుకు కూడా ప్రాతినిధ్యం వహించనున్నాడు.

శనివారం ఇండియా టీ20 టీంలో చోటు దక్కలేదని తెలిసిన తర్వాత ప్రీమియర్ డొమెస్టిక్ రెడ్ బాల్ టోర్నమెంట్ లో ఆడాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. గిల్ ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో ఇండియా వైస్ కెప్టెన్ గా వ్యవహరించాడు, ఈ సిరీస్ లో పేలవమైన పర్ఫామెన్స్ కారణంగా న్యూజిలాండ్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల %ь%20 సిరీస్‌తో పాటు 2026 %ь%20 ప్రపంచ కప్‌కు గిల్‌ను తొలగించాలని నిర్ణయించింది సెలెక్షన్ కమిటీ.

# ధోనీ నా కెరీర్ నాశనం చేశాడా.. నోరు విప్పిన మాజీ స్టార్ క్రికెటర్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ క్రికెట్ ప్రపంచంలో.. ఇప్పుడు ఓ వార్త చక్కర్లు కొడుతుంది. ఆ క్రికెటర్ కెరీర్ ను.. ధోనీ నాశనం చేశాడు.. ధోనీ వల్లే అతని క్రికెట్ కెరీర్ అర్థాంతరంగా ముగిసింది.. ఇలాంటి వార్తలు సోషల్ మీడియాలో వస్తున్నాయి. ఇంతకీ ఎవరా క్రికెటర్.. ఇప్పుడు అతను బయటకు వచ్చిన ఏం చెప్పాడు అనేది తెలుసుకుందామా..

ఆ మాజీ క్రికెటర్ పేరు అమిత్ మిశ్రా. ఇండియన్ మాజీ లెగ్ స్పిన్నర్. టెస్ట్ క్రికెట్ లో 22 మ్యాచ్ లు ఆడాడు.. 76 వికెట్లు పడగొట్టాడు. వన్డేల్లో 36 మ్యాచ్ లు ఆడి 64 వికెట్లు తీశాడు. టీ 20 కెరీర్ లో 10 మ్యాచ్ లు ఆడి 16 వికెట్లు తీశాడు. ధోనీ కెప్టెన్సీకి వచ్చిన కొత్తలో.. అమిత్ మిశ్రా అప్పటికే జట్టులో ఉన్నాడు. ధోనీ కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత.. అతను జట్టు నుంచి తొలగించబడ్డాడు. అప్పటి విషయం ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో.. ఊహాగానాలతో కథనాలు వస్తున్నాయి. దీనిపై అమిత్ మిశ్రా ఇప్పుడు నోరు విప్పాడు.. అతని మాటల్లోనే ధోనీ గురించి ఏమంటున్నాడో చూద్దాం..

ధోనీ వల్లే నా క్రికెట్ జీవితం నాశనం అయ్యిందనే వార్తల్లో నిజం లేదు.. నేను ఎప్పుడూ.. ఎక్కడా ఈ మాటలు అనలేదు అంటున్నాడు. ధోనీ కెప్టెన్సీలో నేను ఆడాను.. నాకు ఎన్నో సూచనలు, సలహాలు ఇచ్చాడు ధోనీ అని చెప్పుకొచ్చాడు. ధోనీ లేకపోతే నేను జట్టులో కూడా ఉండేవాడిని కాదు.. నేను ధోనీ కెప్టెన్సీలో జట్టులోకి వచ్చాను.. మళ్లీ మళ్లీ వచ్చాను.. కెప్టెన్ గా ధోనీ నాకు చాలా అవకాశాలు ఇచ్చాడు అని చెప్పుకొచ్చాడు అమిత్ మిశ్రా. నేను న్యూజిలాండ్ దేశంలో.. అక్కడ సిరీస్ ఆడుతున్నప్పుడు ధోనీతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశాడు అమిత్ మిశ్రా. నేను బౌలింగ్ చేస్తున్నాను.. అప్పుడు ధోనీ నా దగ్గరకు వచ్చి.. వికెట్ల కోసం కాదు.. పరుగులు కంట్రోల్ చేసే విధంగా బౌలింగ్ చేయాలి.. వాళ్ల టార్గెట్ పెద్దగా ఉన్నది.. పరుగులను కంట్రోల్ చేసినట్లయితే వికెట్లు ఆటోమేటిక్ గా వస్తాయి అంటూ ధోనీ చేసిన సూచన మంచి ఫలితాన్ని ఇచ్చిందన్నాడు అమిత్ మిశ్రా. అదే మ్యాచ్ లో.. ఒత్తిడికి గురవుతున్న నన్ను ప్రోత్సహించింది.. దైర్యం చెప్పింది కూడా ధోనీనే అంటూ వివరించాడు అమిత్ మిశ్రా. ఎక్కువగా ఆలోచించొద్దని.. ఎప్పుడూ బౌలింగ్ వేసినట్లే బౌలింగ్ వేయాలని.. వికెట్ల కోసం ఎక్కువగా ఆలోచించొద్దు అని చెప్పాడని.. ఆ మ్యాచ్ లో నేను 5 వికెట్లు తీశానని.. అది కూడా ధోనీ సూచనలతోనే సాధ్యం అయ్యిందని.. నా బౌలింగ్ కెరీర్ లో అదే బెస్ట్ అని వివరించాడు అమిత్ మిశ్రా. ధోనీ కెప్టెన్ కాకుండా ఉండి ఉంటే.. అమిత్ మిశ్రా కెరీర్ మరోలా ఉండేదంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై అమిత్ మిశ్రా స్పందన ఇదీ..

# అవతార్ 4 - అవతార్ 5 అవసరం లేదు!





లెజెండరీ దర్శకుడు జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన అవతార్ 3 (ఫైర్ అండ్ యాష్) ఇటీవల విడుదలై మిశ్రమ సమీక్షలను అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటికీ క్రిటిక్స్ ఈ సినిమాని రకరకాల కోణాల్లో విశ్లేషిస్తూనే ఉన్నారు. అవతార్ 1, అవతార్ 2 తరహాలోనే అవతార్ 3 పైనా చాలామంది చాలా రకాలుగా విశ్లేషిస్తున్నారు. కొందరు నెగెటివ్ గా కొందరు పాజిటివ్ గా, చాలా మంది కామెరూన్ ప్రతిభ చూపించిన కొన్ని సీన్ల గురించి, అసాధారణ సాంకేతిక విషయాల గురించి విశ్లేషిస్తూనే ఉన్నారు.

తాజాగా ప్రఖ్యాత క్రిటిక్ కొలిడెర్ విశ్లేషణ ప్రకారం.. ఇకపై ఈ ఫ్రాంఛైజీలో కొత్త సినిమాలు అవసరం లేదు. ఇప్పటికే కథను ముగించేసాడు... అని అన్నాడు. ఇంకా అతడు విశ్లేషిస్తూ... కామెరాన్ ఆశయానికి ఫైర్ అండ్ యాష్ బలమైన నిదర్శనం... సినిమాటిక్ సరిహద్దులను దాటి కొత్త ప్రపంచాన్ని పరిచయం చేయడంలో, బ్లాక్‌బస్టర్ టెంప్లేట్‌ను తిరిగి ఆవిష్కరించడంలో లేదా ఇంత జాగ్రత్తగా కల్పిత ప్రపంచాన్ని నిర్మించడంలో ఏ దర్శకనిర్మాత కూడా కామెరూన్ అంత గొప్పవాడు కాదు. ది టెర్మినేటర్, ఏలియన్స్ ,టెర్మినేటర్ 2: జడ్జిమెంట్ డే , టైటానిక్ వరకు తన కెరీర్ అంతటా అతడు అదే చేశాడు. ప్రేక్షకులు ఏ కథ అయితే ఆకర్షించగలదని భావిస్తాడో దానిని అతడు పదే పదే విస్తరించాడు. అవతార్‌తోను అతడు అదే చేసాడు. వలసవాదం, పర్యావరణ నిర్వహణ, కుటుంబ బంధాల గురించి ఒక విస్తృతమైన కథను చెప్పడానికి అవతార్ లను తయారు చేసాడు. అయితే కేవలం మూడు చిత్రాలతో ఇది సరిపోతుంది అన్నంతగా చూపించాడు. ప్రతిఘటన.. కుటుంబ ఉద్రిక్తత అన్నీ పూర్తిగా ఇప్పటికే చూపించాడు.

నిజానికి అతడు అవతార్ సిరీస్ కి ఎండ్ కార్డ్ వేసినట్టుగా అనిపిస్తోంది. అతడు అవతార్ 3తో ముగింపును ఇచ్చేసాడు. ఇక కొత్త కొనసాగింపు దీనికి అనవసరం అని విశ్లేషించారు. ఈ మూడో భాగం ముగింపులో దీర్ఘకాలికంగా తవ్వడానికి అవసరమయ్యే ప్రశ్న లేదా పరిష్కారం కాని భావోద్వేగ థ్రెడ్ ఏదీ కనిపించడం లేదు. అందువల్ల కామెరూన్ నుంచి ప్రజలు మరొక సీక్వెల్‌ను కోరుకోవడం లేదు... అని కొలిడెర్ విశ్లేషించారు.పండోర ఇప్పుడు పూర్తిగా ఊహించిన ప్రపంచం. అది జీవించి ఉన్నట్లు స్పష్టంగా అనిపిస్తుంది. కానీ మూడు భాగాలలో చెప్పిన కథకు ఇప్పటికే దర్శకుడు ముగింపును ఇచ్చేసాడు. అవతార్ 4, అవతార్ 5 ఈ విశ్వాన్ని అంతగా విస్తరించవు.. గత రెండు భాగాల్లో విషయాలను భవిష్యత్ సినిమాలు రిపీట్ చేయలేవు. కామెరాన్ ఎప్పుడూ నిర్దేశించని ప్రపంచాలలోకి అడుగుపెడుతూనే ఉంటాడు. బహుశా ఇప్పుడు అతడు పండోరాను వదిలి వెళ్ళే సమయం ఆసన్నమైంది. కామెరూన్ విఫలమైనందున కాదు.. కానీ అతడు అవతార్‌ను ఇప్పటికే సాధ్యమైనంత లోతుగా చూపించేసాడు. ఇక చూపించడానికి ఏమీ లేనంతగా... అందుకే ఇక తదుపరి భాగాలు అవసరం లేదు! అని విశ్లేషించారు.



ఈషా రెబ్బా యొక్క నిర్మలమైన కొత్త పోర్ట్రెయిట్ హృదయాలను గెలుచుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965